# హితోపదేశం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

# హితోపదేశం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు


సంపాదకులు

**జె.యస్.వి.ప్రసాద్**, ఐ.ఎ.యస్

**కె.వి.రమణ**, ఐ.ఎ.యస్



ప్రకాశకులు:

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు

హితోపదేశం
ద్వితీయ ముద్రణ: మే, 2021
ప్రతులు: 2000
హక్కులు: ప్రకాశకులవి

ప్రకాశకులు:
శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

ప్రతులకు:
1. శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265, పశ్చిమ గోదావరి జిల్లా
ఫోన్: 9848523805

2. వి. సునీల్,
శ్రీ రవికాంత్ ఏజన్సీస్,
మండపేట – 533 308, తూర్పు గోదావరి జిల్లా
ఫోన్: 7013991234

గ్రాఫిక్స్:
శ్రీ గాయత్రీదేవి గ్రాఫిక్స్,
గాంధినగర్, విజయవాడ – 520 003
ఫోన్: 9440636178

ముద్రణ:
శ్రీ రమణ ప్రింటర్స్,
స్వామి వీధి, గాంధినగర్, విజయవాడ – 520 003
ఫోన్: 9985068630


# గురు ధ్యానం

**దక్షిణామూర్తి సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**


శ్రీదక్షిణామూర్తితో ఆరంభమై, శ్రీశంకరాచార్యులవారు మధ్యములుగా, ప్రస్తుతం ఉపదేశం ఇచ్చిన సద్గురు శ్రీనాన్నగారు వరకు గల గురుపరంపరకు నమస్కరిస్తున్నాను.

**గురుః బ్రహ్మా గురుః విష్ణుః గురుః దేవో మహేశ్వరః ।**
**గురుః ఏవ పరం బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥**

గురువు బ్రహ్మ, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువే పరబ్రహ్మము. అట్టి శ్రీ గురువుకు నమస్కరిస్తున్నాను.



జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య



భగవాన్ శ్రీ రమణ మహర్షి

# విషయ సూచిక


ముందుమాట

పరిచయం

| | | |
|---|---|---|
| 1. | సాధన చతుష్టయం | 1 |
| 2. | ప్రపంచం ఉన్నదానివలె కనిపిస్తోంది | 15 |
| 3. | శరీరాన్ని మనోనాశనానికి ఉపయోగించండి | 25 |
| 4. | తత్త్వమసి | 33 |
| 5. | జీవన్ముక్తుడు సర్వకర్మబంధాలనుండి విముక్తుడే | 40 |
| 6. | ఆత్మజ్ఞానికే శోకంనుండి విడుదల | 45 |
| 7. | సద్వస్తువు బయట దొరకదు | 53 |
| 8. | బ్రహ్మముగురించి బ్రహ్మమై చెప్పాలి | 59 |
| 9. | నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి | 67 |
| 10. | హితోపదేశంతో సమ్యక్ విచారణ | 75 |
| 11. | శ్రద్ధ భక్తి ధ్యాన యోగములు | 85 |
| 12. | అపరోక్షానుభవంతోనే ఆత్మజ్ఞానం | 89 |
| 13. | తీవ్రవైరాగ్యం మోక్షానికి ప్రథమకారణం | 95 |
| 14. | చైతన్యం తప్పించి మిగతావన్నీ కల్పితాలే | 107 |
| 15. | బింబం - ప్రతిబింబం | 117 |
| 16. | ఉన్నదే బ్రహ్మం | 125 |
| 17. | ఉదాసీనభావంతో మనస్సు అంతర్ముఖమవుతుంది | 128 |

# ముందుమాట

శ్రీశంకరాచార్యులవారు వివేకచూడామణిలో "సద్వస్తువు యొక్క నిశ్చయం హితులైనవారి ఉపదేశంవలన కలుగు విచారణచేత చూడబడినది" అని చెప్పారు. ప్రేమస్వరూపమైన జ్ఞానియే నిజమైన హితుడు. సద్గురు శ్రీనాన్నగారి గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన మనందరికీ "హితుడు".

సత్యాన్వేషణలో సాధకులు ముందుగా తప్పనిసరిగా చదవవలసినది శ్రీశంకరులు రచించిన "తత్త్వబోధ" అను ప్రకరణ గ్రంథం. సార్థకనామధేయం కలిగినది, వారిచే రచింపబడిన మరో ప్రకరణ గ్రంథం "వివేకచూడామణి". ఈ రెండు ప్రకరణ గ్రంథాలలోని పలువిషయాలపై శ్రీనాన్నగారు 2010 సం|| ఏప్రిల్ మరియు మే నెలలలో, కొత్తగూడెంలో చేసిన అమూల్యమైన అనుగ్రహభాషణముల సంకలనమే ఈ "హితోపదేశం".

శ్రీ నాన్నగారు వారి అద్వైతబోధనలను "ఉన్నది బ్రహ్మమొక్కటే" అను పేరిట గ్రంథస్థం చేయడానికి 2010 సం||లో నాకు, శ్రీ ప్రసాద్‌గారికి మరియు శ్రీమతి లక్ష్మిగారికి అవకాశం కల్పించారు. ఈ "హితోపదేశం" ద్వారా అలాంటి మహద్భాగ్యాన్ని మాకు మరోసారి శ్రీనాన్నగారు ప్రసాదించారు.

ఈ పుస్తకంలో మొదటి ఆరు అధ్యాయాలలో "తత్త్వబోధ"లోని పలువిషయాలపై, తరువాత పదకొండు అధ్యాయాలలో "వివేకచూడామణి"లోను కొన్ని శ్లోకాలపై, శ్రీనాన్నగారి ప్రవచనాలు గ్రంథస్థం చేయడం జరిగింది. మననానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రతి అధ్యాయం చివర శ్రీ నాన్నగారు చెప్పిన "మననం చేయదగిన వాక్యాలు" సాధకుల సౌలభ్యం కోసం సమకూర్చడం జరిగింది.

ఈ జ్ఞానయజ్ఞంలో పాల్గొనే అవకాశం నాకిచ్చినందుకు సద్గురు శ్రీ నాన్నగారికి పాదాభివందనం చేసుకుంటున్నాను. శ్రీ నాన్నగారి "హితోపదేశం"ను సాధకులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడంలో ప్రధానపాత్ర వహించిన శ్రీ జె.యస్.వి. ప్రసాద్‌గారికి ప్రత్యేక ధన్యవాదములు.

చక్కటి సూచనలు చేసి, ఈ గ్రంథానికి పరిచయ వాక్యాలు వ్రాసిన శ్రీ పింగళి సూర్యసుందరంగారికి కృతజ్ఞతాపూర్వక వందనములు. శ్రీ నాన్నగారి ప్రవచనాలను గ్రంథస్థం చేయడంలో మరియు ముద్రణలో ఎంతో కృషిచేసిన తెలుగు అధ్యాపకురాలు శ్రీమతి స్వరాజ్యలక్ష్మిగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పుస్తకం ఈ విధంగా రూపుదిద్దుకోవడానికి తమవంతు సహాయసహకారాలు అందించిన శ్రీ కృష్ణమూర్తిగారికి, సింగరేణి సంస్థ ఉద్యోగి శ్రీ రమణగారికి, నా అర్ధాంగి శ్రీమతి ఈశ్వరికి ఇంకా అనేక విధములుగా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు.

సద్గురు శ్రీనాన్నగారి హితోపదేశం మనకు లక్ష్యసాధనలో ఎంతగానో ఉపయోగపడుతుందని మనవి చేస్తూ...

**కె.వి.రమణ**

# పరిచయం

భగవాన్ శ్రీ రమణమహర్షి అద్వైతమూర్తి, ఆదిశంకరాచార్యుల వారు ప్రబోధించిన అద్వైత సిద్ధాంతానికి, సజీవమూర్తి. శ్రీరమణులకు పదహారవ యేటనే ఏ సాధనా, ఉపదేశమూ లేకుండా ఆత్మసాక్షాత్కారమయింది. అప్పటికి ఆ యువకునకు ఏ శాస్త్రజ్ఞానమూ లేదు, ఆఖరికి 'బ్రహ్మ' మన్న పదం కూడా తెలియదు. వారు ఆ ఆనందమయస్థితిలో అర్ధశతాబ్దికి పైగా దేహధారులై, సాధకులకు బోధనలు చేశారు. శ్రీరమణులు ఎవ్వరికీ దీక్షనివ్వలేదు. కాని వారు దేహంచాలించిన తరువాత కొందరి ధన్యజీవులకు దర్శనమిచ్చి వాళ్లలో నిద్రాణంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేశారు. అట్టి ధన్యజీవులలో శ్రీ (జిన్నూరు) నాన్నగారొకరు.

దాదాపు అర్ధశతాబ్దికాలంగా శ్రీ నాన్నగారు తమదైన విశిష్టరీతిలో సూక్ష్మమూ, క్లిష్టమూ అయిన తాత్త్విక విషయాలగురించి ముఖ్యంగా శ్రీ రమణ మహర్షిబోధనల గురించి అతి సరణమైన భాషలో ప్రసంగాలు చేస్తున్నారు. తమ ప్రసంగాలలో ఆయన ఏ శాస్త్రపారిభాషిక పదాలనీ, వాక్యాలనీ ఉపయోగించరు. మన నిత్యజీవితంలో తారసిల్లే సంఘటనలూ, మన నడవడీ – వీటిద్వారానే ఆధ్యాత్మిక విషయాలని మన హృదయాలకు హత్తుకొనేట్టు చెబుతారు. ఆధ్యాత్మిక ఉన్నతికి కావలసినది శాస్త్రజ్ఞానం మాత్రమే కాదని చూపుతారు. ఇంత మాత్రాన ఆయనకి శాస్త్రపరిజ్ఞానం లేదని మనం అనుకోకూడదు.

శ్రీ నాన్నగారికి గల శాస్త్రజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేవారు బహుఅరుదు. ఆ అరుదైన వారిలో ఇద్దరు జిజ్ఞాసులున్నారు. వారు శ్రీ కె.వి. రమణగారు, శ్రీ జె.ఎస్.వి. ప్రసాద్‌గారూను. శ్రీ రమణగారికి గల జిజ్ఞాస వల్ల శ్రీ నాన్నగారు కొత్తగూడెంలో 2010 వేసవిలో కొన్నిరోజులు గడిపి కొన్ని ఆధ్యాత్మిక విషయసంబంధమైన సందేహాలను తీర్చారు. ఆదిశంకరుల "తత్త్వబోధ", "వివేకచూడామణి" అనే ప్రకరణగ్రంథాలలోని విషయాలకి సంబంధించినవి ఈ సందేహాలు. శ్రీ రమణగారు అడిగిన ప్రశ్నలకు శ్రీ నాన్నగారిచ్చిన సమాధానాల సమాహారమే ఈ గ్రంథం.

ఈ గ్రంథాన్ని రూపొందించటానికి శ్రీ జె.ఎస్.వి ప్రసాద్‌గారు సహకరించారు. చిత్తశుద్ధిగల సాధకులకు ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుంది.

ఈ సమాధానాల్లో విశేషమిది: ఇంచుమించు అన్నింటిలోనూ ఆ గ్రంథాలలోని విషయాలని భగవాన్ శ్రీ రమణ మహర్షి బోధనలతో సమన్వయ పరచడం.

ఈ పుస్తకానికి పరిచయ వాక్యాలను వ్రాయమని నన్ను శ్రీనాన్నగారు కోరారు. అట్లా నన్నడగడంలో వారికి నా పట్ల ఉన్న అభిమానానికీ, సుహృద్భావనకీ ధన్యవాదాలు. ఈ అవకాశం నాకిచ్చినందుకు కృతజ్ఞుణ్ణి.

**పింగళి సూర్యసుందరం.**

ఆత్మసుఖం ఒక్కటే నిజం.

విషయసుఖాలన్నీ మిథ్య.

బాహ్యమైన విషయసుఖాలు

ఏవి అనుభవించినా,

అవన్నీ క్రమేపి

దుఃఖంగా మారిపోతాయి.

**సద్గురు శ్రీనాన్నగారు**

# 1. సాధన చతుష్టయం

కొత్తగూడెం,
26-04-2010.

**ప్రశ్న**: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు 'తత్త్వబోధ'లో సాధన చతుష్టయం గురించి చెప్పినదానిని దయచేసి వివరించండి.

**శ్రీనాన్నగారు**:

దేన్నయితే నువ్వు తెలుసుకోవాలి అనుకుంటున్నావో, దేన్ని తెలుసుకుంటే వేరే తెలుసుకోవడానికి ఇంకేం మిగలదో, అదే నీవు. అయితే నీకు దాని ఎరుకలేదు, అంటే దాని అనుభవం లేదు. దాని గురించి వివరించేది తత్త్వబోధ.

సాధన అంటే ప్రయత్నం. ఆత్మానుభవం కోసం సాధన అవసరమే. "మాకు ఆత్మజ్ఞానం కావాలనుకుంటున్నాం కాని మేము ఏమీ సాధనలు చేయలేకపోతున్నాం. మీరే మమ్మల్ని అనుగ్రహించాలి" అని కొందరు శ్రీరమణమహర్షిగారితో అన్నారు. అందుకు వారు "అన్నం, కూర మొదలైనవన్నీ మేమే చేస్తాం. కూర, అన్నం మేమే కలుపుతూ ముద్దలు కూడా చేసి ఆ ముద్దలను మీ నోట్లో కూడా మేమే పెడతాం. కాని మీరు ఆ ముద్దల్ని మింగాలి కదా!" అన్నారు. గుర్రాన్ని నీటి దగ్గరకు తీసుకెళ్ళగలం గాని తాగటం అనేది ఆ గుర్రమే చేయాలి కదా! శరీరం ఉన్నంతకాలం ఎంతో కొంత ఆహారం ఎలా అవసరమో, అలాగే మనస్సు ఉన్నంతవరకు ఆత్మజ్ఞానం కోసం సాధన అనేది అవసరం.

ఆత్మజ్ఞానం పొందడానికి సాధన చతుష్టయ సంపద కలిగిన వారే అర్హులు అన్నారు శ్రీశంకరాచార్యుల వారు. ఆ నాలుగింటి గురించి తెలుసుకుందాం.

# (1) నిత్యానిత్యవస్తు వివేకం

**“బ్రహ్మమొక్కటియే నిత్యవస్తువు. దానికి వేరైనది, వ్యతిరేకమైనది అంతా అనిత్యం. ఇదియే నిత్యానిత్యవస్తు వివేకం.”** (తత్త్వబోధ)

సత్యం ఎప్పుడూ ఉండేది కాబట్టి సత్యాన్ని నిత్యం అన్నారు. సత్యం కానిది అనిత్యంగా ఉంటుంది. మన శరీరాలు ఎప్పుడూ ఉండవు, అలాగే ఈ నామరూపాలన్నీ ఎప్పుడూ ఉండవు. ఎప్పుడూ ఉండేది ఏమిటంటే మనకి, ఈ ప్రపంచానికి ఆధారంగా ఉన్న బ్రహ్మము ఒక్కటే.

పాలని, నీరుని విడదీసినట్టు అనిత్యమైన ప్రపంచ విషయాలను వదిలి నిత్యమైన ఆత్మను గురించి ఆలోచించడం వివేకం. అవసరం లేనిదాన్ని వదిలేసి అవసరమైన దానిని పట్టుకోవటం వివేకం. మనకు ఏ సద్వస్తువు కావాలో దానిమీద ప్రేమ లేకపోతే అది లభించదు.

**“బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అను దృఢ నిశ్చయజ్ఞానం నిత్యానిత్యవస్తు వివేకం”** అని వివేకచూడామణిలో శ్రీశంకరులు చెప్పారు.

బ్రహ్మ సత్యం, జగన్మిథ్య అని చెప్పిన ఆచార్యులవారు **“జగత్తు బ్రహ్మముగా సత్యం”** అని మూడో వాక్యం కూడా చెప్పారు. మిథ్య అంటే లేనిది ఉన్నదానివలె కనిపించేది. మరి జగన్మిథ్య అని ఎందుకు చెప్పారంటే జగత్తుని జగత్తుగా చూస్తే సత్యంలాగా కనిపిస్తోంది గాని అది సత్యం కాదు, అది అనిత్యమైనది అని నీకు తెలిసినప్పుడు దానిమీద నీకు ఆసక్తి తగ్గిపోతుంది. అప్పుడు నిత్యమైన, సత్యమైన బ్రహ్మము మీద నీకు ఆసక్తి పెరుగుతుంది.

**“జగత్తు బ్రహ్మముగా సత్యం”** అని ఆచార్యులవారు చెప్పారు. ఎందుకంటే ఈ సృష్టి అంతా బ్రహ్మమయం. మనం జగత్తును ఆ దృష్టితో చూసినప్పుడు అది బ్రహ్మమేకదా!

## (2) వైరాగ్యం

**"ఇహలోక, పరలోక భోగాల పట్ల అభిలాష లేకపోవటం వైరాగ్యం."**

(తత్త్వబోధ)

భోగించినపుడు సుఖం (pleasure) తప్ప ఆనందం (happiness) రాదు, మనం పొరపాటున ఆ సుఖాన్ని ఆనందంగా భావిస్తాం. ఈ సుఖం అనేది క్షణికమే! ఈ ప్రపంచం ద్వంద్వమయం. అందువల్ల అనతి కాలంలోనే ఆ సుఖమే దుఃఖంగా మారిపోతుంది. ఇదీ సిద్ధాంతం!

భోగప్రవృత్తి ఒక వాసన. పేకాట, తాగుడు లాగా భోగప్రవృత్తి కూడా ఒక వాసన. ఈ అలవాట్లన్నీ వాసనలు. ఎక్కడో ఒక చోట మంచి కాఫీ తాగినపుడు మనకి ఆ కాఫీ చాలా బాగుందనే భావన మనస్సులో గట్టిగా నాటుకుంటుంది. మళ్ళీ ఎప్పుడైనా అలాంటి కాఫీ తాగాలనిపిస్తుంది. ఇదే కాఫీని జ్ఞానికిస్తే, అతడు ఆ కాఫీని తాగి బాగుందంటాడు గాని మళ్లీ అలాంటి కాఫీ తాగాలనే భావన చేయడు. అందువల్ల ఆ కాఫీ త్రాగిన అనుభవం ఒక వాసనగా అతడికి మారదు. అందువలన, మరలా అలాంటి కాఫీ త్రాగాలనే కోరిక అతడికి ఉదయించదు!

శరీరంలో చాలా ఇంద్రియాలున్నాయి. ఏ ఇంద్రియంతోటి ఏ సుఖాలని తీసుకున్నా అవన్నీ దుఃఖాల కింద మారిపోతాయి. అవి దుఃఖాల కింద మారిపోయినా ఫరవాలేదు గాని పోస్టుకార్డు మీద ముద్రలు వేసినట్లు మనస్సు మీద ముద్రలు వేసి వెళ్ళిపోతాయి. ఆ ముద్రలు ఆ అనుభవాలు మళ్ళీ కలిగించమని కోరుతాయి. ఈ కోరికలే సంసారం! అందుకే సంసారం బయట లేదు, మనస్సులోనే ఉంది అంటారు మహాత్ములు.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతుడితో నీకు ఆత్మజ్ఞానం ఎందుకులే, కావల్సినన్ని భోగాలు కోరుకో, వాటితో సుఖంగా ఉండొచ్చు అంటాడు. అందుకు నచికేతుడు ఆ భోగాలు ఉండగానే నా శరీరం పోవచ్చు లేదా నేనుండగానైనా ఆ భోగాలు పోవచ్చు, అలాంటి భోగాలు నాకొద్దు, ఏది పొందటం వల్ల మరణాన్ని జయిస్తామో, ఏది పొందడం వల్ల అద్వైతానుభవం కలుగుతుందో ఆ ఆత్మజ్ఞానాన్ని నాకు బోధించు అన్నాడు.

వాసనాక్షయం కాకుండా భోగకాంక్ష తగ్గదు. భోగకాంక్ష తగ్గితేనే గాని జ్ఞానం నిలబడదు. Intellectual Understanding వలన అంటే పరోక్ష జ్ఞానంవలన కొన్ని glimpses వచ్చినా, అవి నిలబడవు.

మన హృదయంలో సద్వస్తువు ఉంది. దాని స్వరూపమే ఆనందం. ఆ సద్వస్తువులో తప్పించి నిజమైన సుఖం వేరెక్కడా లేదు.

**“దర్శనం, శ్రవణం మొదలగు వాటిచేత దేహం మొదలు బ్రహ్మవరకు గల అనిత్యమగు భోగ్యవస్తువులపై ఏ జుగుప్స కలుగుతుందో అది వైరాగ్యం.”**

అని శ్రీశంకరులు వివేకచూడామణిలో చాలా చక్కగా చెప్పారు. అంటే మీ చొక్కా మీదో, చీరమీదో కాకిరెట్ట పడినప్పుడు మీలో ఏ అసహ్యం కలుగుతుందో, భోగాలమీద అలాంటి జుగుప్స కలగడం వైరాగ్యం అని అర్థం.

నిత్యానిత్యవస్తు వివేకంతో కూడిన వైరాగ్యం లేనివాడు అంతర్ముఖం అవ్వలేడు, ఆత్మజ్ఞానం పొందలేడు.

## (3) శమాది షట్కసంపత్తి

**శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానం** – అనే ఈ ఆరింటిని శమాది షట్క సంపత్తి అంటారు.

### (i) **శమము**

**"మనోనిగ్రహమే శమము."** (తత్త్వబోధ)

దీని గురించి మరింత నిర్దిష్టంగా, విపులీకరించి చక్కగా వివేకచూడామణిలో శ్రీశంకరులు ఇలా చెప్పారు:

**"మాటి మాటికి విషయాలలో దోషాలను చూడడంచేత వాటినుండి వైరాగ్యాన్ని పొంది మనస్సు తన లక్ష్యంలో స్థిరమగు స్థితిని శమము అంటారు."**

విషయాలవైపు వెళ్ళొద్దని మనస్సుని శాసించినంత మాత్రాన మనోనిగ్రహం రాదు. ఆ విషయాలలో ఉన్న దోషాలను ఎలప్పుడూ చూస్తూ ఉంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది.

ఇంత చక్కగా ఈ విషయాన్ని విడమరచి చెప్పటం శంకరాచార్యులవారికే సాధ్యం అయింది. ఊరికే మనోనిగ్రహం అంటే మనస్సును అణిచివేయడమనే సాధకులు భావిస్తారు. అణిగి వున్న మనస్సు ఎప్పుడైనా విజృంభిస్తుంది. అందువల్ల ఉపయోగం లేదు. ఈ విషయాలు, భోగాలు అనిత్యం అని తెలిసి వాటి మీద సహజంగా విరక్తి కలిగినప్పుడు సాధకుని మనస్సు పలచబడుతుంది.

రమణమహర్షిగారు అసలు మనస్సు ఉందో లేదో చూసుకో, లేకపోతే గొడవలేదు, ఉంటే నిగ్రహించుకో అన్నారు. అంటే ముందు సత్యాన్వేషణ చెయ్యి, సత్యం ఎప్పుడైతే అనుభవంలోకి వచ్చిందో అప్పుడు నిగ్రహించుకోవడానికి మనస్సు అంటూ ఉండదు. ముందు మనస్సు ఉందా లేదా చూసుకో. అది ఉందని నీకు అనిపిస్తున్నప్పుడు నిగ్రహించడం నేర్చుకో. అది లేనిదే అని తెలిసినప్పుడు ఇక లేనిదాన్ని ఏం నిగ్రహించుకుంటావు?

మనస్సంటే ఏమిటి? నీలో ఉన్న కొన్ని అలవాట్లు, కొన్ని వాసనలు కలిపితే మనస్సు అవుతుంది. గడ్డిపరకలు లేకపోతే గడ్డి తాడు వుండదు కదా! ముందు నీ అలవాట్లలోంచి బయటికి రా. మనకి అనారోగ్యం పోయినప్పుడు కదా ఆరోగ్యం తెలిసేది. ముందు నీ అలవాట్లు, వాసనలనుంచి బయటికి వచ్చి మనస్సు అనేది ఉందో లేదో చూస్తే అప్పుడు మనస్సు లేదని తెలుస్తుంది, ఇక మనోనిగ్రహం అనేదాని అవసరం ఏముంటుంది?

కృష్ణభగవానుడు మీ మనస్సుని మీరు విరోధిగా చేసుకోకండి, మీ మనస్సు మీ స్నేహితుడిగా వున్నప్పుడు ప్రపంచములో వేలాదిమంది విరోధులు మీకున్నా ఫరవాలేదని అన్నాడు. మన మనస్సే మనకి విరోధిగా ఉన్నప్పుడు బయటివాళ్ళు ఎవరైనా మనకు ఉపకారం చేద్దామన్నా చెయ్యలేరు. చేసినా అది నిలబడదు. అసలు మనస్సును బాగుచేసుకోవడం కోసమే మనం ఈ లోకంలోకి వచ్చాం.

శ్రీకృష్ణుడు మనోనిగ్రహానికి రెండు ఉపాయాలు చెప్పాడు. ఒకటి అభ్యాసం, రెండు వైరాగ్యం. నువ్వు ఇప్పుడు ఇక్కడ కూర్చున్నావు. నీ మనస్సు ఎక్కడెక్కడికో తిరుగుతూ ఉంటుంది. అంటే నీకు వైరాగ్యం లేదని అర్థం. నీకు నూటికి నూరుపాళ్ళు వైరాగ్యం వచ్చినపుడు నీ మనస్సుని కదలమన్నా కదలదు. నీకు వైరాగ్యం లేనప్పుడు దాని అలవాట్లను బట్టి అది తిరుగుతుంది.

నీకు సినిమా చూడాలన్న కోరిక మనస్సులో కలిగింది. అప్పుడు నువ్వు వెంటనే శరీరాన్ని తీసుకెళ్ళి సినిమా హాలులో కూర్చోపెట్టకు. ఆ కోరికను సంతృప్తిపరిచినప్పుడు నీ మనసు బాహ్యాముఖం అవడం పెరుగుతుంది. మళ్ళీ ఇంకో సినిమా చూడాలనిపిస్తుంది. అలా ఆ కోరికలు తీర్చడం వల్ల అది వాసనగా మారి తరువాత కాలంలో నీ పురోగతికి అడ్డుగా మారుతుంది.

సాధన అంటే కేవలం పూజ చేసి లేచి పోవటం కాదు. రోజువారీ ప్రవర్తనను సరిచేసుకోవడం అనేది సాధనలో భాగం. ఏ క్షణానికి ఆ క్షణం మనస్సు ఎలా ఉందో గమనిస్తూ ఉండాలి. అందుకే కృష్ణుడు మనోనిగ్రహానికి చెప్పిన పద్ధతి అభ్యాసం, వైరాగ్యం.

## (ii) **దమము**

**"చక్షురాది బాహ్యేంద్రియ* నిగ్రహం దమము."** (తత్త్వబోధ)

దమము అంటే ఇంద్రియ నిగ్రహం. మనోనిగ్రహం ఎంత ముఖ్యమో ఇంద్రియ నిగ్రహం కూడా అంతే ముఖ్యం.

దమము గురించి వివేకచూడామణిలో ఆచార్యులవారు ఇలా చెప్పారు:

**"బాహ్యేంద్రియాలను భోగ్య విషయాలనుండి మరల్చి తమ తమ స్థానాలలో ఉంచడాన్ని దమము అంటారు."**

బాహ్యేంద్రియాలకు వాటంతట అవే విషయవిచారం చేయగల సామర్థ్యం లేదు. అందుచేత కఠోపనిషత్తులో చెప్పినట్లు గుర్రాలవంటి ఈ బాహ్యేంద్రియాలను కళ్లెంవంటి మనస్సుతో విషయమార్గాలనుండి మరల్చి అంతర్ముఖం చేయాలి. అంటే ఇంద్రియ నిగ్రహంలో కూడా మనస్సే ముఖ్యపాత్ర వహిస్తుంది.

(* ఇంద్రియములు – కళ్ళు, ముక్కు, చెవులు, చర్మము, నాలుక)

### (iii) **ఉపరతి**

**"స్వధర్మానుష్ఠానమే ఉపరతి."** (తత్త్వబోధ)

స్వధర్మం, పరధర్మం అని రెండున్నాయి. నీ సహజ స్వభావానికి అనుగుణమైన కర్మలు చేయడం స్వధర్మం. అప్పుడు నీకు దుఃఖం ఉండదు.

ఉపరతి విషయమై వివేకచూడామణిలో ఇలా చెప్పారు:

**"బాహ్యవస్తువుల విషయంలో మనోవృత్తి వెళ్ళకపోవడం ఉత్తమమైన ఉపరతి."**

మనస్సులో కలిగే ఆలోచనలను మనోవృత్తులు అంటారు.

గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**"పరధర్మం భయంకరమైనది, స్వధర్మం చేసుకో. నీ స్వభావానికి అనుగుణమైన పని స్వధర్మం, నీ స్వభావానికి విరుద్ధమైన పని పరధర్మం."**

### (iv) **తితిక్ష**

**"శీతోష్ణ సుఖ దుఃఖాలను సహించుటయే తితిక్ష."** (తత్త్వబోధ)

అంటే సుఖదుఃఖాలు లాంటి అన్ని ద్వంద్వాలను సహించడమే తితిక్ష అని అర్థం.

కాలాన్నిబట్టి ప్రకృతి తన స్వభావాన్ని మార్చుకుంటుంది. అలాగే పరిస్థితులను బట్టి ప్రకృతి మారినట్లు నువ్వు మారుతూ ఉండు.

**"అప్రతీకారపూర్వకంగా, చింతా విలాప రహితంగా సమస్త దుఃఖాలను సహించడాన్ని తితిక్ష అని అంటారు."** (వివేకచూడామణి)

శ్రీశంకరాచార్యులవారు తమ చివరి గ్రంథమైన వివేకచూడామణిలో సాధన చతుష్టయం గురించి మరింత స్పష్టంగా సాధకులకు చెప్పారు.

మనస్సు అంతర్ముఖం అయి ఉంటే సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మనకు తెలియదు. అప్పుడు తితిక్ష సహజంగా సాధకునికి వుంటుంది. అంతర్ముఖం ఇంకా కాని సాధకునికి వస్తు, విషయాలవలన కలిగే సుఖం, దుఃఖం తెలుస్తూ వుంటాయి. వాటిని స్వీకరించే విషయంలో సాధకుడు జాగ్రత్త వహించాలి. ఒకవేళ సుఖాన్ని ఆస్వాదిస్తే అనతికాలంలో దుఃఖం కలిగే పరిస్థితి వచ్చినప్పుడు దాన్ని కూడా ఆస్వాదించాల్సి వస్తుంది. అదే సుఖం తీసుకోనట్టయితే దుఃఖం కూడా రాదు.

సుఖం ఒక తలంపు. దుఃఖం కూడ ఒక తలంపు. గౌరవం ఒక తలంపు, అగౌరవం ఒక తలంపు. ఇలా జీవితమంతా ద్వంద్వములతో కూడిన తలంపులమయం. ఇది సహజజీవనం కాదు. సహజజీవనమే ముక్తి. అందుకే సహజజీవనాన్ని కోరే సాధకునికి తితిక్ష సాధన ఒక ముఖ్యభాగం.

## (v) శ్రద్ధ

**"గురువాక్యంమీదా, శాస్త్రవిషయంమీదా సంపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉండడమే శ్రద్ధ అంటారు."** (తత్త్వబోధ)

శ్రద్ధ రెండు అక్షరాల పదమే అయినా, చాలా ముఖ్యమైనది. "**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం**" అని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. అంటే శ్రద్ధ లేకుండా జ్ఞానం రాదు. జ్ఞానానికి పెట్టుబడి శ్రద్ధ. ఇది మనం ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి.

ఒకసారి చదివితే రాకపోతే రెండోసారి చదవాలి. రెండోసారి తెలియకపోతే మూడోసారి చదవాలి. అది శ్రద్ధలోంచి వస్తుంది. ఆత్మజ్ఞాన సముపార్జనకి పెట్టుబడి డబ్బు కాదు, శ్రద్ధే.

**“దేనిచేత సద్వస్తువు తెలియబడుతుందో అటువంటి శాస్త్ర, గురు వాక్యములు సత్యం అనెడి బుద్ధితో దృఢంగా నిశ్చయించుకొనడం శ్రద్ధ అని అంటారు.”**

(వివేకచూడామణి)

ఆత్మే మానవరూపం ధరించి గురువుగా వస్తుంది. ఈ మానవగురువు సాధకుని మనస్సును అంతర్ముఖం చేస్తాడు. సాధకుని హృదయంలో అంతరాత్మగా వున్న గురువు లోపలకు తీసుకుంటాడు. నిజమైన గురువు మనలో ఉన్న చైతన్యమే. మనల్ని లోపలికి నెట్టి అంతర్ముఖుల్ని చేయడానికి ఆ చైతన్యం మానవరూపం ధరించి వస్తుంది.

బయట గురువు push చేస్తాడు (లోపలకు తోస్తాడు), లోపల గురువు pull చేస్తాడు (లోపలకు లాగుతాడు) బయట గురువు, లోపల గురువు ఒక్కరే. లోపల గురువు రూపనామాలు లేనివాడు, అందుచేత గుర్తించలేం. బయట గురువు రూపనామాలు ధరించి వస్తాడు. కాబట్టి ఆయనని గుర్తిస్తాం.

మానవగురువు ఏ మాట చెప్పినా, అది ఆత్మ చెప్పినట్లే. అందుచేత గురువు వాక్యంమీద విశ్వాసం ఉండాలి. గురువు చెప్పింది వాక్యాలు అనడం కంటే అనుగ్రహం అనడం సరైనది. సాధకుని మీద అనుగ్రహంతో, వాత్సల్యంతో, దయతో గురువు బోధ చేస్తాడు. గురువాక్యం అనుగ్రహస్వరూపం. అలాగే శాస్త్రం అనుగ్రహాన్నే ప్రసాదిస్తుంది.

ఏది నీకు పనికి వస్తుంది, ఏది నీకు పనికి రాదు; ఏది నువ్వు చెయ్యదగినదో, ఏది నువ్వు చెయ్యకూడనిదో; శాస్త్రం చెబుతుంది. ఆ రకంగా నువ్వు జీవించగలిగితే బ్రాహ్మీస్థితి పొందగలుగుతావు.

## (vi) సమాధానం

**"చిత్తమును ఏకాగ్రతలో ఉంచుట సమాధానం."** (తత్త్వబోధ)

నీ హృదయంలో ఉన్న ఆత్మజ్ఞానాన్ని ఏకాగ్రతలేకుండా నువ్వు పొందడం సాధ్యం కాదు. ఈ సమాధానం విషయమై వివేకచూడామణిలో శంకరాచార్యులవారు మరింత స్పష్టతనిచ్చారు.

"పరిశుద్ధమగు బ్రహ్మమునందు ఎల్లవేళలా బుద్ధిని నిలుపుట సమాధానం. అంతే గాని, సమాధానం అనునది చిత్త లాలనం కాదు." (వివేకచూడామణి)

ఇంతకుముందు మనస్సు మాటిమాటికి విషయాలలో దోషాలను చూడడంతో వానినుండి వైరాగ్యాన్ని పొంది తన లక్ష్యంమీద అంటే బ్రహ్మమునందు స్థిరమగు స్థితిని శమము అని ఆచార్యులవారు చెప్పారు. ఇక్కడ బుద్ధి ఎల్లవేళలా శుద్ధమైన బ్రహ్మమునందు నిలచి ఉండడమే సమాధానం అని చెబుతున్నారు.

సంకల్పవికల్పాదులతో కూడినదానిని **మనస్సు**, నిశ్చయమైన అభిప్రాయం కలదానిని **బుద్ధి**, 'నేను కర్తను' అనెడి భావన **అహంకారం**, చింతన చేయుదానిని **చిత్తం** అని ఒకే వస్తువును (అంతఃకరణాన్ని) నాలుగు విధాలుగా చెప్పారు.

శమముగురించి చెబుతున్నప్పుడు మనస్సు అనే అంతఃకరణాన్ని పేర్కొన్న ఆచార్యులవారు సమాధానం సంగతి వచ్చేసరికి బుద్ధి అనే అంతఃకరణాన్ని చెప్పారు. అంటే సంకల్పవికల్పాత్మకమైన మనస్సు అనే అంతఃకరణాన్ని దాటి నిశ్చయాత్మకమైన బుద్ధి అనే అంతఃకరణం ఎల్లప్పుడూ దోషపూరితమైన విషయాలమీద కాకుండా, దోషరహితమైన శుద్ధమైన బ్రహ్మముమీద నిలచి ఉండడమే సమాధానం అని చెప్పడమన్నమాట.

ఇంట్లో పిల్లలు ఏడిస్తే తల్లులు వారికి కావలసినది ఇచ్చి వారిని బుజ్జగిస్తారు. అలా మనస్సుకి కావలసినది ఇచ్చి సంతృప్తిపరచడం సమాధానం కాదు. అందుకే "**సమాధానం అనేది చిత్త లాలనం కాదు**" అని ఆచార్యులవారు ప్రత్యేకంగా చెప్పారు.

ప్రారంభదశలో సమాధానం అనేది సాధకునికి చాలా కష్టం. ఏదో ఒకదానిని గురించి చింతించకుండా చిత్తం ఉండదు. అందుచేత "**లాలయేత్ చిత్త బాలకం**" అని యోగవాశిష్టంలో చెప్పారు. అంటే మనస్సును చపలచిత్తంతో ప్రతి చిన్న విషయానికి కంగారుపడే బాలునిని లాలించినట్లు లాలించాలి అని అర్థం. ఆ లాలించడం అనేది శమము సాధించేటప్పుడు చాలా అవసరం. విషయాలలో దోషాలు చూపించి లాలించి శమమును సాధించి పురోగతి చెందినవానికి బాహ్యావాసనలు నశించినందున సమాధానావస్థలో అట్టి లాలనం యొక్క అవసరం ఉండదు.

## (4) ముముక్షుత్వం

**"నాకు మోక్షం కలుగుగాక! అనే కోరిక ముముక్షత్వం."** (తత్త్వబోధ)

మోక్షం కోరేవాడు ముముక్షువు. జ్ఞానం కోరేవాడు జిజ్ఞాసువు. మోక్షం అంటే విడుదల అని అర్థం. ఎందులోంచి విడుదల? అజ్ఞానంలోంచి, అవిద్యలోంచి విడుదల, నువ్వు కాని దాన్ని నువ్వు అనుకుంటున్నావు కాబట్టి ఆ తలంపులోంచి నువ్వు విడుదల పొందడమే మోక్షం.

**"స్వస్వరూపజ్ఞానంతో, అజ్ఞానం కారణంగా జనించిన అహంకారం మొదలు దేహం వరకుగల బంధనాలనుండి విముక్తుడిని అవ్వాలనే కోరిక ముముక్షత్వం అంటారు."**

(వివేకచూడామణి)

మోక్షం అంత తేలిక కాదు! మీకు ఎంతో పూర్వపుణ్యం లేకపోతే ముముక్షత్వం కలగదు. “**మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయః అనే మూడు దుర్లభమైనవి, దైవానుగ్రహం చేతనే అవి కలుగుతాయి**” అని శ్రీశంకరాచార్యులవారు వివేకచూడమణిలో చెప్పారు.

నీకు మానవజన్మ రావటం, ఆ తరువాత మోక్షం సంపాదించాలనే బలీయమైన కోరిక రావటం – ఈ రెండూ సరిపోవు. **మహాపురుష సంశ్రయః అంటే నీకు మోక్షం ప్రసాదించే మహాత్ములతోటి, యోగులతోటి పరిచయం కలగడం** పూర్వపుణ్యం లేకుండా జరగదు. మోక్షం వైపుకి నిన్ను తిప్పేవాడు ఒకడు ఉండాలి కదా! నీకు మోక్షం పొందాలనే కోరిక ఉంటేనే సరిపోదు. నీవు గతంలో ఏమైనా సత్కర్మలు చేసి ఉంటే, ఆ సత్కర్మలు కూడా నిష్కామంగా చేసి ఉంటే మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంశ్రయం – ఈ మూడూ లభిస్తాయి.

నీ స్వరూపసుఖం పొందడానికి, నీ స్వరూపం లోకి నిన్ను నడపడానికి గురువు దొరకాలి కదా! ఆ తరువాత ఆ గురువే మిమ్మల్ని చూసుకుంటాడు.

ఈ విధంగా సాధన చతుష్టయం అంటే నిత్యానిత్యవస్తు వివేకం, వైరాగ్యం, శమాది షట్క సంపత్తి, ముముక్షత్వం కలిగినవాడు సద్గురువు అనుగ్రహంతో ఆత్మజ్ఞానం పొంది అజ్ఞాన బంధాలనుండి విముక్తుడు అవుతాడు.

✷✷✷

## మననం చేయదగిన వాక్యాలు

(1) మనస్సు ఉన్నంతవరకు ఆత్మజ్ఞానం కోసం సాధన అనేది అవసరం.

(2) పాలని, నీళ్లని విడదీసినట్టు అనిత్యమైన ప్రపంచ విషయాలను వదిలి నిత్యమైన ఆత్మను గురించి ఆలోచించటం వివేకం.

(3) భోగించినపుడు సుఖం తప్ప ఆనందం రాదు.

(4) మన హృదయంలో సద్వస్తువు ఉంది. దాని స్వరూపమే ఆనందము. ఆ సద్వస్తువులో తప్పించి నిజమైన సుఖం వేరెక్కడా లేదు.

(5) విషయాలలో ఉన్న దోషాలను ఎలప్పుడూ చూస్తూ ఉంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది.

(6) బాహ్యేంద్రియాలను కళ్ళెంవంటి మనస్సుచేత విషయమార్గాలనుండి మరల్చి అంతర్ముఖం చేయాలి.

(7) నీ సహజ స్వభావానికి అనుగుణమైన కర్మలు చేయడం స్వధర్మం. అప్పుడు నీకు దుఃఖం ఉండదు.

(8) గురువు వాక్యంమీద విశ్వాసం ఉండాలి. గురువాక్యం అనుగ్రహస్వరూపం. అలాగే, శాస్త్రం అనుగ్రహాన్నే ప్రసాదిస్తుంది.

✷✷✷

# 2. ప్రపంచం ఉన్నదానివలె కనిపిస్తోంది

కొత్తగూడెం,
27-04-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. "తత్త్వబోధ"లో శ్రీశంకరాచార్యులవారు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల గురించి చెప్పినదానిని దయచేసి వివరించండి.

## (1) తత్త్వవివేకం

**ఆత్మయే సత్యం. దానికి వేరైనది అంతా మిథ్య అని తెలుసుకోవడమే తత్త్వవివేకం.**
(తత్త్వబోధ)

ఆత్మయే సత్యం అంటే ఆత్మకానిదంతా అసత్యం. వివేకం అంటే అసత్యమైన అనాత్మ మీద ప్రేమ తగ్గించుకొని ఆత్మమీద ప్రేమ పెంచుకోవడం. ముందు ఇది ఆత్మ, ఇది అనాత్మ అని తెలియాలి. తెలిసాక అనాత్మ మీద ప్రేమ తగ్గించుకొని ఆత్మమీద ప్రేమ పెంచుకోవడం వివేకం అని నిన్న మాట్లాడుకున్నాం.

అజ్ఞానంలో ఉన్నప్పుడు నేనుగా వ్యక్తమయ్యేది అసత్యమైన నేను. దీనికి అతీతంగా ఉన్న ఆత్మ సత్యమైన నేను. అంటే చైతన్యం. చైతన్యం సత్యమైన నేను.

విత్తు ముందా, చెట్టు ముందా అనే వాదన విషయమై రమణమహర్షిగారిని అడిగినప్పుడు - "విత్తు ముందా, చెట్టు ముందా అంటావేంటి, రెండూ లేవు. ఉన్నది చైతన్యమే" అన్నారాయన.

ఆత్మ ఉందా అని వారిని అడిగినప్పుడు "ఆత్మ ఒక్కటే ఉన్నది" అన్నారు.

ఏసుక్రీస్తు చెప్పింది వినండి – శరీరాలు వస్తున్నాయి, పోతున్నాయి. కష్టాలు వస్తున్నాయి, పోతున్నాయి. సుఖాలు వస్తున్నాయి, వెళ్లిపోతున్నాయి. వచ్చి, వెళ్ళిపోయేవి ఏవీ నిజం కావు. ఏసుక్రీస్తు "నేను నేనుగా ఉన్నాను" అన్నాడు. అంటే ఈ సృష్టికి ముందు కూడా నేను ఉన్నాను. అప్పుడు ఎలా ఉన్నాను? నేను నేనుగానే ఉన్నాను. ప్రపంచం వస్తోంది, వెళ్ళిపోతోంది. దేవతలు వస్తున్నారు, వెళ్లిపోతున్నారు. కష్టసుఖాలు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. దేహాలు పుడుతున్నాయి, చచ్చిపోతున్నాయి. అన్నీ వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి కాని ఈ రాకపోకలతో సంబంధం లేకుండా నేను నేనుగా ఉన్నాను.

మాకు విపరీతమైన కష్టాలు వస్తున్నాయి, బాధలు భరించలేకపోతున్నాం అని చెబుతుంటారు. కష్టాలు, సుఖాలు ఈ రెండు వచ్చినప్పుడు కూడా నేను నేనుగానే ఉన్నాను. ఆ సత్యమైన నేను తాలుకు అవగాహన కలిగినప్పుడు సంతోషం వచ్చినా స్వప్నమే, దుఃఖం వచ్చినా స్వప్నమే. ఇవి వచ్చిపోతుండేవి అని తెలుస్తుంది.

నేను సంతోషంగా ఉన్నాను అనుకోవడం, నేను దుఃఖంతో ఉన్నాను అనుకోవడం, రెండూ కూడా నిజం కాదు. ఇవన్నీ ఊరికే తలంపులు. ఈ శరీరం ఉన్నప్పుడు, నేను నేనుగానే ఉన్నాను. ఈ శరీరం వచ్చింది, పోతుంది. అలాగే సంతోషం వస్తుంది, పోతుంది. దుఃఖం వస్తుంది, పోతుంది. ఇవన్నీ తలంపులు.

నేను దుఃఖంగా ఉన్నప్పుడు కూడా నేను నేనుగానే ఉన్నాను. నా శరీరం చనిపోయినప్పుడు కూడా నేను నేనుగానే ఉంటాను. అందుకే శ్రీకృష్ణుడు గీతలో తాను సూర్యుడికి ఈ తత్త్వ విషయాలు చాలా కాలం ముందు వివరించానని అర్జునునితో అన్నాడు. అంటే ఆయన చైతన్యంగా ఉన్నాడు. ప్రపంచం రావడం, పోవడం, జీవకోటి రావడం, పోవడం – వీటితోటి సంబంధం లేకుండా, ఇవి ఉన్నా, లేకపోయినా; నేను నేనై ఉన్నాను అన్నాడు.

ఇక్కడ మిథ్య అంటే కుందేటి కొమ్ము కాదు. మిథ్యకి నిర్వచనం చెప్పడం కష్టం. కుందేటి కొమ్ము అంటే అసలు లేనిది. “కుందేటికి కొమ్ము లావుగా ఉందా? సన్నగా ఉందా?” అని చర్చించడం సమయాన్ని వృథా చేయడమే. అసలు లేనిది కదా! మిథ్య అంటే అలా కాదు. పూర్తిగా అసత్యమని కాదు. మిథ్య అంటే అసలు లేనిది, ఉన్నదానివలె కనిపిస్తూ ఉండేదని అర్థం. కనిపిస్తుంది అంతే. జగన్మిథ్య అంటారు కదా, ప్రపంచం ఉందా, లేదా అని రమణ మహర్షిగారిని అడిగినప్పుడు, ఆయన ఉందని చెప్పేవారు కాదు, లేదని చెప్పేవారు కాదు, “ఉన్నదానివలె కనిపిస్తోంది” అనేవారు.

ఆత్మ సత్యమా, కాదా అని రమణమహర్షిగారిని అడిగినప్పుడు “ఆత్మ మాత్రమే సత్యం” అని చెప్పేవారు. అంటే మిగతాదంతా అసత్యమనే చెప్పడం. అంటే ఆత్మ తప్ప మిగతా గొడవలన్నీ dream stuff (స్వప్నంలోని సంగతులు లాంటివి) అని చెప్పడం. ఈ ఆత్మని ఏసుక్రీస్తు ‘నేను’ అన్నాడు. అది True I (నిజమైన నేను).

ఈ ఆత్మనే శ్రీకృష్ణభగవానుడు ‘నేను’ అని గీతలో తెలియచేశాడు. “అన్ని ధర్మములు వీడి నన్నే శరణుపొందు” అన్నప్పుడు ఆయన నేను అంటే ఆత్మయేనని సూచిస్తున్నారు.

జ్ఞానం అంటే విషయజ్ఞానం కాదు. మన మెదడులో ఉన్న పాండిత్యం జ్ఞానం కాదు. మన హృదయంలో ఒక నిజం ఉంది. ఇప్పుడు మనం శరీరంతోటి, మనస్సుతోటి ఎలా తాదాత్మ్యం పొందుతున్నామో ఆ నిజంతో నూటికి నూరుశాతం తాదాత్మ్యం పొందినపుడు అది జ్ఞానం. మనం బుద్ధితో గ్రహించేది, ఇంద్రియాలతో గ్రహించే సమాచారం విషయజ్ఞానం, అంతేగాని జ్ఞానం కాదు. ఇవన్నీ అజ్ఞానంలోకే వస్తాయి.

ప్రపంచం ఉందని చెప్పడానికి వీల్లేదు; లేదని చెప్పడానికి వీల్లేదు. జాగ్రదావస్థలో కనిపిస్తోంది. కానీ గాఢనిద్రలో ప్రపంచం కనిపించడం లేదు. ఒక అవస్థలో వుండి మరొక అవస్థలో లేనప్పుడు అది సంపూర్ణ సత్యం కాలేదు. ఏది సంపూర్ణ సత్యం కాదో దానిని సాధకుడు నిత్య అనిత్య వివేకంతో వదిలివేయాలి!

## (2) ఆత్మ

**స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు భిన్నమైనది, పంచకోశాలకు అతీతమైనది, అవస్థాత్రయానికి సాక్షి అయినది, సచ్చిదానంద స్వరూపమైనది అయి ఏది ఉన్నదో అది ఆత్మ.** (తత్త్వ బోధ)

స్థూలశరీరం అంటే రక్తం, మాంసం, ఎముకలు.

సూక్ష్మశరీరం అంటే మనస్సు.

కారణశరీరం అంటే అజ్ఞానం.

మన శరీరం చనిపోయాక, ప్రయాణం చేసేది సూక్ష్మశరీరం, స్థూలశరీరం చనిపోయాక సూక్ష్మశరీరం ప్రయాణం చేస్తుంది. ఆ సూక్ష్మశరీరం ఉన్నంతసేపు మనకు పునర్జన్మలు వస్తాయి.

మనం చనిపోయినప్పుడు స్థూలశరీరాన్ని ఖననం చేస్తారు లేదా కాల్చేస్తారు. ఈ సూక్ష్మశరీరం కాలదు, శరీరం చనిపోయిన వెంటనే ఇది హృదయంలోకి వెళ్ళి దాక్కుంటుంది. దాంట్లో వాసనలు ఉంటాయి. ఆ హృదయం కాలదు. నేను అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను అని కృష్ణుడు చెప్పాడు కదా, ఆ హృదయం కాలదు. అది శరీరంలో ఒక భాగం కాదు. ఆ హృదయంలో వాసనలు, సంస్కారాలు, పునర్జన్మ హేతువులు నిలవ ఉంటాయి. అక్కడ ఉన్న సంస్కారాలను బట్టి అతడికి తిరిగి శరీరం వస్తుంది.

ఆ సూక్ష్మశరీరానికి, స్థూలశరీరానికి కారణం అజ్ఞానం. ఈ అజ్ఞానమే కారణశరీరం! అందుచేత అజ్ఞానం ఉన్నంతసేపు సూక్ష్మశరీరం ఉంటుంది. సూక్ష్మశరీరం ఉంటే స్థూలశరీరం వచ్చేస్తుంది.

జాగ్రదవస్థ (స్థూల, సూక్ష్మశరీరాలు), స్వప్నావస్థ (కేవలం సూక్ష్మశరీరం), సుషుప్తి అవస్థ (కేవలం కారణశరీరం) – వీటన్నింటికి సాక్షిగా ఉన్నది చైతన్యం. ఆ చైతన్యం అనుభవంలోకి వచ్చినప్పుడు తెరమీద బొమ్మలాగా వచ్చిపోయే మూడవస్థలతో అంటే జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థలతో వాడికి తాదాత్మ్యం ఉండదు. ఈ మూడు అవస్థలూ చూస్తూ ఉంటాడు గాని వాటితో తాదాత్మ్యం ఉండదు. అందుకే చైతన్యం వీటన్నింటికి అతీతమైనది అన్నారు జ్ఞానులు.

**ఆత్మలోనే ఆనందం ఉంది, ఇంకెక్కడా ఆనందం లేదు.** ఈ వాక్యాన్ని మననం చేస్తే మన మనస్సు బాహ్యాముఖం అవడం మానేస్తుంది. మనస్సు బాహ్యాముఖం ఎందుకు అవుతోంది? ఆనందం కోసం. ఆత్మలో తప్పించి నిజమైన సుఖం ఎక్కడా లేదని ఋషి చెప్పిన వాక్యం మీకు అర్థమైతే మనస్సు బయటికి వెళ్ళడం మానేస్తుంది. బయటికి వెళ్ళినా ఆనందం లేదని మనసుకి తెలియాలి. అప్పుడది సహజంగా బహిర్ముఖం కావడం మానేస్తుంది. మీరు వెళ్ళమన్నా వెళ్ళదు.

పచ్చగడ్డికి అలవాటు పడ్డ దూడకి పక్కన ఎండుగడ్డి వేసినా, అది తినదు. అలాగే ఆత్మానందం అనుభవంలోకి వచ్చిన వ్యక్తికి లోకంలో ఉన్న భోగాలమీదికి మనస్సు వెళ్ళమన్నా వెళ్ళదు. అంతవరకు సాధకుని మనస్సు భోగాలవైపు వెళుతూ ఉంటుంది. ఈ మనస్సుని మనం ఎక్కడయితే శాశ్వత ఆనందం, శాంతి ఉందో, అక్కడికి తోలుకెళ్ళడానికి చేస్తున్న ప్రయత్నమే సాధన. మిగతావన్నీ అప్రధానమైన విషయాలు.

ముందు స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలకు భిన్నమైనది, పంచకోశాలకు అతీతమైనది అని చెప్పిన తరువాత ఆత్మ అవస్థాత్రయానికి సాక్షి అయినది సచ్చిదానంద స్వరూపం అయినది అని ఆచార్యులవారు చెప్పారు. అవస్థాత్రయానికి అంటే, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనబడే మూడు అవస్థలకు ఆత్మ సాక్షిగా ఉంటుంది. అంటే, అన్ని వేళలా ఆత్మ కేవలం సాక్షిగా ఉంటుంది తప్ప ఆయా అవస్థలలో జరిగే కర్మలతో దానికి సంబంధం లేదు.

ఆ తరువాత ఆత్మ సచ్చిదానంద స్వరూపం అన్నారు. సచ్చిదానందం – అంటే సత్, చిత్, ఆనందం.

సత్ అంటే ఉండడం, ఉండడమే దాని స్వరూపం. అగ్నికి  నిప్పు గుణం కాదు. అది దాని 'స్వభావం'. అలాగే ఆత్మకి కూడా ఉండడమనేది గుణం కాదు. అది దాని 'స్వభావం'. ఆత్మ అన్ని అవస్థలలోనూ ఉంటుంది. అంటే, అన్ని వేళలలోను ఉంటుంది.

తరువాత, చిత్ అంటే జ్ఞానస్వరూపం. అంటే, తాను ఉన్నానని తనకు ఎరుక కలిగి ఉండడమే చిత్.

ఆనందం అంటే సుఖస్వరూపం.

ఈ మూడు కలిపి సచ్చిదానందం. ఇది శాస్త్రం చెప్పిన మాట. 'సత్' ఒకటే నిజం. సత్ ఎప్పుడూ జ్ఞానంగానే ఉంటుంది. ఈ సత్తే జ్ఞానం, ఈ సత్తే ఆనందం. రమణ మహర్షిగారు సత్ ఒక్కటే చాలు; సత్తే చిత్తు, సత్తే ఆనందం – ఇంక మూడు మాటలు కూడా అక్కర్లేదు అన్నారు.

## (3) స్థూలశరీరం

I. **పంచీకరణం చెందిన మహాభూతాలవలన చేయబడినది.**

II. **మంచి కర్మలవలన పుట్టినటువంటిది.**

III. **సుఖదుఃఖాలు మొదలైనవాటిని అనుభవించడానికి ఇల్లువంటిది.**

IV. **ఉండడం, పుట్టడం, పెరగడం, మారడం, కృశించడం, గతించడం అనే ఆరు వికారాలతో కూడినది స్థూలశరీరం.** (తత్త్వబోధ)

(I) శరీరం పంచభూతాలతో తయారు చేయబడింది. చనిపోవడం అంటే శరీరంలో ఉన్న ఏ భూతం ఆ భూతంలో కలిసి పోతుంది. మట్టి మట్టిలో కలిసిపోతుంది. నీరు నీరులో కలిసిపోతుంది. గాలి గాలిలో కలిసిపోతుంది. పుట్టడం అంటే పంచభూతాలు కలవడం, చావడం అంటే పంచభూతాలు విడిపోవడం.

(II) పుట్టినప్పుడు మంచి కర్మలు ఉంటాయి, చెడ్డకర్మలు ఉంటాయి. చెడ్డకర్మలు ఎక్కువ ఉన్నాయనుకోండి, చనిపోయాక చెడ్డ లోకాలకి వెళతాడు. మంచి కర్మలు ఎక్కువ చేసి వుంటే, మంచి లోకాలకి వెళతాడు. తరువాత భూమిమీదకి తిరిగి వస్తాడు.

స్వర్గం, నరకం ఉందా, లేదా అని రమణమహర్షి గారిని అడిగితే– "అవి ఉన్నాయి కాని, నీ మనస్సెంత నిజమో, అవి అంతే నిజం" అన్నారు. స్వర్గలోకం, నరకలోకం ఉన్నాయి. శరీరం చనిపోయాక ఒకడు బయటికి వెళ్ళి పోతున్నాడు కదా, ఆ బయటికి వెళ్ళేవాడు ఎంత నిజమో, ఆ లోకాలూ అంతే నిజం. అంటే ఇవన్నీ పాక్షిక సత్యాలు. పారమార్థిక సత్యం కాదు.

మనం అంతటా ఉన్నాం. కాని మనం శరీరంలో ఉన్నాం అనుకుంటున్నాం. ఇదే జీవభావన. ఆ చైతన్యం అనుభవంలోకి వచ్చేవరకు మనం అంతటా ఉన్నామన్న అనుభవం వుండదు. అందుచేత మనం శరీరంలో ఉన్నామనుకోవడం ఎంత నిజమో, శివుడు కైలాసంలో, విష్ణువు వైకుంఠంలో ఉన్నారనుకోవడం కూడా అంతే నిజం.

పుట్టడానికి మంచికర్మలు, చెడ్డకర్మలు రెండూ సహకరిస్తాయి. చెడ్డవాళ్ళకి తెలివితేటలుంటాయి. మంచివాళ్లకి తెలివితేటలుంటాయి. రాముడు గురించి, రావణాసురుడి గురించి ఒకటి చెబుతారు. రాముడు ఎంత చదువుకున్నాడో రావణాసురుడు అంతే చదువుకున్నాడు. చదువులో ఇద్దరూ సమానమే. రావణాసురుడు దుర్వినియోగం చేసి రాక్షసుడయ్యాడు. రాముడు సద్వినియోగం చేసుకొని దేవుడయ్యాడు.

మనం కూడా డబ్బు, చదువు దుర్వినియోగం చేస్తే రాక్షసులకింద అయిపోతాం. సద్వినియోగం చేసుకుంటే మనల్ని దేవతలతో సమానంగా చూస్తారు.

మంచికర్మలే కాదు, కర్తృత్వభావంతో ఏ పనిచేసినా జన్మకు కారణమవుతుంది. కర్మయోగి అంటే మంచి కర్మలు చేసినవాడు కర్మయోగి అని కాదు. మంచికర్మలు చేసినవాడికి పుణ్యం వస్తుంది.

కర్తృత్వభావం లేకుండా కర్మ చేసినవాడు కర్మయోగి. ఏవో నాలుగు మంచిపనులు చేసి అహంకారం పెంచుకుంటే మీరు యోగి ఎలా అవుతారు? చేసిన మంచిపనికి మాత్రం పుణ్యం అనే ఫలితం వస్తుంది. ఆ పుణ్యమే మళ్ళీ జన్మలకి కారణం అవుతుంది.

(III) సుఖదుఃఖాలు అనుభవించడానికి శరీరం ఇల్లు వంటిది. దేహం ఎందుకు వస్తుందంటే అనుభవించడానికి.

(IV) స్థూలశరీరంలో ఉండడం, పుట్టడం, పెరగడం, మారడం, కృశించడం, గతించడం అనే ఆరు వికారాలు ఉన్నాయి. రాగద్వేషాలు, ఇష్టాలు అయిష్టాలు సూక్ష్మశరీరంలో ఉన్నాయి. నాకు తెలుసు, తెలియదు అనే భావన సూక్ష్మశరీరంలో ఉంది. చైతన్యంలో జ్ఞానమూ లేదు, అజ్ఞానమూ లేదు. మనం చెప్పుకునే సాపేక్షిక జ్ఞానం లేదక్కడ. నాకిది తెలుసు, నాకిది తెలియదు అనేది బుద్ధితో చెబుతున్నారు. చైతన్యంలో నాకు తెలుసును, నాకు తెలియదు అనేది లేదు. వ్యవహారంలో జ్ఞానం, అజ్ఞానం; విద్య, అవిద్య అనేవి ఉన్నాయి. మనకు రాబోయే జన్మలకారణాలు స్థూలశరీరంలో ఉండవు, సూక్ష్మశరీరంలో ఉంటాయి.

## (4) సూక్ష్మశరీరం

**పంచీకరణం చెందని పంచమహాభూతాలద్వారా చేయబడినది,**

**సత్కర్మల వల్ల జనించినట్టిది, సుఖదుఃఖాలు మొదలైనవాటిని అనుభవించడానికి పరికరంగా ఉండేది,**

**అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు ప్రాణాలు, మనస్సు, బుద్ధి అనే పదిహేడు భాగాలతో కూడి ఏది ఉన్నదో అది సూక్ష్మశరీరం.**

(తత్త్వబోధ)

శరీరం ఎవరిది అంటే నాది అని చెబుతాం. నాదని చైతన్యం చెబుతోందా, మనస్సు చెబుతోందా? మనసు చెబుతోంది. మనస్సుకు శరీరం అవసరం. చైతన్యానికి శరీరం అవసరం లేదు.

మనస్సు తనలోని కోరికలను శరీరంద్వారా తీర్చుకుంటుంది. కాబట్టి మనస్సుకి శరీరం కావాలి. మనస్సు శరీరం లేకుండా ఉండలేదు. అందుచేత దానికి పునర్జన్మ వస్తుంది. మనస్సు వేరు, శరీరం వేరు అని వ్యవహారంలో అనుకుంటున్నాం. నిజం చెప్పాలంటే, మనస్సే శరీరరూపం ధరించింది.

మీ మనస్సులో కోపం వచ్చింది అనుకోండి, మీ కళ్ళల్లో తెలిసిపోతుంది. మీరు ఎవరినైనా ద్వేషిస్తున్నారు అనుకోండి, మీ ముఖంలో తెలిసిపోతుంది. అంటే, మనస్సులో వచ్చే ఏ వికారమైనా; సంతోషమైనా, దుఃఖమైనా అది వెంటనే శరీరంమీదకి వచ్చేస్తుంది. మీకు అశాంతి ఉంటే, దాని ప్రభావం గుండెమీదకు వచ్చేస్తుంది. మనసు అశాంతిగా ఉన్నప్పుడు గుండెని నొక్కేస్తుంది. ఆ గుండె సరిగా పనిచేయడానికి అడ్డు వస్తుంది. దీన్ని బట్టి మనస్సే శరీరంగా కనిపిస్తోంది అని తెలుస్తోంది కదా!

మనస్సులో ఉన్న అశాంతి శరీరంమీదకు రాకుండా మీరు అదుపు చేసుకోలేరు. మనస్సు శరీరం లేకుండా ఉండలేదు. సినిమాకి వెళ్ళాలన్న కోరిక శరీరంలో రావడం లేదు, మనస్సులో వస్తోంది. సినిమా చూడాలంటే మనకు కళ్ళు ఉండాలి. కళ్ళు అనుభవించవు. కళ్ళద్వారా మనస్సు అనుభవిస్తుంది. మనస్సు తన అనుభవాలకోసం శరీరాన్ని ఉపయోగించుకుంటుంది. సూక్ష్మశరీరం ఎంత కాలం అయితే ఉంటుందో, అంతకాలం పునర్జన్మలు వచ్చి తీరతాయి.

"**నువ్వు లేవు, నేను లేను; ఉన్నది చైతన్యమే. పుట్టేది లేదు, చచ్చేది లేదు** – అని ఒక చోట చెబుతావు.

**నువ్వు ఉన్నావు, నేను ఉన్నాను; నువ్వు పుట్టావు, నేను పుట్టాను; ఆ జన్మలన్నీ నీకు తెలియవు, నాకు తెలుసు** అని మరొక చోట చెబుతావు.

ఒకసారి అలా చెబుతావు. ఒకసారి ఇలా చెబుతావేంటి?" అని అర్జునుడు శ్రీకృష్ణుడిని అడిగాడు.

అందుకు శ్రీకృష్ణుడు

"**నీకు శరీరభావన (జీవభావన) ఉన్నంతవరకూ పునర్జన్మలు నిజమే.**

**నీ అవగాహన సరిగా ఉన్నప్పుడు, ఉన్నది చైతన్యం ఒక్కటే అని తెలుస్తుంది**"


అన్నాడు.

## మననం చేయదగిన వాక్యాలు

(1) శరీరాలు వస్తున్నాయి, పోతున్నాయి. కష్టాలు వస్తున్నాయి, పోతున్నాయి. సుఖాలు వస్తున్నాయి, పోతున్నాయి. వచ్చి, వెళ్ళిపోయేవి ఏవీ నిజం కావు.

(2) ఆత్మలోనే ఆనందం ఉంది, ఇంకెక్కడా ఆనందం లేదు. ఈ వాక్యాన్ని మననం చేస్తే మనస్సు బాహ్యాముఖం అవడం మానేస్తుంది.

✷✷✷



# 3. శరీరాన్ని మనోనాశనానికి ఉపయోగించండి

కొత్తగూడెం,
28-04-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు "తత్త్వబోధ"లో అనాత్మ, ఆత్మ, అంతఃకరణాలు, జీవుడు, జీవేశ్వరుల భేదబుద్ధి గురించి చెప్పినవాటిపై వివరించండి.

**శ్రీనాన్నగారు**:

(1) **నా గాజులు, నా దుద్దులు, నా గృహం అంటూ, నావి నావి అని తెలియబడుతున్న వస్తువులన్నీ ఏ విధంగా నాకంటే వేరుగా ఉన్నాయో; అలాగే, నా దేహం, నా ప్రాణాలు, నా మనస్సు, నా బుద్ధి, నా జ్ఞానం అంటూ నావి నావి అని తెలియబడుతున్న పంచకోశాలు ఆత్మ కానేరవు.**

(తత్త్వబోధ)

మనకి తెలుస్తోంది కదా! ఆచార్యులవారు వివరంగానే చెప్పారు. నా ఇల్లు అంటే ఇల్లు నేను కాదు. నేను వేరు, ఇల్లు వేరు. నా దేహం అంటే నేను వేరు, దేహం వేరు. నా మనస్సు అంటాం. నా మనస్సు బాగోలేదు అంటే, మనస్సు "నేను" కాదని తెలుస్తోంది. ఈ "నేను" సంపూర్ణ సత్యం. ఈ అసలు "నేను" ను తెలుసుకోవటమే ఆత్మవిచారణ అంటాం.

ఆత్మ అంటే సత్యం. అనాత్మ అంటే అసత్యం. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో ఉండేది సత్యం. ఒక ప్రాంతంలో ఉండి ,ఇంకో ప్రాంతంలో లేకపోతే; ఒక కాలంలో ఉండి, ఇంకొక కాలంలో లేకపోతే; ఒక అవస్థలో ఉండి, ఇంకో అవస్థలో లేకపోతే; అది సత్యం కాదు. జాగ్రత్తు, స్వప్నం, సుషుప్తి అనే మూడు అవస్థలలో చైతన్యం సమానంగా ఉంటుంది. ఈ మూడు అవస్థలకు అది సాక్షి.

ఉదాహరణకి, గాఢ నిద్రలో మనం ఉన్నాం. ఇప్పుడు వేకువ అవస్థలోనూ ఉన్నాం. గాఢనిద్రలో అన్నిటికీ వేరై ఉన్నాం. ఇల్లు, మనుషులు మొదలగు వేటితోను సంబంధం కలిగిలేం. నేను ధనవంతుడను, నేను పేదవాడను, నేను స్త్రీని, నేను డాక్టరుని అనేటువంటి తలంపులు గాఢనిద్రలో లేవు. కాని వేకువ స్థితిలో ఈ భావనలన్నీ వున్నాయి. మరి వేకువస్థితి నిజమా లేక గాఢనిద్ర స్థితి నిజమా?

గాఢనిద్రలో మీరు తటస్థంగా వున్నారు. మీకు ఏ ఆలోచనలూ లేవు. కానీ హాయిగా నిద్రించానని మాత్రం అనుభవంతో చెబుతున్నారు. మెలుకువలో మీ మనస్సు ప్రపంచంతో సంబంధం కలిగి వుంటుంది. అన్ని విషయాలు తెలుసుకుంటుంది. అన్ని భావనలు చేస్తుంది. అందుచేత మన మనస్సే “నేను” అని అనుకుంటాం. గాఢనిద్రలో లేకుండా ఇప్పుడు ఉన్నటువంటి మనస్సు సంపూర్ణ సత్యం కాదు. అప్పుడు, ఇప్పుడు సమానంగా ఏదైతే ఉన్నదో అది మాత్రమే సంపూర్ణ సత్యం.

ఇప్పుడు రెండు “నేనులు” కనిపిస్తున్నాయి కదా. మొదటి నేను మనస్సు రూపంలో వుంది. రెండవది అన్ని అవస్థలలో వుంటూ ప్రత్యేకంగా గాఢ నిద్రలో, మనస్సు పనిచేయని వేళలో కూడా మనకు నిద్రానుభవాన్ని తెలియచేస్తోంది. ఇదే అసలైన “నేను”. ఇదే ఆత్మ; ఇదే పరమాత్మ; ఇది తెలుసుకోవడమే జ్ఞానం. ఇదే జ్ఞానస్వరూపం.

“ఎవరికో ఆకలేస్తోందండి – మరి వాళ్ళకి ఏదో సేవ చెయ్యాలి, అన్నం పెట్టాలి కదా! ఇదంతా స్వప్నం అని ఊరుకుంటే ఎలా?” అని ఒక సోషల్ వర్కర్ రమణమహర్షిగారిని అడిగాడు.

ఎవడికో రోగం వచ్చింది, ఇదంతా స్వప్నం అని వైద్యం చెయ్యకపోతే రోగం ఎలా తగ్గుతుంది? వైద్యం చెయ్యాలి కదా! జాగ్రదవస్థలోనే కాదు స్వప్నంలో కూడా నీకు రోగి కనిపిస్తాడు. అప్పుడు స్వప్నంలో కూడా నువ్వు వైద్యం చెయ్యాలి. స్వప్నంలో నువ్వు చేసిన వైద్యం వల్ల ఆ రోగికి రోగం తగ్గుతుంది. జాగ్రదవస్థ వచ్చేటప్పటికి నువ్వు స్వప్నంలో వున్న రోగికి మందివ్వడం, అతనికి రోగం తగ్గడం ఇదంతా అసత్యం అని తెలుస్తుంది.

మరి వైద్యం చెయ్యాలా లేదా అంటే, స్వప్నంలో చేస్తున్నావు కదా, అలా స్వప్నంలో చేసినట్టే జాగ్రదవస్థలో కూడా చెయ్యి. స్వప్నంలో రోగికి స్వప్నంలో డాక్టరే వైద్యం చెయ్యాలి. వేకువస్థితిలో వున్న డాక్టరు ఎలా వైద్యం చేస్తాడు? చెయ్యలేడు. కనుక మనం గ్రహించవలసినది ఏమిటంటే మెలుకువ వచ్చేవరకు స్వప్నంలోని ఆ సేవలు, డాక్టరు అంతా నిజమే. అలాగే నీకు చైతన్యస్థాయి వచ్చాక, ఇది ఎంత నిజమో నీకే తెలుస్తుంది అనేవారు రమణమహర్షిగారు.

నువ్వు కానిది ప్రతిదీ అనాత్మే. నేను నేనుగా ఉన్నాను. అదొకటే ఆత్మ. మిగతాదంతా అనాత్మే. చావులు, పుట్టుకలు కూడా అనాత్మే. నేను నేనై ఉన్నాను. ఏసు తన తండ్రైన యెహోవా కంటే ముందున్నాను అన్నాడు. తండ్రి కంటే ముందు కుమారుడు ఎలా ఉంటాడు? రమణమహర్షిగారు ఈ విషయాన్ని వివరిస్తూ ఏమి చెప్పారంటే ఏసు తాను చైతన్యం అనే భావనలో వున్నాడు. ఆ భావనలో వున్నవాడు ఎల్లప్పుడు వున్నవాడి క్రిందే లెక్క! ఈ దేహాలని ధరించి ముందు లేదా వెనక పుట్టవచ్చు. అది ముఖ్యంకాదు.

నేను నేనై ఉన్నాను. ఇక్కడ గట్టిగా పట్టుకోవాల్సింది ఏంటంటే – జన్మలు వస్తున్నాయి, పోతున్నాయి. లాభాలు వస్తున్నాయి, నష్టాలు వస్తున్నాయి. సంతోషం ఇచ్చే సంఘటనలు జరుగుతాయి, దుఃఖం ఇచ్చే సంఘటనలు జరుగుతాయి. ఏవో వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. మనం ఈ సంఘటనల తోటి తాదాత్మ్యం పొంది, ఒకోసారి సంతోషంగా ఉంటాం, మరొకసారి దుఃఖంతో ఉంటాం. కానీ గమనించవలసిన విషయం ఏమిటంటే – నువ్వు సంతోషంగా ఉన్నప్పుడు, ఆ సంతోషపడే వాడు నువ్వు కాదు, దుఃఖం వచ్చినప్పుడు దుఃఖపడేవాడివి నువ్వు కాదు. ఇదంతా మిథ్య.

డబ్బు సంపాదన అనేది ఒక వాసన; అది అందరిలో బలీయంగా ఉంటుంది. తాను చనిపోతే ఈ సంపాదన అంతా పోతుందని మానవుడు అనుకుంటాడు. దానివల్ల విపరీతమైన దుఃఖాన్ని పొందుతాడు. ఈ వాసన అతడిని బాధపెడుతోంది. వాసన వల్ల దుఃఖంలో వున్న సమయంలో కూడా అతడికి నేను నేనై ఉన్నానన్న అనుభవం కనుక వస్తే అమృతానుభవం పొందుతాడు. వాడిని మన పరిభాషలో జీవన్ముక్తుడు అంటాం.

డబ్బే కాదు, ప్రతిదీ వాసనే. అంటే, except truth, except naked reality, everything is created by the mind. సత్యం ఒక్కటి తప్ప అన్నీ మనస్సుయొక్క కల్పనే.

నువ్వు కానిదంతా అనాత్మే. నా మనస్సు అంటావు. నా బుద్ధి పాడైపోయింది అంటావు. అంటే నువ్వు బుద్ధి కాదని తెలుస్తోంది కదా. అప్పుడు బుద్ధి కూడా అనాత్మే. చాలా మంది పండితులు పాడైపోవడానికి ఇదే కారణం. వాళ్ళు బుద్ధి level దాకా వస్తారు. వాళ్ళ దగ్గర పాండిత్యం ఉంటుంది. వారి పాండిత్యమే ఆత్మ అని, వారి దగ్గర ఉన్న వివిధ విషయాల పరిజ్ఞానమే జ్ఞానం అని మాయా ప్రభావంలో వుంటారు. ఆ మాయలోంచి ఎంతటి వారైనా బయటికి రాలేరు. ఆ మాయకి ప్రభువు ఈశ్వరుడు. అతడి దయ లేకుండా అందులోంచి బయటకి ఎవరూ రాలేరు!

మనకు వాసనలు అలవాట్ల కింద వచ్చేస్తున్నాయి. అసలు మనకు వాసనలు ఎంత బలీయంగా ఉంటాయంటే లోపల భగవంతుడునే వాడు మనకు అంతర్యామిగా ఉన్నాడనే గుర్తింపు కూడా రానివ్వవు.

నీ దేహం బలహీనంగా ఉన్నా నీ మనసు బలంగా ఉండేటట్లు చూసుకో అనేవారు రమణమహర్షిగారు. కేవలం దృఢమైన మనస్సు కలవారు మాత్రమే ఈ వాసనలని తట్టుకోగలరు అని చెప్పేవారు.

మనం కానిదంతా అనాత్మ. మనం అనాత్మతో తాదాత్మ్యం చెంది ఉన్నప్పుడు కూడా ఆత్మ అయి ఉన్నాం. లెక్కలో 6+4 =10. కానీ దీనికి విరుద్ధంగా మీరు తొమ్మిది అనుకోవచ్చు – మీరు అలా అనుకొన్నప్పుడు కూడా అది పదే అయి ఉంది. మీరు అనుకున్నారని అది తొమ్మిది అవదు. అలాగే మీరు “నేను ఈ దేహం” అనే భావనలో ఉన్నప్పుడు కూడా ఆత్మయే అయి ఉన్నారు.

(2) **ఆత్మ సచ్చిదానందస్వరూపం. మూడు కాలాలలో ఏది ఉంటుందో, దానిని 'సత్' అంటారు. జ్ఞానస్వరూపమై ఏది ఉందో, దానిని 'చిత్' అంటారు. సుఖస్వరూపమై ఏది ఉందో, దానిని ఆనందం అంటారు. ఈ విధంగా సచ్చిదానందస్వరూపమైన తన ఆత్మను సాధకుడు తెలుసుకోవాలి.**

(తత్త్వబోధ)

ఇక్కడ సత్ అంటే ఎల్లప్పుడూ ఉండేది. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో ఉండేది సత్యం. ఒక ప్రాంతంలో ఉండి, ఇంకో ప్రాంతంలో లేకపోతే అది సత్ కాదు. శ్రీశంకరాచార్యులవారు దేశాటనలో కాశీ వెళ్ళారు. విశ్వేశ్వరుని గుడికి వెళ్ళారు. ఆయనకు ఆత్మానుభవం ఉంది. ఆయనకు ఇక ఏ గుడికి వెళ్ళవలసిన అవసరం లేదు. కానీ ఆయన గుడికి వెళ్ళకపోతే "ఆయనే గుళ్ళోకి వెళ్ళడం మానేశాడు, ఇక మనమెందుకు వెళ్ళడం?" అని సామాన్యజనం అనుకునే ప్రమాదం ఉంది. అది నివారించడానికి ఆయన గుడికి వెళ్ళేవారు. కాని ఆచార్యులవారికి "ఈశ్వరుడు అంతటా ఉన్నాడు. ఈశ్వరుడు లేనిచోటు అంటూ లేదు" అన్నది అనుభవంలో ఉంది.

సచ్చిదానందం - సత్ అంటే ఉండడం. చిత్ అంటే జ్ఞానం. ఆనందం అంటే ఇక్కడ మామూలుగా మనం పొందే సుఖసంతోషాలు కాదు. బయట వస్తువులతోటిగాని, వ్యక్తులతోటిగాని, సంఘటనలతోటిగాని, ప్రపంచంతోటిగాని, ఇంద్రియాలతోటిగాని, మనస్సుతోటిగాని, దేనితోటి సంబంధం లేకుండా స్వతంత్రంగా ఏ సుఖం వస్తుందో, అదే ఆనందం. ఏ కారణం లేకుండా, సంతోషంగా వున్నవాడే ఆనందాన్ని చవి చూస్తాడు. joy వేరు enjoy వేరు. enjoy అంటే ప్రపంచంతో సంబంధంవల్ల వచ్చేది. joy అంటే ప్రపంచంతో సంబంధం లేకుండా మీరు స్వతంత్రంగా పొందేది. ఏదయితే ఎల్లప్పుడూ ఉందో అదే సత్యం, జ్ఞానం, ఆనందస్వరూపం. మనకు అర్థం అవడం కోసం ఆత్మను విడదీసి సత్, చిత్ ఆనందస్వరూపం అని చెప్పారు. అది హృదయంలోనే ఉంది. అనుభవం ఎప్పటికైనా హృదయంలోనే రావాలి. అది ఎప్పుడో అకస్మాత్తుగా ఉబుకుతుంది. లోపల ఉన్న ఆనందసముద్రం సునామీ వచ్చినట్లు ఉబుకుతుంది. ఆ ముహూర్తం ఈశ్వరుడు పెట్టుకుంటాడు. ఉబికినప్పుడు మీరిక తట్టుకోలేరు. మీ మనసు దానిని బయటకి తోలేద్దామన్నా ఇంక వెళ్ళదు. ఆ ఆనందసాగరంలో ఊగిసలాడుతూ ఉంటారు.

(3) **ఈ పంచభూతాల సమిష్టి సాత్వికాంశంవలన మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అనే నాలుగు అంతఃకరణాలు పుట్టాయి. సంకల్ప వికల్పాలతో కూడిన దానినే మనస్సు అంటారు. నిశ్చయాభిప్రాయం కలదానిని బుద్ధి అంటారు. 'నేను కర్తను' అనెడి భావనను అహంకారం అంటారు. చింతన చేయు దానిని చిత్తం అంటారు.** (తత్త్వబోధ)

అన్నీ ఒకటే. చేసేపనులను బట్టి వివిధ పేర్లు పెట్టారు. మీరు ఆఫీసులో అధికారి. ఇంటి దగ్గర ఒక ఇల్లాలికి భర్త. ఒకే మనిషిని ఒకరు సార్ అంటారు, మరొకరు భర్త అంటారు, రకరకాలుగా పిలుస్తారు. మనిషి ఒక్కడే. ఒకడు నాన్న అంటాడు. ఒకడు మావయ్య అంటాడు. మొత్తం మీద మనిషి ఒక్కడే. అలాగే "అది" ఒక్కటే. అది కర్తృత్వంగా ఉన్నప్పుడు అహంకారం అంటాం. నిర్ణయానికి వచ్చినప్పుడు బుద్ధి అంటాం. సంకల్ప వికల్పంతో కూడి ఉంటే మనస్సు అంటాం, చింతిస్తూ ఉంటే చిత్తం అంటాం. అంతరంగంలోనే ఈ నాలుగూ ఉన్నాయి.

(4) **స్థూలశరీరాన్ని అభిమానించుకొన్న జీవుడు బ్రహ్మముయొక్క ప్రతిబింబమై ఉన్నాడు. ఆ జీవుడే ప్రకృతి కారణంగా ఈశ్వరుడు తనకన్నా భిన్నమని భావిస్తున్నాడు. అవిద్యోపాధి కలిగిన ఆత్మయే జీవుడు అనబడుతున్నాడు. మాయోపాధి కలిగిన చైతన్యం ఈశ్వరుడు అనబడుతున్నాడు.** (తత్త్వబోధ)

జీవుడు తాను జీవుడిగా ఉండటానికి ఆధారం అవిద్య లేక స్వస్వరూప అజ్ఞానం. అదేవిధంగా ఈశ్వరుడికి ఉపాధి తనకు తాను సృష్టించుకొన్న మాయ. ఈ ఉపాధులు కనుక తొలిగితే ఉన్నది బ్రహ్మము ఒక్కటే. ద్వైతం అంటే అందరూ ఇష్టపడతారు. అద్వైతం ఎవరో కాని ఒప్పుకోరు. ఈ లోక వ్యవహారం అంతా ద్వైతమే. కాని ఉన్నది అద్వైతమే. అది బ్రహ్మము.

జీవుడు, ఈశ్వరునికి గల సంబంధం, మాయ, అజ్ఞానం వంటి విషయాలను గురించి అడిగినప్పుడు రమణమహర్షిగారు "ఈ గొడవంతా ఎందుకు? ఆ దేవుడు ఉంటే ఉన్నాడు, లేకపోతే లేడు. ముందు నీవు ఎవరో తెలుసుకో, నిన్ను నీవు తెలుసుకునేవరకు ఈ గొడవలు తప్పవు. నువ్వు సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటే డాక్టర్లతోటి, ఆస్పత్రితోటి నీకు పనేముంది? అలాగే సంపూర్ణంగా నిన్ను నువ్వు తెలుసుకుంటే దేవుడు, దయ్యాలు, ఈ ప్రశ్నలు ఏమీ ఉండవు" అనేవారు.

(5) **ఈ విధంగా ఉపాధులలోని తేడాల కారణంగా జీవేశ్వరుల భేదబుద్ధి ఎంతవరకు ఉంటుందో, అంతవరకు జననమరణాలతో కూడిన సంసారం వదిలిపోదు. అందువలన జీవేశ్వరుల భేదబుద్ధి స్వీకరింపదగినది కాదు.** (తత్త్వబోధ)

జీవలక్షణాలు ఉన్నంతకాలం సంసారం వదిలిపోదు. సంసారం అంటే మనుషులు కాదు. మనస్సే సంసారం. మనస్సు ఉన్నంత కాలం పునర్జన్మ వస్తుంది. ఎందుచేతనంటే శరీరం లేకుండా మనస్సు ఉండలేదు. కోరికలెక్కడుంటాయి? మనస్సులో ఉంటాయి. ఇప్పుడు కరెంటు ఉన్నా ట్యూబ్ లైట్ లేకపోతే వ్యక్తం అవదు కదా! అలాగే, మీ మనస్సు తను వ్యక్తం అవడానికి తగిన పదార్థం సృష్టించుకుంటుంది. ఆ తగిన పదార్థమే శరీరం.

మనస్సు ఉన్నంతకాలం శరీరాలు వచ్చి తీరతాయి. ఆ మనస్సులో ఉన్న కోరికలన్నీ శరీరంద్వారా వ్యక్తం అవుతాయి. సాధకుడు తన శరీరాన్ని సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంచుకొని, ఆ శరీరాన్ని భోగాలకోసం కాకుండా, మనోనాశనానికి ఉపయోగించుకోవాలి. అలా కాకుండా, ఈ శరీరాన్ని భోగాలకి ఉపయోగించుకుంటే, అనుభవించేకొలదీ, ఆ భోగవాసన అనేది పెరిగిపోతూ ఉంటుంది, అది మరల మరల జన్మలు ఎత్తడానికి కారణమవుతుంది.

మనకి జీవలక్షణాలు ఉన్నప్పుడు, అజ్ఞానం ఉన్నప్పుడు, నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధి పోదు. ఈ బుద్ధి మనస్సులోనే ఉంది. బ్రహ్మము అనుభవంలోకి వచ్చేవరకు ఈ ద్వైతబుద్ధి పోదు.

ఓం అనుకోండి, రాముడనుకోండి, ఈశ్వరుడనుకోండి. ఉపాసనకి ఏదో ఒకటి ఆలంబన ఉండాలి కదా! మీరు కల్పించుకున్న గొడవలు వదిలెయ్యడానికే ఈ సాధన! ఇక్కడ సంపాదించాల్సింది ఏమీ లేదు, ఉన్నది ఊడగొట్టుకోవాల్సిందే!

నీవు నీవుగా ఉన్నావు కాని దాని తాలూకూ అనుభవం లేదు. అందుకు కారణం నువ్వు కల్పించుకున్న గొడవలు. ఆ కల్పించుకున్నవన్నీ వదిలిస్తే ఉన్నది ఉన్నట్లు వ్యక్తం అవుతుంది. దుఃఖం కూడా కల్పించుకున్నదే. అన్నీ తలంపులే, మీకెప్పుడైనా సంతోషం వచ్చినా తలంపే. దుఃఖం వచ్చినా తలంపే. ఈ కష్టం వచ్చింది, ఆ కష్టం వచ్చింది అని రమణమహర్షిగారితో చెబితే “పోనీలెండి మీ దేహంమీద ఆ ప్రారబ్ధం ఉంది. అప్పుంటే తీరిపోవడం మంచిదే కదా! అలాగే, ఆ ప్రారబ్ధం ఖర్చయిపోతే మంచిదే కదా!” అని చెప్పేవారు. అంటే ఈ జీవితంలో ఏ సంఘటన జరిగినా అది మన మంచికోసమే అని తెలుసుకోవాలి. ఒకవేళ మనకది చేదుగా అనిపించినా, అది మన మంచికే దారి తీస్తుంది అని తెలుసుకోవాలి. అన్ని వేళలా సాధకుడు ఈ సూత్రాన్ని పాటించాలి. ఇదే సర్వరోగ నివారిణి!

## మననం చేయదగిన వాక్యాలు

(1) ఏదయితే ఎల్లప్పుడూ ఉందో అదే సత్యం, జ్ఞానం , ఆనంద స్వరూపం.

(2) సంసారమంటే మనుషులు కాదు. మనస్సే సంసారం. మనస్సు ఉన్నంతకాలం పునర్జన్మ వుంటుంది.

(3) సాధకుడు తన శరీరాన్ని సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంచుకొని, ఆ శరీరాన్ని శారీరక భోగాలకోసం కాకుండా, మనోనాశనానికి ఉపయోగించుకోవాలి.

(4) జీవితంలో ఏ సంఘటన జరిగినా అది మన మంచికే అని తెలుసుకోవాలి. ఒకవేళ మనకది చేదుగా అనిపించినా, అది మన మంచికే దారి తీస్తుంది అని తెలుసుకోవాలి.

✷✷✷

# 4. తత్త్వమసి

కొత్తగూడెం,
29-04-2010.

**ప్రశ్న**: శ్రీనాన్నగారికి ప్రణామములు, శ్రీశంకరాచార్యులవారు "తత్త్వబోధ"లో తత్త్వమసి మహావాక్యం మరియు జీవన్ముక్తుడు గురించి చెప్పిన దానిపై దయచేసి వివరించవలసినదిగా ప్రార్థన.

**శ్రీనాన్నగారు**:

**"అహంకారియై అల్పజ్ఞానం కలిగిన జీవుడికి; నిరహంకారి, సర్వజ్ఞానం కలిగిన ఈశ్వరుడికి మధ్య విరుద్ధ ధర్మాలుండగా తత్త్వమసి మహావాక్యం వల్ల ఏకత్వం ఎలా కుదురుతుంది?" అని సాధారణంగా అభ్యంతర పెడతారు. కానీ ఈ రకమైన ఆలోచనాసరళి సరైనది కాదు. శాస్త్ర సమ్మతమూ కాదు!** (తత్త్వబోధ)

గుణాలు చూడకుండా, మూలంలోకి వెళ్ళి తత్త్వమసి మహావాక్యాన్ని అర్థం చేసుకోవాలి.

జీవుడి లక్షణాలు ఇలా ఉంటాయి, ఈశ్వరుడి లక్షణాలు ఇలా ఉంటాయి; జీవుడు నడిచేవాడు, ఈశ్వరుడు నడిపించేవాడు; నియమింపబడేవి జీవకోటి, ఆ జీవకోటిని నియమించేవాడు ఈశ్వరుడు; జీవుడి ధర్మాలు వేరు, ఈశ్వరుడి ధర్మాలు వేరు. కాబట్టి తత్త్వమసి మహావాక్యం వల్ల జీవుడు, ఈశ్వరుడు ఏకమైపోరు కదా అని సందేహం తెలియజేస్తారు. కానీ ఈ సందేహం నిలబడదు.

మరి తత్త్వమసి మహావాక్యాన్ని ఎలా అర్థం చేసుకోవాలో ఆచార్యులవారు చెబుతున్నారు.

**‘త్వం’ అనే పదానికి స్థూల, సూక్ష్మశరీరానికి అభిమాని అయిన జీవుడు అని పైకి తోచే అర్థం. ఉపాధులనుండి విడుదల పొంది సమాధి దశలో పొందినట్టి శుద్ధ చైతన్యం అనేది ‘త్వం’ అనే పదానికి ఉద్దేశించిన అర్థం.**

**అలాగే, ‘తత్’ అనే పదానికి సర్వజ్ఞత్వం మొదలైన విశిష్ట గుణాలు కలిగియున్న ఈశ్వరుడని పైకి తోచే అర్థం. ఉపాధి శూన్యమైన శుద్ధచైతన్యం, పరబ్రహ్మము అనేది ‘తత్’ అనే పదానికి లక్ష్యార్థం.**

**“ఇలా జీవేశ్వరులకు చైతన్యపరంగా భేదం లేదు. ఈ విధంగా వేదాంత వాక్యాల భావనను సద్గురువుల బోధలద్వారా ఎవరికి జీవులందరిపై బ్రహ్మభావం కలిగిందో వారు జీవన్ముక్తులు అని అర్థం.”** (తత్త్వబోధ)

“**తత్త్వమసి**”,

“**అయమాత్మా బ్రహ్మ**”,

“**అహం బ్రహ్మాస్మి**”,

“**ప్రజ్ఞానం బ్రహ్మ**” అనేవి నాలుగు మహావాక్యాలు.

ఈ నాలుగు మహావాక్యాలు నాలుగు వేరువేరు ఉపనిషత్తులలో ఉన్నాయి.

‘తత్’ అంటే అది, ‘త్వం’ అంటే నీవు, ‘అసి’ అంటే అయి ఉన్నావు. “అది నీవే అయి ఉన్నావు” అని అర్థం.

జగత్తు, జీవుడు, ఈశ్వరుడు – ఈ మూడు కల్పితాలు. నువ్వు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీకు లోకస్పృహ లేదు. నేను జీవుడనే స్పృహ లేదు. అలాగే ఈశ్వరుడి గురించి ఆలోచన కూడా లేదు. ఈ జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనస్సు వచ్చాక వస్తున్నారు. మనస్సు లేనప్పుడు లేకుండా పోతున్నారు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించండి.

'త్వం' అంటే 'నువ్వు' అని అర్థం. నువ్వు అంటే శరీరం కాదు, మనస్సు కాదు. నిజానికి 'నీవు' అంటే ఈ మహావాక్యం పరబ్రహ్మమునే సూచిస్తున్నదని గ్రహించాలి. దేహాభిమానంతో ఉన్నప్పుడు కూడా నువ్వు బ్రహ్మమే అయి ఉన్నావు. నువ్వు నేను జీవుడిని అని అనుకోవచ్చు. అనుకోవడమే కాని అది నిజం కాదు. నేను జీవుడని అనుకున్నప్పుడు కూడా నీవు బ్రహ్మమే అయి వున్నావు.

మనకు నేను అనేటప్పటికి జీవుడు తోస్తున్నాడు, శరీరం తోస్తుంది, మనస్సు తోస్తుంది. మన హృదయంలో సద్వస్తువు ఉంది, నేను అనేటప్పటికి ఆ సద్వస్తువు స్ఫురించాలి. జ్ఞానమంటే అది. అంతేగాని మన విషయజ్ఞానం, పాండిత్యం అనేవి జ్ఞానం కాదు.

'తత్' అంటే 'చైతన్యం'. 'త్వం' అంటే 'నువ్వు' అని అర్థం. ఆ చైతన్యం నీవై ఉన్నావు. నీ గురించి నువ్వు మంచిగా అనుకున్నా, చెడ్డగా అనుకున్నా, నువ్వు తక్కువవాడవు అనుకున్నా, ఎక్కువవాడవు అనుకున్నా; అవన్నీ మనస్సులో గొడవలు, బ్రహ్మములో ధర్మాలు లేవు, గుణాలు లేవు. ఈ గుణాలు, ధర్మాలు, ప్రపంచం – ఇవన్నీ మనస్సు వచ్చాక వస్తున్నాయి.

సర్వజ్ఞత్వం, కించిజ్ఞత్వం ఇవన్నీ కూడా వ్యవహారికపు మాటలు, వేషాలను బట్టి, వాళ్ళు చేసే పనులను బట్టి వచ్చిన మాటలు. ఉన్నది చైతన్యం ఒక్కటే.

జగత్తు, జీవుడు, ఈశ్వరుడు – ఈ ముగ్గురూ చైతన్యంలోనుంచి వచ్చారు. వైష్ణవులు వీటిని త్రిరత్నాలు అన్నారు. ఆ మూడూ నిజమేనని వాళ్ళ ఉద్దేశం. వైష్ణవులు ఆ మూడు నిజమే అంటున్నారని రమణమహర్షిగారితో అన్నప్పుడు వారు "నీకు దేహాభిమానం ఉన్నంతకాలం, అహంకారం ఉన్నంతకాలం ఆ మూడూ నిజమే అనిపిస్తాయి" అని చెప్పారు. నిద్రలో మనస్సు అణిగిపోయినప్పుడు జగత్తు లేదు, జీవుడు లేడు, ఈశ్వరుడు లేడు. మనస్సు లేనప్పుడు ఏవి లేవో, మనస్సు వచ్చాక ఏవి వస్తున్నాయో అవి మనోకల్పితాలు. మనస్సు ఎంత నిజమో ఈ మూడూ అంటే జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కూడా అంతే నిజం.

జీవేశ్వరులకు చైతన్యపరంగా భేదం లేదంటే ఆ ఇద్దరూ స్వరూపంలో ఒకటేనని అర్థం. జీవుడు స్వరూపంలో చైతన్యం, ఈశ్వరుడూ స్వరూపంలో చైతన్యం. ఇద్దరి స్వరూపం ఒక్కటే.

"మనస్సులోను, శరీరంలోను తేడా ఉన్నమాట నిజమే. కాని మీలో ఏముందో, నాలోనూ అదే ఉంది. అందులో తేడా ఏమీ లేదు" అని రమణమహర్షిగారు చెప్పారు. అంటే మీలో, నాలో ఉన్నది చైతన్యమే, అందులో తేడా ఏమీ లేదు అన్న విషయాన్ని గ్రహించాలి.

మీరు ఈశ్వరుడి స్వరూపాన్ని పొందాక, మీకు ఈశ్వరుడికి తేడా ఉండదు కదా! భగవద్గీతలో కృష్ణుడు "జ్ఞాని నా స్వరూపాన్ని పొందుతాడు" అన్నాడు. స్వరూపం ఏమిటి? చైతన్యం. అది పొందాక ఇద్దరికి తేడా ఎక్కడ ఉంది? ఉపాధులను దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు లేదా మనస్సును దృష్టిలో పెట్టుకొని చూసినప్పుడు తేడా అనిపిస్తుంది. లోదృష్టితో చూస్తే తేడా లేదు. బయటి దృష్టితో చూసినప్పుడు తేడా కనిపిస్తుంది. మనస్సును అంతర్ముఖం చేసి చూస్తే తేడా కనబడదు, బాహ్యాముఖంగా ఉన్నప్పుడు తేడా కనిపిస్తుంది.

కృష్ణానది వెళ్ళి సముద్రంలో కలిసింది. గోదావరినది వెళ్లి సముద్రంలో కలిసింది. సముద్రంలో ఇది గోదావరి నీరు, ఇది కృష్ణానీరు అని చెప్పలేం కదా! నదులు సముద్రంలో కలిసిపోయాక వాటి మధ్య తేడా తెలియదు. అలాగే జీవేశ్వరులు చైతన్యంలో కలిసిపోయాక ఇక వారి మధ్య తేడా వుండదు.

సద్గురువుయొక్క బోధలద్వారా అని ఎందుకున్నారంటే బ్రహ్మముగురించి చెప్పేవాడు బ్రహ్మము అయి ఉండాలి. అప్పుడు నూటికి నూరుపాళ్ళు ఆ బ్రహ్మము గురించి సరైన భావం ప్రకటితం అవుతుంది. రాముడు మీకెలా అర్థమవుతాడు? రాముడంతటివాడు అయినవాడికి రాముడు అర్థమవుతాడు. అంటే బ్రహ్మము గురించి చెప్పేవాడు బ్రహ్మము అయి చెప్పాలి.

**"నేను దేహాన్ని, పురుషుడను, బ్రాహ్మణుడను, శూద్రుడను అని ఎలా దృఢ నిశ్చయం ఉన్నదో; అలాగే, నేను బ్రాహ్మణుడను కాను, పురుషుడను కాను, సంగం లేనివాడిని, సచ్చిదానందరూపుడను, ప్రకాశరూపుడను, సర్వాంతర్యామిని, చిదాకాశరూపుడను అనే అపరోక్ష జ్ఞానం ఎవరికి నిశ్చయంగా ఉంటుందో, అతనే జీవన్ముక్తుడు."**

(తత్త్వబోధ)

శంకరాచార్యులవారు చాలా బాగా చెప్పారు. వారంటే నాకు చాలా ఇష్టం ఎందుకంటే వారికి బ్రహ్మానుభవం ఉంది, శాస్త్రజ్ఞానం ఉంది, అది ఇతరులకు చక్కగా చెప్పగల పాండిత్యం ఉంది, బ్రహ్మానుభవం, శాస్త్రజ్ఞానం, పాండిత్యం – ఈ మూడు ఉన్న జ్ఞానులు చాలా అరుదు.

ఈ శరీరం నువ్వు కాదు, ఈ మనస్సు నువ్వు కాదు, బ్రహ్మము నువ్వు అని వేదాంతంలో చెబుతారు. రమణమహర్షిగారు "నేను కుక్కను కాదు, నేను పందిని కాదు, నేను మనిషిని అనుకోవడం ఎలా ఉందో; నేను శరీరమును కాను, నేను మనస్సును కాను, నేను బ్రహ్మమును అనుకోవడం కూడా అలాగే ఉంటుంది. అనుకోవద్దని కాదు గాని నువ్వు గాడిదవు అని అనుకున్నప్పుడు కూడా నువ్వు మనిషివే. అలాగే 'నేను శరీరాన్ని' అనుకున్నప్పుడు కూడా బ్రహ్మమే అయి ఉన్నావు" అన్నారు.

శరీరంతో మనస్సుతో తాదాత్మ్యం వల్ల నేను పురుషుడిని, నేను స్త్రీని; నేను నల్లగా ఉన్నాను, నేను ఎర్రగా ఉన్నాను; నేను మంచివాడని, నేను చెడ్డవాడిని అనిపిస్తోంది. నీకు శరీరంతో, మనస్సుతో తాదాత్మ్యం లేనప్పుడు రంగు లేదు, గుణం లేదు, దేశం లేదు. నువ్వు పురుషుడవని, స్త్రీవని సహజంగా అనుకుంటున్నావు కదా, వేరెవరూ చెప్పకుండానే నువ్వే సహజంగా అనుకుంటున్నావు కదా! ఆ భావనే ఎంత సహజంగా, ఎంత బలంగా నీలో ఉందో, నేను బ్రహ్మమును అనే భావన అంత సహజంగా, అంత బలంగా కలిగినప్పుడు నువ్వు జీవన్ముక్తుడవు అని శంకరాచార్యులవారు చెబుతున్నారు.

## ప్రశ్న : నా స్వస్వరూపజ్ఞానం అనుభవానికి ఎలా వస్తుంది?

## శ్రీనాన్నగారు

నీ స్వస్వరూపం చైతన్యం, పరబ్రహ్మము. దాని అనుగ్రహం లేకుండా అది అనుభవంలోకి రాదు. ఆ "నేను" అనుగ్రహం ఉంటే అదే అనుభవంలోకి వస్తుంది. లేకపోతే తలకాయ గోడకేసి కొట్టుకున్నా రాదు. అది తెలివితేటలవల్ల రాదు, సంతానంవల్ల రాదు, దానధర్మాల వల్ల రాదు, కీర్తివల్ల రాదు, యజ్ఞాలవల్ల రాదు, మరేదానివల్ల అది రాదు.

అది అంటే బ్రహ్మము లేదా చైతన్యం ఎన్నుకున్నవాడికే తెలియబడుతుందని కఠోపనిషత్తులో చెప్పారు. మనం దాన్ని ఎన్నుకోవటం కాదు, అది మనల్ని ఎన్నుకుంటే అది తెలియబడుతుంది. అలాగని మనం ప్రయత్నం చెయ్యడం మానకూడదు. అయితే ఆ ప్రయత్నం శరణాగతి భావంతో చేస్తే, అంటే ప్రతి విషయంలోనూ ఆ భగవంతుడి సంకల్పమే నెరవేరుతుంది అన్న భావంతో చేస్తే నీ బాధ్యతను భగవంతుడు తీసుకుంటాడు.

నువ్వు మంచి పనులు చేస్తే, పుణ్యాలు వస్తాయి. ఆ పుణ్యం అనుభవించాక కాలప్రవాహంలో ఖర్చయిపోతుంది. అది వేరు, ఆత్మానుభవం కలగడం వేరు.

ఏ నేనునయితే తెలుసుకోవాలి అనుకుంటున్నావో ఆ నేను దయవల్ల మాత్రమే అది తెలియబడుతుంది. దానికి మినహాయింపు లేదు. దానికోసం సాధనం చెయ్యడం వరకే నీ వంతు. ఆ చైతన్యం నిన్ను ఎన్నుకున్న మరుక్షణమే అది నీ అనుభవంలోకి వస్తుంది.

## మననం చేయదగిన వాక్యాలు

(1) నిద్రలో మనస్సు అణిగి పోతుంది, అప్పుడు జగత్తు లేదు, జీవుడు లేడు, ఈశ్వరుడు లేడు. మనస్సు లేనప్పుడు ఏవి లేవో, మనస్సు వచ్చాక ఏవి వస్తున్నాయో అవి మనోకల్పితాలు.

(2) 'తత్' అంటే 'చైతన్యం', 'త్వం' అంటే 'నువ్వు' అని అర్థం. ఆ చైతన్యం నీవై ఉన్నావు. దేహాభిమానంతో ఉన్నప్పుడు కూడా నువ్వు బ్రహ్మమే అయి ఉన్నావు.

(3) బ్రహ్మముగురించి చెప్పేవాడు బ్రహ్మము అయి ఉండాలి.

(4) ఏ నేనునయితే తెలుసుకోవాలి అనుకుంటున్నావో, ఆ నేను దయవల్ల మాత్రమే అది తెలియబడుతుంది.

✷✷✷

## 5. జీవన్ముక్తుడు సర్వ కర్మబంధాలనుండి విముక్తుడే

కొత్తగూడెం,
30-04-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. "తత్త్వబోధ"లో శ్రీశంకరాచార్యులవారు వివిధ రకాలైన కర్మలగురించి, జీవన్ముక్తుడు సర్వకర్మ బంధాలనుండి విముక్తుడు అవ్వటం గురించి చెప్పినదానిపై దయచేసి వివరించండి.

శ్రీనాన్నగారు:

**"కర్మలు ఆగామి, సంచితం, ప్రారబ్ధం అని మూడు విధాలుగా ఉంటాయి.**

**అనుభవజ్ఞానం తరువాత జ్ఞాని దేహంద్వారా చేయబడిన పుణ్య పాప కర్మలు ఆగామి అని చెబుతారు.**

**అనంత కోటి జన్మలకు విత్తనంవంటిదై కర్మలనుండి పుట్టి పూర్వం సంపాదించుకొన్నది ఏది మిగిలి ఉందో అది సంచిత కర్మ అని తెలుసుకోవాలి.**

**ఈ శరీరాన్ని కలుగచేసి ఈ లోకంలో సుఖదుఃఖాలు మొదలైన వాటిని ఇచ్చే కర్మ ఏదో దానిని ప్రారబ్ధం అంటారు. అది అనుభవించడంతో నశిస్తుంది."**

(తత్త్వబోధ)

ప్రారబ్ధం, సంచితం, ఆగామి. ప్రారబ్ధం అంటే మనం రోజూ డబ్బాలో తీసుకొని అన్నం వండుకునే బియ్యంలాంటిది. సంచితం అంటే గాదెలో వడ్లు లాంటివి.

బియ్యం ఆడించుకోవడానికి గాదెలో వడ్లు నిలువ చేసుకుంటారు కదా, అలా గాదెలో నిలువ ఉన్న వడ్లు లాంటిది సంచితం. తరువాత కొన్ని రోజుల తరువాత మనం చేసే దాళవా పంటలో వచ్చే ధాన్యం లాంటిది ఆగామి.

**మనం ఇప్పుడు అనుభవించేది ప్రారబ్ధం, నిలువ ఉన్నది సంచితం, రాబోయేది ఆగామి.**

**"నేను బ్రహ్మము అను నిశ్చయజ్ఞానం వలన సంచిత కర్మ నశిస్తుంది. జ్ఞానంవలన ఆగామి కర్మ కూడా నశిస్తుంది. తామరాకు నీటి బిందువుచే అంటబడని విధంగా జ్ఞానికి కొంచెం కూడా ఆగామి కర్మతో సంబంధం ఉండదు".** (తత్త్వబోధ)

కొంతమంది జ్ఞానికి సంచిత కర్మలు, ఆగామి కర్మలు ఉండవుగాని ప్రారబ్ధం మాత్రం అనుభవిస్తేగాని పోదు అని అంటారు. రమణమహర్షిగారు ప్రారబ్ధం కూడా జ్ఞానికి ఉండదు అని వివరిస్తూ, "దశరథుడికి ముగ్గురు భార్యలు. దశరథుడు చనిపోయినప్పుడు ఆ ముగ్గురి భార్యలకు వైధవ్యం వస్తుంది గాని, ఇద్దరికి వచ్చి ఒకళ్ళకి వైధవ్యం రాకుండా ఆగిపోదు కదా! అలాగే కర్త లేనప్పుడు కర్మలు అన్నీ నశిస్తాయి" అని చెప్పారు.

ఒకడికి తలే లేకుండా పోయినపుడు ఇక వాడికి తలపోటంటే అర్థం ఉండదు కదా! శరీరం ఉన్నవాడికి రోగం కాని శరీరం లేనివాడికి రోగం ఏంటి?

జ్ఞానికేదో జబ్బు చేసింది, ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని చూసేవాళ్ళకి అనిపిస్తుంది. నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకునేవాడు లోపల ఉంటే, వాడు జ్ఞాని ఎలా అవుతాడు? అలా అనుకోవడం అజ్ఞానంలో భాగమే కదా!

అనుభవజ్ఞానంతో రమణమహర్షిగారు చెప్పినది నూటికి నూరుపాళ్ళు సత్యం. మీరు కూడా ఆలోచించండి. అసలు అనుభవించేవాడు ఎవడు? భూమ్మీద నడిస్తే పాదాలకు ఏదో ఒకటి అంటుకుంటుంది. అసలు భూమ్మీద నడవకపోతే ఆ పాదాలకు ఇంక ఏమీ అంటుకోదు కదా!

ప్రారబ్ధం అనుభవిస్తున్నానని చైతన్యం అంటోందా లేక శరీరం అంటోందా? చైతన్యం ఏమీ అనుభవించదు కాబట్టి అది అనదు, శరీరం జడం కాబట్టి అది కూడా అనదు. మరి అలా అనుకునేది ఎవరు? మనస్సు! నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని మనస్సు అనుకుంటుంది. మనోనాశనం అయినవాడు చైతన్యస్వరూపం పొందుతాడు. ఆ తరువాత ప్రారబ్ధం అనుభవించటానికి అక్కడ ఎవడూ లేడు కదా!

శంకరాచార్యులవారు సంచిత కర్మ, ఆగామి కర్మ జ్ఞానికి నశిస్తాయి అన్నారు. ప్రారబ్ధం గురించి చెప్పలేదు అనుకుంటారు చాలామంది. తత్త్వబోధలో 'నేను బ్రహ్మము' అనెడి అపరోక్షజ్ఞానం వలన జీవన్ముక్తుడు సర్వ కర్మబంధాలనుండి విముక్తుడు అవుతాడు అని స్పష్టంగా చెప్పారు. దీనివల్ల మనం గ్రహించవలసింది ఏమిటంటే ప్రత్యేకించి చెప్పకపోయినా ప్రారబ్ధకర్మ గురించి కూడా చెప్పినట్లే కదా! అలా సరిగ్గా అర్థం చేసుకొంటే రమణమహర్షిగారు చెప్పినదానితో ఆచార్యులవారు చెప్పింది కూడా సరిపోతుంది, సమన్వయం అవుతుంది.

మీ బుద్ధికి అందనంత మాత్రాన శాస్త్రవాక్యం తప్పు అనుకోకూడదు.  భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు: వీటిని శాస్త్రం అంటారు. మీకు అర్థం కాకపోయినా శాస్త్రం తప్పు అనుకోకూడదు, మనకు సరిగ్గా అర్థం కావడంలేదని సద్గురువునుండి తెలుసుకొని ఆ శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. అందువలన, జీవన్ముక్తుడు సర్వకర్మ బంధాలనుండి విముక్తుడే అని అర్థం చేసుకోవాలి.

కాల్చిన తాడు తాడులాగానే కనిపిస్తుందిగాని ఆ తాడు పెట్టి ఏదైనా కడదామంటే కుదరదు. జ్ఞానిచేసే కర్మ అటువంటిదే. అంటే జ్ఞాని కర్మ చేస్తున్నాడని చూసేవాళ్ళకి, అంటే దేహాభిమానం ఉన్నవాళ్ళకి, అనిపిస్తుంది. కాని దేహాభిమానం లేని జ్ఞానికి నేను కర్మ చేస్తున్నానన్న భావనే ఉండదు.

రమణమహర్షిగారు "జ్ఞానికి ప్రారబ్ధం కూడా ఉండదు" అన్నప్పుడు "అదెలా కుదురుతుంది? మీకిప్పుడు కేన్సర్ వచ్చింది, అది మీరు అనుభవిస్తున్నారు కదా!" అని వారిని అడిగారు. దానికి సమాధానంగా ఆయన "రమణ మహర్షి ప్రారబ్ధం అనుభవిస్తున్నారని మీరు అనుకుంటున్నారు. కాని ఇక్కడ ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని అనుకునేవాడు లేడు కదా!" అన్నారు.

దేహభావన పెట్టుకొని పని చేస్తే పాపం వస్తుంది కాని దేహభావన లేకుండా చేస్తే పాపం రాదు. నేను చేస్తున్నాననే తలంపు లేకుండా చేసినప్పుడు, మూడు లోకాలను నశింపచేసినా అటువంటివానికి పాపం రాదు.

పూర్వం రోజుల్లో నాటకాలలో పురుషులచేత స్త్రీ వేషాలు వేయించేవారు. ఆ నటుడు బైటికి స్త్రీగా కనిపిస్తున్నా, మనస్సులో నేను స్త్రీని అనుకోడు కదా! నీకు దేహం ఉంది, జ్ఞానికి దేహం ఉంది. నీకు దేహంతో తాదాత్మ్యం ఉంది, జ్ఞానికి తాను దేహం కాదని అపరోక్షంగా తెలుస్తూ ఉంటుంది.

మనం వాళ్ళు మంచివాళ్ళు, వీళ్ళు చెడ్డవాళ్ళు అని లోకంలో మనుషులను విడదీసి చూస్తున్నాం. కానీ వాళ్ళ మొఖాల మీద అలా ఏమీ రాసి లేదు కదా? కేవలం నీ మనస్సు అలా చెబుతోంది! నీ మనస్సెంత నిజమో వాళ్ళు మంచి వాళ్ళు, వీళ్ళు చెడ్డవాళ్ళు అని అనుకోవడం కూడా అంతే నిజం.

ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు కనిపించడమే మాయ. నిజానికి కర్తృత్వం లేని జీవుడు "నేను చేస్తున్నాను" అని అనుకోవడమే మాయ.

ఇంకా చెప్పాలంటే, నేను చేస్తున్నాను అని నువ్వు అనుకోవడం ఎంత అసత్యమో, నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని అనుకోవడం కూడా అంతే అసత్యం.

నేను చేస్తున్నాను అనే భావన పూర్తిగా తొలగినవానికి దుఃఖం అనేది కలగదు.

## మననం చేయదగిన వాక్యాలు

1. జీవన్ముక్తుడు సర్వకర్మ బంధాలనుండి విముక్తుడు. జ్ఞాని కర్మ చేస్తున్నారని చూసేవాళ్ళకి అంటే దేహాభిమానం ఉన్నవాళ్ళకి అనిపిస్తుంది. కాని దేహాభిమానం లేని జ్ఞానికి నేను కర్మ చేస్తున్నానన్న భావనే ఉండదు.

2. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు కనిపించడమే మాయ. నిజానికి కర్తృత్వం లేని జీవుడు "నేను చేస్తున్నాను" అని అనుకోవడమే మాయ. నేను చేస్తున్నాను అనే భావన పూర్తిగా తొలగినవానికి దుఃఖం అనేది కలగదు.

✷✷✷

# 6. ఆత్మజ్ఞానికి మాత్రమే శోకంనుండి విడుదల

కొత్తగూడెం,
01-05-2010.

**ప్రశ్న**: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు తత్త్వబోధలో ఆత్మవిదుడు సంసారమును దాటడం గురించి, ఆ తరువాత శరీరాన్ని ఎక్కడ వదిలినా అతడు ముక్తుడే అనటం గురించి వివరించండి.

## శ్రీనాన్నగారు

**"ఈ విధంగా ఆత్మవిదుడు సంసారాన్ని దాటి బ్రహ్మానందాన్ని ఇక్కడే పొందుతాడు. ఆత్మవిదుడు శోకమును దాటును అని వేదాలు తెలిపాయి."** (తత్త్వబోధ)

ఆత్మవిదునికి మరణం లేదు. మరణించే శరీరం తాను కాదని స్పష్టంగా అతనికి తెలుస్తూ ఉంటుంది. శరీరం మరణించేటప్పుడు కూడా అతడికి అమృతానుభవం ఉంటుంది కాబట్టి, నేను మరణిస్తున్నాను అని అనుకోడు. కొబ్బరికాయ కురిడి విడిపోయినట్లు శరీరంనుండి అతడు విడిపోతాడు.

ఆత్మవిదునకు శరీరం ఉండడం లేదా మరణించడం అనే విషయాలతో అతని ఆనందం సంబంధం కలిగి లేదు. శరీరం ఉన్నప్పుడు ఏ ఆనందం అయితే ఉందో, శరీరం పోయినప్పుడు, ఆ తరువాత కూడా, ఆ ఆనందం అలాగే ఉంటుంది. ఎందుచేత? ఆత్మవిదుని స్వరూపం ఆనందం. అది అతనిలో వున్న ఒకానొక గుణం కాదు. అతడికి దేహం ఉన్నా ఒకటే, పోయినా ఒకటే – బ్రాహ్మీస్థితి పొందిన వాడికి దేహం ఉండడంవల్ల లాభం లేదు, దేహం పోవడంవల్ల నష్టమూ లేదు.

బ్రాహ్మీస్థితి పొందినవాడు ఈ శరీరం ఎప్పుడూ ఉండాలని అనుకోడు. అంటే నెత్తిమీద బరువు మోసేవాడు ఆ బరువును ఎంత సంతోషంగా కింద పెట్టేస్తాడో, బ్రాహ్మీస్థితిని పొందినవాడు శరీరాన్ని అలాగే విడిచిపెడతాడు. అతడికి శరీరం ఉండడం వల్ల ప్రత్యేకమైన లాభం లేదు.

"ఆత్మవిదుడు శోకమును దాటును అని వేదాలు తెలిపాయి."

నీకు అన్ని భోగాలు ఉన్నాయి. ప్రపంచంలో నీకు ఏ లోటూ లేదు. అయినా దుఃఖం వస్తూంటే ఇక ఆ భోగాలవల్ల ప్రయోజనం ఏమిటి? నీవు ఏది సంపాదించినా సుఖపడడం కోసమే కదా? మనకు అన్ని వస్తువులు అందుబాటులో ఉన్నా దుఃఖం వచ్చేస్తుంటే ఇక వాటిని ఏం చేసుకుంటాం? దుఃఖములేని స్థితి బ్రహ్మములోనే ఉంది. ఇంకెక్కడా లేదు. దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి వీటిలో కామం దాక్కొని ఉంటుంది.

నీవు ఆ దేహేంద్రియాల పరిధిలో ఉన్నంత కాలం కామాన్ని జయించలేవు. కామం ఆత్మలో లేదు. అందుచేత సాధకుడు ఆత్మానుభవం కలిగేవరకు కామాన్ని జయించానని చెప్పడానికి వీల్లేదు. అలాంటిది విశ్వామిత్రుడికే అవకాశం లేకపోయింది. కామం అణిగి ఉంటుంది. ఇక్కడ కామం అంటే కేవలం స్త్రీ, పురుష సంబంధం అని కాదు. నువ్వేదో మంచి పని చేసి గుర్తింపు కోరుకుంటున్నావంటే అదీ కామమే. కామం అంటే కోరిక. కొంతమంది వాళ్ళు చేసిన మంచిపని పదిమందికి తెలిసిందో, లేదో అనుకుంటారు. అది కూడా కామమే. అందుకే ఏ పనైనా సరే తన కుడిచెయ్యి చేసేది ఎడంచెయ్యికి తెలియకూడదని అంటారు విజ్ఞులు.

ఆత్మవిదుడు అంటే ఆత్మానుభవము ఉన్నవాడు, ఆత్మజ్ఞాని, అని అర్థం. కామం ఎక్కడ లేదు? ఆత్మలో లేదు. శోకం ఎక్కడ లేదు? ఆత్మలో లేదు. అందుచేత నువ్వు ఆత్మానుభవం పొందేవరకు నిన్ను దుఃఖం వెంటాడుతుంది, కామం వెంటాడుతుంది. ఒకసారి మామూలుగా మనకు ఏమీ దుఃఖము లేదనుకుంటాం. కాని అది లేకపోవడంకాదు, వాయిదా పడుతోంది అంతే. అంటే అజ్ఞానం ఉన్నంతకాలం దుఃఖం లేదు అనుకోకూడదు. ఏదో ఒక రోజు దుఃఖం వచ్చి తీరుతుంది. కోర్టు వాయిదాలలాగానే దుఃఖం రావడం కూడా వాయిదా పడుతోంది. లోపల అజ్ఞానం ఉన్నంతకాలం దుఃఖం ఏదో ఒక కారణం వల్ల వస్తుంది.

దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి – వీటిలో శోకం దాగి ఉంటుంది, కామం దాగి ఉంటుంది. కామంలో చెడ్డ ఏమిటంటే నువ్వు దాన్ని సంతృప్తిపరుస్తూ దాన్ని జయించలేవు. దాన్ని సంతృప్తిపరచిన వాడికంటే, దాన్ని నిగ్రహించుకున్న వాడికే ఎక్కువ సంతోషం ఉంటుంది. కామం వేరు, క్రోధం వేరు కాదు. కామం నెరవేరకపోతే అది క్రోధం కింద మారుతుంది. కామంలోంచే క్రోధం వస్తుంది. కామం లేనివాడికి క్రోధం ఏమిటి? అసలు కోరిక ఎలా ఉంటుందో తెలియని వాడికి కోపం ఏంటి?

ఆత్మజ్ఞాని శోకంనుండి పూర్తిగా విడుదల పొందుతాడు. నీకు వెయ్యి ఎకరాల పొలం ఉంది. అయినా దుఃఖం వచ్చేస్తోంది. ఆ పొలం ఏం చేసుకుంటావు. రమణమహర్షిగారు దీనికి ఒక ఉదాహరణ చెప్పారు. చక్కటి గదివుంది, మంచం ఉంది, పరుపు ఉంది, తలకింద దిండు ఉంది, కాళ్ళకింద దిండు ఉంది, సీలింగ్ ఫ్యాన్ ఉంది, అన్ని సదుపాయాలు ఉన్నాయి. ఈ సదుపాయాలన్నీ ఎందుకు? నీకు నిద్ర పట్టడానికి. ఇన్ని సదుపాయాలున్నాయి కనుక నిద్రపట్టకపోయినా ఫరవాలేదు అని ఎవరైనా అనుకుంటారా? అలాగే, నాకు వెయ్యి ఎకరాల పొలం ఉంది కనుక దుఃఖం వచ్చినా ఫరవాలేదు అని ఎవరూ అనుకోరు. అందుచేత వారు కామాన్ని దాటాలన్నా, శోకాన్ని దాటాలన్నా ఆ రెండూ ఏ పదార్థంలో అయితే లేవో, అక్కడికి చేరుకోవలసిందే. ఇంక మధ్యేమార్గం లేదు.

ఆ సద్వస్తువును చేరుకోవడానికి అనేక మార్గాలున్నాయి. జన్మాంతర సుకృతాన్ని బట్టి ఎవర్ని ఆ ఈశ్వరుడు, జగత్ప్రభువు, ఎలా అనుగ్రహిస్తాడో చెప్పలేం. ప్రపంచంలో అనేక మంది ఆత్మానుభవం ఉన్నవాళ్ళు ఉండొచ్చు. కాని ఆత్మానుభవం ఏ ఇద్దరికీ ఒక మార్గంలో రాలేదు. పక్షులు ఎగురుతూ ఉంటాయి. “ఫలాన పక్షి ఇలా ఈ దారిలోనే వెళ్లింది” అని ఎలా చెప్పగలం? చెప్పలేం. అలాగే ఈశ్వరుడు ఎవర్ని ఎలా అనుగ్రహిస్తాడో చెప్పలేం.

రవీంద్రనాథ్ ఠాగూర్ బాత్రూంలో కూర్చుని స్నానం చేస్తుండగా ఒకసారి ఆత్మస్ఫురణ కలిగిందన్నాడు. పదహారేళ్ళ వయస్సులో రమణమహర్షిగారికి మరణభయంద్వారా ఆత్మానుభవం కలిగింది.

తన సాధన తాను సక్రమంగా చేస్తూ ఆత్మానుభవానికి తగిన అర్హత పొందినవాడికి ఈశ్వరుడు ఆ అనుభవాన్ని ఎలా ఇస్తాడో చెప్పలేం. అది ఎప్పుడు ఇస్తాడో, ఎక్కడ ఇస్తాడో, ఎలా ఇస్తాడో, ఆ ముహూర్తం ఈశ్వరుడే పెట్టుకుంటాడుగాని మనం చేసేది కాదు. నీ పనల్లా నీ సాధన నువ్వు చెయ్యడం.

(2) “**ఆత్మజ్ఞానం కలిగిన తరువాత; శరీరం కాశీలో విడిచినా, కుక్క మాంసం తినే వాని ఇంట్లో వదిలినా, జ్ఞాని మాత్రం ముక్తుడే అని స్మృతులు కూడా తెలుపుతున్నాయి**.” (తత్త్వబోధ)

శ్రుతి అంటే వేదం. స్మృతి అంటే ధర్మశాస్త్రాలు. కావ్యం అంటే రామాయణం, భారతం. వేదాల్లో చెప్పిందే స్మృతులలో కూడ కథలు రూపంలో చెప్పారు. అలాగే రామాయణం, భారతం కూడా. వేదాలు చదవలేని వారికోసం కావ్య రూపంలో రాశారు. రామాయణం గురించి ఏమంటారంటే – వేదాలలో ప్రతిపాదించబడిన పురుషుడు రాముడుగా అవతరించాడు; వేదాలయొక్క సారం రామాయణం. అలాగే, మహాభారతంలో కూడా వేదాలసారమే ఉంది. స్మృతులలో పరాశరస్మృతి, మనుస్మృతి వంటివి వున్నాయి. భగవద్గీత యోగ శాస్త్రమే, ఉపనిషత్‌సారమే! కానీ, వేదం ఒకటే శ్రుతి.

నువ్వు అన్నం తినేసాక విస్తరిని ఇనప్పెట్టెలో పెట్టుకోవుకదా! చెత్తకుండిలో పడేస్తావు. అలాగే ఆత్మానుభవం కలిగాక శరీరంతో గాని ధర్మశాస్త్రాలతో గాని ఇక పనిలేదు కదా! పొందవలసింది పొందాక ఆ శరీరం ఎక్కడుంటే ఏం – దానితో ఏం సంబంధం లేదు. ఆ శరీరానికి సంబంధించిన ఎరుక కూడా వాడికి ఉండదు. దీనికి భాగవతంలో ఏం చెప్పాడంటే, బాగా సారా తాగిన వాడికి ఒంటిమీద బట్ట ఉందో లేదో ఎలా తెలియదో ఆత్మానుభవం పొందినవాడికి కూడా శరీరం ఉందో లేదో వాడికే తెలియదు. అలాంటి జ్ఞాని తన శరీరాన్ని ఎక్కడ వదిలినా ముక్తుడే అని ఆచార్యులవారు చెబుతున్నారు.

(3) "**ఈ విధంగా తత్త్వబోధ అనే ప్రకరణం సమాప్తమైంది.**" (తత్త్వబోధ)

తత్త్వబోధ ప్రకరణగ్రంథం. శాస్త్రంలో ఉన్న సారం ఈ పుస్తకంలో ప్రకటించారు. తత్త్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి – వీటిని ప్రకరణ గ్రంథాలు అంటారు. శాస్త్రసారమే ఈ రూపంగా తీసుకొచ్చారు. శాస్త్రం అంటే భగవద్గీత, వేదాలు. శ్రీశంకరాచార్యులవారు ఉపనిషత్తులనే ప్రమాణంగా తీసుకుని ఈ ప్రకరణ గ్రంథం రచించారు. ఆచార్యులవారు చెప్పినవి కాలమాన పరిస్థితులను బట్టి తేడాగా ఉన్నా మూలంలో సరిపోతూ ఉంటుంది. ఈ విధంగా తత్త్వబోధ అనే ప్రకరణ గ్రంథం సమాప్తమైంది.

పురుషార్థాలు నాలుగు. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. పురుషార్థాలలో ముఖ్యమైనది మోక్షం. ఈశ్వరుడు అనేవాడు ఒకడున్నాడు. అతడే ప్రపంచానికి యజమాని. ఈ ప్రపంచానికి ఎవడు యజమానో ఆయనే మనకి కూడా యజమాని. ఆ భగవంతుడనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం మన మనసుకి కుదిరితే నూటికి యాభై మార్కులు వచ్చేసినట్టే.

దైవనిర్ణయం ఒక రకంగా ఉండవచ్చు. నీ సంకల్పం దీనికి వేరుగా ఉండవచ్చు. ఎల్లప్పుడూ దైవనిర్ణయమే జరుగుతుంది అని సంకల్పాలు ఏమీ చేయకపోవడమే శరణాగతి.

అసలు మనం లేము. ఒకసారి ఈశ్వరనిర్ణయం, మన సంకల్పం కలుస్తుంది. అలా కలిసినప్పుడు, ఆ పని మనం సాధించాం అనుకుంటాం. అప్పుడు కూడా ఈశ్వరనిర్ణయంలో మన సంకల్పం కూడా ఇమిడి ఉంది కాబట్టి అది జరిగింది. దైవనిర్ణయం మన సంకల్పం వేరుగా ఉన్నప్పుడు మన పని జరుగదు. ఆయన నిర్ణయమే జరుగుతుంది. అప్పుడు మన పని అవ్వలేదు, మనం పని సరిగా చెయ్యలేదు అనుకుంటాం. దైవనిర్ణయం, నీ సంకల్పం రెండూ కలిసినప్పుడు, అనుకున్నది నెరవేరి నీకు గర్వం వస్తుంది. అప్పుడు కూడ ఆ పనిని ఈశ్వరుడే చేశాడు. కాని నేను చేశాను అనుకుంటావు. అది మాయ, మాయ వల్ల అలా అనుకుంటావు.

ఆచార్యుల వారు భగవద్గీతకి, ఉపనిషత్తులకి వ్యాఖ్యానం వ్రాసారు, వాటిని భాష్యాలు అంటారు. దేవతలను స్తుతిస్తూ కొన్ని గ్రంథాలు వ్రాసారు. వాటిని స్తోత్రగ్రంథాలు అంటారు. ఆచార్యులవారు చేసిన రచనలని మూడు రకాలుగా విభజిస్తారు. అవి భాష్య గ్రంథాలు, ప్రకరణ గ్రంథాలు, స్తోత్ర గ్రంథాలు. శ్రీ మహావిష్ణువు మీద కొన్ని స్తోత్రాలు రాశారు. విష్ణువుని అర్చించేవారికి ఆ స్తోత్రాన్ని పఠించి రూపాన్ని ధ్యానం చేసుకొని, ఆ నామాన్ని స్మరించి తరించడానికి.

రమణమహర్షిగారు "మాటసంబంధం కంటే మౌనసంబంధం బలీయముగా ఉంటుంది" అని చెప్పారు. మాటసంబంధం అంటే మన హృదయాల్లో ఆప్యాయతలు లేవనుకో, ఒట్టి మాటలు ఎందుకు? మన హృదయంలో ఆప్యాయత ఉందనుకో, మాటలతో ఇక సంబంధం లేదు. మన హృదయంలో ఆప్యాయత లేకుండా, ఊరికే మాటలో ఆప్యాయత ఉన్నా దానికేమీ విలువ లేదు. మాటసంబంధం కంటే, మౌనసంబంధం, అంటే హృదయ సంబంధం బలీయంగా ఉంటుంది. కొంతమంది ఎక్కువ మాట్లాడరు, కాని హృదయంలో ఆప్యాయంగానే ఉంటారు. వాళ్ళకున్న ఆప్యాయత కూడా బయటికి వ్యక్తం చేయరు. నిండుగా ఉంటారు.

అంతటా వ్యాపించి ఉన్న వస్తువుని మనం దర్శించలేకపోతున్నాం కాబట్టే ఆ వస్తువుకి ఒక రూపం కల్పించి, ఒక నామం పెట్టి, గుళ్ళో పెట్టి ఆరాధిస్తున్నాం. అంటే విగ్రహాన్ని ఆరాధించడం వల్ల కొంత నిగ్రహం వస్తుంది. స్తోత్రగ్రంథాలను ఆ భగవంతుడిని వివిధరకాలుగా ఆరాధించడానికి ఆచార్యులవారు వ్రాసారు.

శాస్త్రంలో ఉన్న సారాన్ని వివరిస్తూ ఆచార్యులవారు ప్రకరణ గ్రంథాలను రచించారు. అంతే కాకుండా భగవద్గీత, ముఖ్యమైన ఉపనిషత్తులకు వ్యాఖ్యానాన్ని భాష్య గ్రంథాలలో మనకు అందించారు. ఆచార్యుల వారి గ్రంథాలన్నీ అమూల్యమైనవే.

**వైరాగ్యం** అంటే మనస్సు ప్రపంచంలో ఏ విషయం మీద వాలకుండా ఉండడం. శాస్త్రంలో ఏం చెప్పారంటే వైరాగ్యం లేకుండా జ్ఞానం రాదని. భగవాన్ రమణమహర్షి జ్ఞానం, వైరాగ్యం ఒకటే అన్నారు. వైరాగ్యం అంటే మనస్సు ప్రపంచంలో ఏ వస్తువు మీదా వాలకపోవడం, జ్ఞానం అంటే మనస్సు లోపల సద్వస్తువును అంటిపెట్టుకొని ఉండడం. అది వైరాగ్యం, ఇది జ్ఞానం, రెండూ ఇంచుమించుగా సమానమే.

**ప్రశ్న: శాంతి అభ్యాసం వల్ల వస్తోంది కదా?**

శాంతి మన లోపలే సహజంగానే ఉంది. అభ్యాసం చెయ్యడంవల్ల వాసనలు తగ్గుతాయి, అవి తగ్గేకొలదీ లోపలున్న శాంతి అందుతుంది. నిజానికి నీవే శాంతి స్వరూపుడవు.

ఈ లోకవాసనవల్ల, ఈ దేహవాసనవల్ల కొన్ని తలంపులు వస్తాయి. ఎక్కువ చదువుకున్న వాడు ఆ ఉపనిషత్తులో ఇలా ఉంది, ఈ ఉపనిషత్తులో ఇలా ఉంది, తత్త్వశాస్త్రంలో ఇలా ఉంది, లేకపోతే భగవద్గీతలో ఇలా ఉంది అనుకుంటాడు. అది శాస్త్రవాసన.

ఒక మనిషి చనిపపోవటానికి వందరోగాలు అక్కర్లేదు. ఒక రోగం సరిపోతుంది. అలాగే ఒకడు అంతర్ముఖం అవకుండా ఆపుచెయ్యడానికి దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన – ఈ మూడు వాసనలలో ఒకటి చాలు. ఈ మూడు వాసనలని తగ్గిస్తుంది అభ్యాసం. శాంతి నీలోపలే ఉంది. అభ్యాసం చెయ్యడంవల్ల కొన్ని వాసనలు తగ్గుతాయి. అవి తగ్గే కొలది నీ లోనున్న శాంతి నీకు అందుతుంది.

వాడికి ఆరోగ్యం బాగుంది అంటారు. ఆరోగ్యం బాగుండడం ఏంటి? మధ్యలో అనారోగ్యం వచ్చింది. అనారోగ్యానికి మందులు వాడి పోగొట్టారు. ఈ అనారోగ్యం రాకముందు ఏ ఆరోగ్యం ఉందో ఇప్పుడూ ఆ ఆరోగ్యమే ఉంది. కొత్తగా రాదు. ఆరోగ్యవంతుణ్ని అయ్యాను అనుకుంటాడు. ఆరోగ్యవంతుడు అవడం కాదు. మధ్యలో వచ్చిన అనారోగ్యం పోయిందంతే.

అలాగే, మనం శాంతిగానే ఉన్నాం. అశాంతి రాకముందు ఎలా ఉన్నామో, అశాంతి పోయినతరువాత అలాగే శాంతిగా ఉంటాం.

## మననం చేయదగిన వాక్యాలు

(1) కామం అంటే కోరిక. ఆత్మానుభవము కలిగేవరకు సాధకుడు కామాన్ని జయించానని చెప్పడానికి వీల్లేదు.

(2) ఆత్మజ్ఞాని శోకంనుండి పూర్తిగా విడుదల పొందుతాడు.

(3) ఎల్లప్పుడూ దైవనిర్ణయమే జరుగుతుంది అని సంకల్పాలు ఏమీ చేయకపోవడమే శరణాగతి.

(4) శాంతి మన లోపల సహజంగానే ఉంది. అభ్యాసం చెయ్యడంవల్ల వాసనలు తగ్గుతాయి, అవి తగ్గేకొలదీ లోపలనున్న శాంతి అందుతుంది.

✷✷✷

# 7. సద్వస్తువు బయట దొరకదు

కొత్తగూడెం,
02-05-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారి పాదపద్మములకు నమస్కరిస్తూ ఈ క్రింద విషయాలను వివరించవలసినదిగా ప్రార్థన:

**"శాస్త్రాలను ఎంత చదివినా, యజ్ఞయాగాదులతో ఇంద్రాది దేవతలను మెప్పించినా, ఎన్ని పుణ్యకర్మలు చేసినా, దేవతలను భజించినా, ఆత్మైక్యజ్ఞానం లేకుండా వేలజన్మలు గడిచినా కూడా మోక్షం లభించదు. ధనం వలన, సత్కర్మల వలన ముక్తి లభించదని శ్రుతి స్పష్టంగా చెబుతున్నది కదా!"**

(వివేకచూడామణి-6&7)

**శ్రీనాన్నగారు**:

శాస్త్రాలు మనకు బయట ఉన్నాయి. అలాగే, యజ్ఞయాగాది కర్మలు మనకు బయటే ఉన్నాయి. సద్వస్తువు మన హృదయంలో ఉంది. ఆ వస్తువు ఉన్నచోట అన్వేషణ చేస్తే ఇవాళ కాకపోయినా కొంత కాలానికైనా అది దొరుకుతుందిగాని లేనిచోట ఎంతసేపు వెదికినా లాభం లేదని శ్రీశంకరాచార్యులవారు చెబుతున్నారు.

దేవతలంటే మనకు పైలోకంలో ఉన్నవాళ్ళు. వాళ్ళను మెప్పించటానికి మానవులు యజ్ఞాలు చేస్తారు. ప్రతి యజ్ఞానికి ఒక ఫలితం వుంది. ఇది భౌతికంగా మేలు కలిగిస్తుంది తప్ప ఆధ్యాత్మిక పురోగతి సామాన్యంగా వుండదు. అంటే యజ్ఞాలు, యాగాలు చేసినా, మరే ఇతర మంచి కర్మలు చేసినా, దేవతలను భజించినా లౌకికమైన ఫలితం వస్తుందిగాని ఆత్మజ్ఞానం రాదు!

శరీరం, మనస్సు 'నీకు' అన్యమైనవే! సాధారణంగా మనస్సే 'నేను' అనుకుంటాము. అయితే గాఢనిద్రలో మనస్సు ఉండడం లేదు కదా! నిద్రనుంచి లేచాక "నేను హాయిగా నిద్రించాను; నాకు నిద్రలో ఏమీ తెలియలేదు" అనే రెండు విషయాలు ప్రతి ఒక్కరు అంటారు. ఇది జాగ్రత్తగా గమనించండి! గాఢనిద్రలో ఏమీ తెలియని వ్యక్తి, అంటే ప్రపంచస్పృహ మరియు శరీరస్పృహ లేనివాడు నేను హాయిగా నిద్రించానని ఎలా చెబుతున్నాడు? ఆ నిద్రానుభవం పొందినవాడు ఎవడు? వాడిని గురించి తెలుసుకోవాలి!

పుణ్యకర్మలకు ఫలితం లేదని చెప్పడం లేదు. మీరు పుణ్యకర్మలు చేస్తే వాటికి తగ్గ ఫలితం మీకు లభిస్తుంది. పాప కర్మలకు కూడా వాటికి తగ్గ ఫలితం మీకు వస్తుంది. ఆ ఫలాలు భోగరూపంలోనో, అధికారం రూపంలోనో, ఇంకో రూపంలోనో వస్తాయి. అవన్నీ అనుభవించాలి. పుణ్యకర్మకు తగిన సుఖాన్ని అనుభవించాక ఆ అనుభవం మళ్ళీ కావాలని కోరుకుంటారు, ఈ కోరికే వాసనగా మారుతుంది. ఇటువంటి వాసనలు మరల జన్మలకు కారణం అవుతాయి. మోక్షం రావడం, రాకపోవడం వదిలెయ్యండి; అసలు మీ మనస్సే మోక్షంవైపు తిరగదు. అది పుణ్యకర్మలు చెయ్యడంలో ఉన్న ప్రమాదం. అందుకే పుణ్యకర్మలను 'నేను చేస్తున్నాను' అనే భావన లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా చేయాలి.

యజ్ఞయాగాదులు చేసో, పుణ్యకర్మలు చేసో దేవతలను సంతృప్తి పరిస్తే వాళ్ళు మనకు కొన్ని ఉపకారాలు చేస్తారు. అవన్నీ భౌతికమైనవి. దేహం, మనస్సు, పుణ్యకార్యాలు, పాపకార్యాలు, శాస్త్రాలు ఇవన్నీ బయట గొడవలు.

నేననే తలంపు మనకు లోపలినుండి వస్తోందా, బయటనుండి వస్తోందా? లోపల్నుండే వస్తోంది. ఆ నేననే తలంపు మూలంలోనే సద్వస్తువు ఉంది. అంటే సద్వస్తువు అక్కడ పొందాలిగాని బయట పొందేదికాదు.

శాస్త్రాలు చదివితే సరిపోదు కదా! ఉదాహరణకు మనం కొత్తగూడెంనుండి కాశీకి వెళ్ళాలి. పుస్తకంలో కాశీవెళ్ళేదారి చెబుతారు. మనం మన ఇంటిగడప దాటకుండా, ఆ మార్గం గురించి చెప్పిన వివరాలను కంఠతా పట్టినంత మాత్రాన కాశీ వెళ్లలేం కదా! ఆ పుస్తకంలో చెప్పిన దారిలో ప్రయాణం చేసిన తరువాతే కాశీకి వెళ్ళగలం!

శాస్త్రం వస్తువు స్వరూపం చెబుతుంది, ఆ తరువాత ఆ వస్తువు హృదయంలోనే ఉంది అని చెబుతుంది. శాస్త్రానిది తప్పులేదు. మనం దానిగురించి బయట వెతుకుతాం! అదే మాయ! అంటే శాస్త్రంవల్ల పాండిత్యం వస్తుందిగాని ఆత్మజ్ఞానం రాదు. పాండిత్యం బుద్ధి దగ్గర ఆగిపోతుంది. దేహంకంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియాల కంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే ఆత్మ గొప్పది. అందుచేత వీటన్నిటిని అధిగమించాలి గాని మధ్యలో ఎక్కడ ఆగిపోయినా ఆత్మజ్ఞానం రాదు.

లోపల ఉన్న వస్తువును మీరు బయట ఎంతగా వెదికినా, ఎన్నివేల సంవత్సరాల సాధన చేసినా దొరకదు. కొత్తగూడెంలో పడేసుకున్న వస్తువును భద్రాచలం వెళ్ళి ఎంత వెదికినా దొరకదు కదా! ఇక్కడే వెతికితే ఇవాళ కాకపోయినా నాలుగు రోజులకైనా దొరుకుతుంది.

ధనం ఉంటే బజారులో మనకు కావాల్సినవి కొనుక్కోవచ్చు. ధనం ఉంటే మంచి మేడ కట్టుకోవచ్చు. మంచి కారు కొనుక్కోవచ్చు. కాని ధనం వలన ప్రమాదం ఉంది. ధనం మనకు చెడు అలవాట్లు తెచ్చిపెడుతుంది. ధనం వల్ల గర్వం వస్తుంది. దైవం వైపు దృష్టిని పోనీయదు. సాధారణంగా ధనవంతుడికి ధనంతోటి తాదాత్మ్యం వుంటుంది. వాడి స్వాధీనంలో ధనం ఉండదు. ధనం స్వాధీనంలో వాడు వుంటాడు!

ధనంతోటి భోగాలు కొనుక్కోవచ్చు. అలాగే పుణ్యకర్మల ఫలితం సుఖరూపంలో వస్తుంది. పాపకర్మల ఫలితం దుఃఖరూపంలో ఖర్చయిపోతుంది. ఒక చైతన్యం తప్పించి, కాలప్రవాహంలో అన్ని భోగాలు, సుఖాలు కొట్టుకుపోతాయి. Nothing is too heavy for destiny.

మోక్షం శాస్త్రంలో లేదు. శాస్త్రం ఆత్మను సూచిస్తుంది తప్ప ఆత్మజ్ఞానం ఇవ్వదు కదా! శాస్త్రం ఆ సద్వస్తువు హృదయంలో ఉందని చెబుతుంది. ఆ సద్వస్తువు ఉన్నచోట అన్వేషణ చెయ్యాలి. అందుకే ఏసుక్రీస్తు "తట్టండి తెరువబడుతుంది, అడగండి ఇవ్వబడుతుంది" అన్నాడు.

భక్తులలో మోక్షకాంక్ష ఉన్నవారు వెయ్యిమందిలో ఒక్కడు కూడా ఉండటం లేదు. వాళ్ళకి మోక్షం విలువ తెలియదు కదా, పాపం వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? డబ్బు విలువ తెలుస్తోంది, చదువు విలువ తెలుస్తోంది, అధికారం విలువ తెలుస్తోంది. అందుకని వాటి గురించే ఆ భగవంతుడిని అడుగుతారు. భగవంతుడు మనం అడిగింది ఇస్తాడు. మనం లౌకికమైనవి అడుగుతూ ఉంటే మోక్షం ఇవ్వడు.

కఠోపనిషత్‌లో యమధర్మరాజు నచికేతుడికి ఇవి ఇస్తాను, ఇవి ఇస్తాను అని వంద ఆశలు చూపించాడు. అపుడు నచికేతుడు అవి మీరు ఇస్తారు, నేను పుచ్చుకుంటాను. కానీ, అవన్నీ కాలప్రవాహంలో కొట్టుకుపోతాయి; అందువల్ల నాకు ఆత్మజ్ఞానం తప్పించి ఇంకేమీ వద్దన్నాడు. చివరికి నచికేతుడికి ఆత్మజ్ఞానం బోధించబడింది.

చాలామంది భక్తులు మోక్షం కోరుకోరు. వారి ఉద్దేశ్యం ఏమిటంటే శరీరం ఉంటే మనం ఉంటాం, శరీరం లేకపోతే మనం ఉండం అని – చావంటే భయం అందుకే కదా! మోక్షం వచ్చిన వాళ్ళకు శరీరం మరలా రాదు కదా!

చిన్న చిన్న రోగాలను ఈ వైద్యులు నయం చేయగలరుగాని; చావడం, పుట్టడం అనే భవరోగాన్ని నయం చేయగలిగిన వైద్యుడు ఆ భగవంతుడే. పుట్టాం అనుకుంటే చచ్చిపోతాం. చచ్చిపోతున్నాం అనుకుంటే మళ్ళీ పుడతాం. మనం సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడు డాక్టరు గుర్తుకు రానట్లే bliss లో ఉన్నప్పుడు ఆ దేవుడు కూడా గుర్తుకు రాదు.

ఈ లోకంలోగాని, పరలోకంలోగాని, మొత్తం సృష్టిలో ఏ వస్తువులోనూ సుఖం లేదు. సుఖం నీ స్వరూపంలోనే ఉంది. ఈ వాక్యం లోతులు నీకు అందాలి. రోజూ ఈ వాక్యాన్ని మననం చేస్తూ సుఖాన్ని గురించి బయట వెతక్కుండా నీ స్వరూపంలో వెతుకు.

**ప్రశ్న: అద్వైతం ఆధారంగా లేకపోతే ఆధ్యాత్మికంగా నిలబడటం కష్టం కదా?**

**శ్రీనాన్నగారు**:

ద్వైతం అద్వైతం వైపుకు తీసుకువెళుతుంది. ద్వైతంలో కొంత దూరం ప్రయాణం చేశాక అది నిజం కాదని తెలుస్తూ ఉంటుంది. బుద్ధి దగ్గర విశేషం ఏమిటంటే నిజం కాని దాన్ని నిజం అని నువ్వు నమ్మినా, కొంత కాలానికి అది నిజం కాదని నీ బుద్ధి నీకు చెబుతూ ఉంటుంది. అది బుద్ధి లక్షణం.

తానుకాక వేరొకటి ఉంటే ద్వేషం రావచ్చు గాని అద్వైతంలో ద్వేషం లేదు కదా! ఎవరూ తమను తాము ద్వేషించుకోరు కదా!

దైవానుగ్రహం లేకుండా అద్వైతం అనుభవం సంగతి పక్కన పెట్టు, దాని మీద ఆసక్తి కూడా నీకు కలగదు. నీకు వెంటనే తెలియకపోయినా, నీ బుద్ధి కొంతకాలం తరువాత చెబుతుంది ద్వైతం అబద్ధమని.

ద్వైతంలో ఎంతటివాడికైనా ప్రమాదం ఉంది, అందుకనే ఆ గడప దాటాలి, అందుకే అక్షరమణమాలలో రమణమహర్షిగారు నువ్వువేరు, నేను వేరు అనే బుద్ధిని తీసెయ్యమని అంటారు.

## మననం చేయదగిన వాక్యాలు

(1) నిద్రనుంచి లేచాక "నేను హాయిగా నిద్రించాను; నాకు నిద్రలో ఏమీ తెలియలేదు" అనే రెండు విషయాలు ప్రతి ఒక్కరు అంటారు. గాఢనిద్రలో ప్రపంచస్పృహ మరియు శరీరస్పృహ లేనివాడు నేను హాయిగా నిద్రించానని ఎలా చెబుతున్నాడు? ఆ నిద్రానుభవం పొందినవాడిని గురించి తెలుసుకోవాలి!

(2) పుణ్యకర్మకు తగిన సుఖాన్ని అనుభవించాక ఆ అనుభవం మళ్ళీ కావాలని కోరుకుంటారు, ఈ కోరికే వాసనగా మారుతుంది. ఇటువంటి వాసనలు మరల జన్మలకు హేతువు అవుతాయి. అదీ పుణ్యకర్మలు చెయ్యడంలో ఉన్న ప్రమాదం! అందుకే పుణ్యకర్మలను 'నేను చేస్తున్నాను' అనే భావన లేకుండా; ఫలితాన్ని ఆశించకుండా చెయ్యాలి.

(3) నేననే తలంపు లోపలినుండే వస్తోంది. ఆ నేననే తలంపు మూలంలోనే సద్వస్తువు ఉంది. అంటే సద్వస్తువు అక్కడ పొందాలిగాని బయట పొందేది కాదు.

(4) ధనం మనకు చెడు అలవాట్లు తెచ్చిపెడుతుంది. ధనం వల్ల గర్వం వస్తుంది; దైవంవైపు దృష్టిని పోనీయదు.

(5) ఈ లోకంలోగాని, పరలోకంలోగాని మొత్తం సృష్టిలో ఏ వస్తువులోనూ సుఖం లేదు. సుఖం నీ స్వరూపంలోనే ఉంది.

✵✵✵

# 8. బ్రహ్మముగురించి బ్రహ్మమై చెప్పాలి

కొత్తగూడెం,
03-05-2010.

ప్రశ్న : శ్రీ నాన్నగారికి ప్రణామములు. దయచేసి ఈ కిందివాటిని వివరించండి.

**"విద్యావివేకసంపన్నుడైన సత్యాన్వేషి బాహ్యవిషయాల వలన కలుగు సుఖాలలో స్పృహను పూర్తిగా విడిచినవాడై, సత్స్వరూపుడును, మహాపురుషుడును అయిన గురువును సమీపించి, ఆ గురువుచే ఉపదేశింపబడిన విషయంలో నిలుపబడిన బుద్ధి కలవాడై ముక్తి కొరకు ప్రయత్నించాలి."** (వివేకచూడామణి - 8)

**"అసమర్థుడైన పురుషుడు (ఆత్మజ్ఞాని కానివాడు) బోధించితే ఆత్మ సవ్యంగా గ్రహించబడదు. ఎన్ని విధాలుగా ఆలోచించినా అది గ్రహించబడదు. సమర్థుడైన జ్ఞాని ఉపదేశించితే తప్ప దానికి వేరే దారి లేదు. ఆత్మ సూక్ష్మమైన దానికంటే అతి సూక్ష్మమైనది, అది తర్కానికి అతీతమైనది."** (కఠోపనిషత్ 1-2-8)

**శ్రీనాన్నగారు:**

**(1) సత్యాన్వేషి**

చాలా మంది భక్తులు సత్యం తెలిస్తే జనన మరణాలనుంచి విడుదల పొందగలరు. భక్తులందరూ సత్యాన్వేషకులు కారు. సత్యాన్వేషణకు సంబంధించిన శ్రవణ మననాలు వారికి తెలియవు.

భగవంతుడిని ఏం అడగాలో చాలామంది భక్తులకి తెలియదు. వాళ్ళకి ఇంట్లో ఊడవడానికి చీపురుకట్ట లేదనుకో, వాళ్ళ మనస్సు దాని గురించే ఆలోచిస్తుంది. ఆ సమయంలో భగవంతుడు కనిపిస్తే వాళ్ళు చీపురుకట్ట ఇవ్వమని అడుగుతారు!

మెదడుకి ఆలోచించడం కొంత అలవాటు చెయ్యాలి. ఆలోచనా, వివేకం అలవాటు చెయ్యాలి. భగవంతుడిని వివేకవంతమైన బుద్ధిని ఇవ్వమని ప్రార్థించాలి. అలా ప్రార్థిస్తే జ్ఞానం కలిగే బుద్ధిని ప్రసాదిస్తాను అని భగవద్గీతలో కృష్ణ భగవానుడు చెప్పాడు. అయితే అడిగేవాడేడి? పిడకలడిగేవాడే కాని మంచి బుద్ధిని అడిగేవారు లేకుండా పోయారు. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాలగురించి అడుగుతారుగాని నాకు వివేకవంతమైన బుద్ధిని ప్రసాదించమని అడిగేవారు లేరు.

నువ్వేదైతే అవునో అది కాదనుకుంటున్నావు. ఏదైతే నువ్వు కాదో అది నీవు అనుకుంటున్నావు. తిరకాసు ఇక్కడ వస్తోంది. కొంతమంది దేహం ఆత్మ అనుకుంటున్నారు. మరికొంతమంది మనస్సుని ఆత్మ అనుకుంటున్నారు. కొంచెం బుద్ధి సూక్ష్మత ఉన్నవాళ్ళు బుద్ధితో తాదాత్మ్యం పొందుతున్నారు. బుద్ధికూడా అనాత్మే కదా! ఇలా ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క గడప దగ్గర ఆగిపోతున్నారు. దుఃఖానికి కారణం బయట లేదు, లోపలే ఉంది. ఏదైతే నీ దుఃఖానికి కారణమో, దాంట్లోంచి విడుదల అవడమే మోక్షం. ఈ సంగతి వివేకవంతుడికే తెలుస్తుంది.

అందుకే విద్యా వివేక సంపన్నుడైన సత్యాన్వేషి మాత్రమే సత్యాన్ని తెలుసుకొనగలడు అన్నారు శ్రీశంకరాచార్యులవారు. సత్యాన్ని తెలుసుకోవాలన్న జ్ఞానం, ఆ వివేకం అనేది నిజమైన సంపద అని చెప్పడం అన్నమాట.

## (2) గురువు

తరువాత, బాహ్యవిషయాలవలన కలుగు సుఖాలలో స్పృహను పూర్తిగా విడిచినవాడూ, సత్స్వరూపుడును, మహాపురుషుడును అయిన గురువును సమీపించాలి అని అన్నారు.

ముందు శిష్యుడి గురించి చెప్పాక తరువాత ఎలాంటి గురువు దగ్గరకు ఆ శిష్యుడు వెళ్ళాలో చెబుతున్నారు. నిజమైన గురువు శరీరాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టేస్తాడు. ఆ శరీర ప్రారబ్ధంలో ఏది ఉంటే అది జరుగుతుంది. ఈ సూత్రం రమణమహర్షిగారు వారి తల్లికి "జరుగవలసింది జరుగుతుంది. జరుగరానిది ఎవరెంత ప్రయత్నం చేసినా జరుగదు, ఇది నిశ్చయం" అని చెప్పారు.

మహాత్ములు తమ దగ్గరకు వచ్చినవారికి మంచి చెబుతారు. ఆ వచ్చిన వాళ్ళు అది వింటారో, వినరో అన్నది వాళ్ళ చైతన్యస్థాయిని బట్టి ఉంటుంది. బాహ్యసుఖాలు ఏది అనుభవించినా అది దుఃఖంగా మనకి పరిణమిస్తుంది అని తెలుసుకోవాలి.

ఆత్మసుఖం ఒక్కటే నిజం. విషయసుఖాలన్నీ మిథ్య. ఒక్క ఆత్మసుఖం తప్పించి, బాహ్యమైన విషయసుఖాలు ఏవి అనుభవించినా అవన్నీ క్రమేపీ దుఃఖంగా మారిపోతాయి. ఈ విషయం తెలిసిన గురువుకి బాహ్యసుఖాలయందు స్పృహే ఉండదు.

రమణమహర్షిగారి దగ్గర గొప్పతనం ఏమిటంటే impersonal life, అంటే లోపల మనిషి కనబడదుగాని పని జరుగుతూ ఉంటుంది. individual I లేదు అక్కడ. మాకు అరుణాచలంతో సంబంధం లేదు, మీ గురించి అరుణాచలం వచ్చామండీ అని రమణమహర్షిగారితో అంటే "మీరు అరుణాచలం నాగురించి వచ్చారు. మరి నేను ఎవరి గురించి వచ్చాను? నన్నెవడు అరుణాచలం తీసుకొచ్చాడో వాడే మిమ్మల్ని తీసుకొచ్చాడు" అన్నారు.

ఇంకొకరు మీ అనుగ్రహంవల్ల మాకు జ్ఞానం రావాలి అని అంటే "నాకెవడు జ్ఞానమిచ్చాడో వాడే మీకూ జ్ఞానం ఇస్తాడు" అన్నారు రమణమహర్షి గారు. ఐశ్వర్యం ఎవరిది? ఈశ్వరుడిది. నీకు తెలివితేటలున్నా అవి నీ సొంతం కాదు, ఈశ్వరుడు ఇస్తే వచ్చాయి, ఈశ్వరుడు ఇవ్వకపోతే రావు. అంతా ఈశ్వరుడిదే.

బాహ్యవిషయాలలో స్పృహ లేని వాడు, సత్స్వరూపుడు, మహాపురుషుడిని గురువుగా ఎన్నుకోమన్నారు. అందుకు పూర్వపుణ్యం కలసిరావాలి. వివేకచూడామణిలో ఆచార్యులవారు చెప్పారు కదా, ముందుగా మానవ జన్మ రావాలి. తరువాత సత్యాన్ని తెలుసుకోవాలనే తపన, మోక్షాన్ని పొందాలనే ముముక్షత్వం రావాలి. ఎవరో చెప్పడం కాదు, నీకు లోపలినుంచి రావాలి. ఒకవేళ వచ్చినా, దానికి తగిన గురువు నీకు పూర్వపుణ్యంవలన దొరకాలి!

## (3) బుద్ధి

ఆ తరువాత "ఆ గురువుచే ఉపదేశింపబడిన విషయంలో నిలుపబడిన బుద్ధి కలవాడై ముక్తి కొరకు ప్రయత్నించాలి" అన్నారు.

గురువుచే ఉపదేశింపబడిన విషయంలో నీ బుద్ధి ఎప్పుడు నిలుస్తుందంటే నీకు సాధన చతుష్టయ సంపద కలిగినప్పుడు. ఆ సాధన చతుష్టయ సంపద గురించి ఇంతకు ముందు చెప్పుకున్నాం కదా!

శ్రవణ మననాలు చాలా ముఖ్యం. గురువు మాటలను శ్రవణం చెయ్యాలి. తర్వాత ఆ వాక్యాన్ని మనసులో చెప్పుకోవాలి. ఆ వాక్యం ఎవరు చెప్పారో వారి దయ ఉండాలి. మనం భగవద్గీత రోజూ చదవొచ్చు. అందులో ఉన్న లోతైన విషయాలు అన్నీ ఒక్కసారిగా తెలియవు. మామూలుగా చదివినప్పుడు అవి ఒకోసారి స్ఫురించకపోవచ్చు. శ్రవణ మననాలు చెయ్యగా చెయ్యగా గురువు చెప్పింది, శాస్త్రం చెప్పింది నీకు బోధపడుతుంది.

మనం పూజగదిలోనే దేవుడికి పరిమితమై ఉంటాం. బయటికి వచ్చాక దేవుడితో సంబంధం లేకుండా ఉంటాం. అలా భౌతికం, ఆధ్యాత్మికం అని రమణమహర్షిగారు విడదీయరు.

నువ్వు ఎవరికైనా ఏదైనా సహాయం చేస్తున్నా, దేవుడికి చేస్తున్నావనే తెలుసుకోవాలి. నీ పని నువ్వు చేస్తున్నప్పుడు కూడా అది నీ సొంతం అనుకోకుండా దేవుడు నీకు పురమాయించిన పనినే నువ్వు చేస్తున్నావు అని తెలుసుకోవాలి.

Everything happens in its own time. భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా నువ్వు ఆత్రుత పడినంతమాత్రాన జ్ఞానం రాదు. మామిడికాయ సరైన సమయానికి అంటే పక్వానికి వచ్చినపుడు మగ్గేస్తే ఫరవాలేదు, ఈ లోపు కంగారుపడి మగ్గేస్తే ముగ్గదు కదా, కుళ్ళిపోతుంది. భౌతికమైన విషయాలైనా, ఆధ్యాత్మికమైన విషయాలైనా అంతే. నీ చేతిలో ఉన్న పని నువ్వు చేస్తూ జ్ఞానానికి కూడా కంగారు పడకూడదు. నీకెప్పుడు తెలియబడాలో ఆ సద్వస్తువు నిర్ణయించు కుంటుంది. మనకు రేపు మరణం రావాలని ఉంటే రేపే వస్తుందిగాని ఇవాళ రాదు కదా!

భౌతికమైన సంఘటనలు అయినా, ఆధ్యాత్మికమైన అనుభవాలు అయినా ఏవి ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలో అలా జరుగుతాయి.

ఇక్కడ రహస్యం ఏమిటంటే నువ్వు deserve అయితే నీకు desire అక్కర్లేదు. యోగ్యత కలిగినప్పుడు కోరికతో సంబంధం లేకుండా భగవంతుడు నిన్ను అనుగ్రహిస్తాడు, నీకు యోగ్యత లేనప్పుడు కోరిక ఉన్నా అది నీకు లభించదు అనేది సూత్రం.

## (4) జ్ఞాని మాత్రమే ఉపదేశించాలి

"అసమర్థుడైన పురుషుడు (ఆత్మజ్ఞాని కానివాడు) బోధించితే ఆత్మ సవ్యంగా గ్రహించబడదు. సమర్థుడైన జ్ఞాని ఉపదేశించితే తప్ప దానికి వేరే దారి లేదు. సూక్ష్మమైన దానికంటే అది సూక్ష్మమైనది. అది తర్కానికి అతీతమైనది."

(కఠోపనిషత్ 1-2-8)

కఠోపనిషత్‌లోని ఈ సూత్రం చాలా అపురూపంగా ఉంది, చాలా అందంగా ఉంది. నీకే ఆత్మజ్ఞానం లేనపుడు ఎదుటివాడికి దాని గురించి బోధించినా ప్రయోజనం లేదు. స్కూల్లో ఎవరైనా మాస్టారు రాకపోతే డ్రిల్లు మాష్టారుని వెళ్ళి కూర్చోమంటారు, అల్లరి చెయ్యకుండా పిల్లల్ని కాపలా కాయమని. అంతవరకేగాని ఆ డ్రిల్లు మాష్టారు లెక్కలు చెబితే ఎలా ఉంటుందో, నీకు జ్ఞానం లేకుండా ఇంకొకరికి చెప్పినా అలాగే ఉంటుంది.

ఈ మంత్రం చాలా బాగుంది. జ్ఞానం గురించి చెప్పేవాడికి అనుభవం ఉండాలి. అనుభవం లేనివాడు బోధించినా అది సవ్యంగా గ్రహించబడదు, అంటే ప్రయోజనం ఉండదు. అసలు నీకే దారి తెలియనప్పుడు, ఇంకొకరికి దారి ఎలా చూపిస్తావు? గుడ్డివాడు మరో గుడ్డివాడికి దారి ఎలా చూపిస్తాడు? బ్రహ్మము గురించి చెప్పేవాడు బ్రహ్మమై ఉండాలి.

స్థూలమైన విషయాన్ని గ్రహించినట్టు సూక్ష్మమైన విషయాన్ని మన బుద్ధి గ్రహించలేదు. అది తర్కానికి అతీతమైనది. తర్కానికి అతీతమైనది అంటే తర్కం నేర్చుకోవద్దని కాదు. బుద్ధి నీకు ఎంతవరకు సహాయం చేయగలదో అంతవరకు దాని సహాయం తీసుకొని, ఆ తరువాత విశ్వాసం మీద ఆధారపడాలి. ముందే విశ్వాసం అక్కర్లేదు. నీ బుద్ధి ఎంత దూరం తీసుకువెళితే, అంత దూరం వరకు దాని సహాయం తీసుకోవడం మంచిది.

ఆత్మానుభవం కలిగినవాడు ఆత్మగురించి చెబితే అది నీకు హత్తుకుంటుంది, లేకపోతే హత్తుకోదు. జ్ఞాని నాలుక హృదయంలో ఉంటుంది. అతడు ఏం మాట్లాడినా హృదయంలోంచే వస్తుంది. జ్ఞాని కానివాడు జ్ఞానం గురించి చెప్పినా ప్రయోజనం లేదు.

జ్ఞాని శాంతిస్వరూపం, ప్రేమస్వరూపం మరియు జ్ఞానస్వరూపం. అందుచేత అతడు ఏది చెప్పినా ప్రేమతోనే చెబుతాడు. ఆ ప్రేమ నీకు దారి చూపిస్తుంది. అతడు దేనిగురించి చెబుతున్నాడో అది అయి చెప్పాలి. అంటే బ్రహ్మముగురించి చెప్పేవాడు బ్రహ్మమై చెప్పాలి. అప్పుడు అది మనకు అనుభవంలోకి వస్తుంది. లేకపోతే రాదు. ఇది final. ఉపనిషత్తులో చెప్పింది supreme court full bench judgement లాంటిది, ఇక దానికి appeal లేదు. అది ultimate అన్నమాట.

శ్రీశంకరాచార్యులవారికి అనుభవం ఉంది, శాస్త్రజ్ఞానం ఉంది, దాని గురించి చెప్పగల నేర్పు ఉంది, మానవజాతి మీద ప్రేమ ఉంది. ఒకే వ్యక్తిలో ఇవన్నీ కలవడం వల్ల ఆయన మహాత్ముడు అయ్యాడు.

జ్ఞాని చెబుతుంటే వినేవాడికి వివేకం, విద్య వచ్చేస్తాయి. గురువుతో నీకు అనుబంధం కలిగిన తరువాత ఆ జ్ఞానం నీకు తప్పకుండా కలుగుతుంది.

***

## మననం చేయదగిన వాక్యాలు

(1) భగవంతుడిని వివేకవంతమైన బుద్ధిని ఇవ్వమని ప్రార్థించాలి. అలా ప్రార్థిస్తే, జ్ఞానం కలిగే బుద్ధిని భగవంతుడు ప్రసాదిస్తాడు.

(2) ఆత్మసుఖం ఒక్కటే నిజం. విషయసుఖాలన్నీ మిథ్య. బాహ్యమైన విషయసుఖాలు ఏవి అనుభవించినా, అవన్నీ క్రమేపి దుఃఖంగా మారిపోతాయి.

(3) భౌతికమైన సంఘటనలు అయినా, ఆధ్యాత్మికమైన అనుభవాలు అయినా ఏవి ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలో అలా జరుగుతాయి.

(4) యోగ్యత కలిగినప్పుడు కోరికతో సంబంధం లేకుండా భగవంతుడు నిన్ను అనుగ్రహిస్తాడు. నీకు యోగ్యత లేనప్పుడు కోరిక ఉన్నా అది నీకు లభించదు.

(5) బుద్ధి నీకు ఎంతవరకు సహాయం చేయగలదో, అంతవరకు దాని సహాయం తీసుకొని, ఆ తరువాత విశ్వాసం మీద ఆధారపడాలి.

(6) ఆత్మానుభవం కలిగినవాడు ఆత్మగురించి చెబితే, అది నీకు హత్తుకుంటుంది. లేకపోతే హత్తుకోదు.

(7) జ్ఞాని ఏది చెప్పినా ప్రేమతోనే చెబుతాడు. ఆ ప్రేమ నీకుదారి చూపిస్తుంది.

✷✷✷

# 9. నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి

కొత్తగూడెం,
04-05-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు.

**ఉద్ధరేదాత్మనాత్మానం మగ్నం సంసారవారిధౌ !**
**యోగారూఢత్వమాసాద్య సమ్యగ్దర్శన నిష్ఠయా !!**

**సమ్యక్ దర్శనంలో నిష్ఠచేత యోగారూఢత్వం పొంది సంసారసముద్రంలో మునిగియున్న తనను తనచేతనే ఉద్ధరించుకోవాలి.** (వివేకచూడామణి - 9)

**ఎప్పుడు ఇంద్రియ విషయాలలోను, కర్మలలోను, ఆసక్తి లేకుండా, సమస్త సంకల్పాలను విడిచిపెడతాడో, అప్పుడు ఆ వ్యక్తి యోగారూఢుడు అని చెప్పబడుతున్నాడు.** (భగవద్గీత 6-4)

**తన్ను తానే ఉద్ధరించుకోవాలి. తన్ను తాను క్రిందికి త్రోసుకోకూడదు. (ఎందుకనగా ఇంద్రియాలు, మనస్సును జయిస్తే) తనకు తానే బంధువు, (జయించకపోతే) తనకు తానే శత్రువు.** (భగవద్గీత 6-5)

ఈ సందర్భంలో శ్రీకృష్ణ భగవానుడు, ఆచార్యులవారు చెప్పిన యోగారూఢత్వమును పొందడానికి మేము ఎలా సాధన చేయాలి అన్నది దయచేసి వివరించ ప్రార్థన.

## శ్రీనాన్నగారు:

## (1) సమ్యక్ దర్శనం

ముందుగా సాధకులకు సమ్యక్ దర్శనం ఏమిటి అనేది అవగాహనకు రావాలి.

**1. సమ్యక్ దర్శనం పొందినవాడికి, ప్రపంచానికి ఏది ఆధారంగా ఉన్నదో, అదే ప్రపంచంలాగా కనబడుతున్నట్లు తెలుస్తుంది.**

దీని గురించి ఉదాహరణ చెబుతాను. మనం ఏదైనా బంగారపు గొలుసు చూస్తే; గొలుసు, అందులో ఉన్న నగిషీలు అన్నీ చూస్తాం. అదే గొలుసును కంసాలి దగ్గరికి తీసుకువెళితే అతను ఆ గొలుసు ఆకారం, నగిషీలు చూడడు, అందులో ఎంత బంగారం ఉంది అనే విషయాన్ని మాత్రమే చూస్తాడు. గొలుసుకు ఆధారం బంగారం. ఆ బంగారంలోనే ఈ గొలుసు కల్పించారు. అంటే నామరూపాలు కల్పించారు.

బంగారంలో ఆభరణాలు అనే నామరూపాలు ఎలా కల్పించబడ్డాయో, అలాగే బ్రహ్మములో ఈ విశ్వం, అనంతకోటి జీవరాశి అనే నామరూపాలు కల్పించబడ్డాయి.

విష్ణు సహస్రనామంలో మొదటి నామం విశ్వం. అంటే విష్ణువు విశ్వం రూపంలో కనపడుతున్నాడు అని వ్యాసమహర్షి చెప్పారు. సమ్యక్ దర్శనం అంటే విశ్వాన్ని విశ్వంగా కాకుండా విష్ణువుగా ఎవరు చూస్తారో వారు సమ్యక్ దర్శకులు.

**2. సమ్యక్ దర్శనం అంటే ఉన్నది ఉన్నట్టుగా దర్శించడం. ఉన్నది ఉన్నట్టుగా దర్శించేవరకు లేనిది ఉన్నట్టుగా కనపడుతుంది.**

ఈ విషయంలో శంకరాచార్యులవారు ఉదాహరణలు ఎక్కువ చెప్పేవారు. తాడును చూసి పాము అనుకున్నావు, ఉన్న వస్తువు ఉన్నట్టుగా కనపడితే అప్పుడు తాడు కనిపిస్తుంది గానీ పాము కనపడదు. మరి పాము ఏమయ్యింది? పాము వాస్తవానికి ఎన్నడూ లేదు!

అలాగే, నువ్వు అజ్ఞాన దశలో ప్రపంచాన్ని చూస్తున్నావు. జ్ఞానం వచ్చాక ప్రపంచం ఏమైపోతుంది? బ్రహ్మములో ఐక్యం అవుతుంది. అంటే తనలో ఐక్యం అవుతుంది. ఎప్పుడైతే ప్రపంచం తనలో ఐక్యం అయిపోతుందో, అప్పుడు ప్రపంచం భిన్నంగా కనపడదు. అప్పుడు అతడు Universal (విష్ణువు) అవుతాడు. Individual I ఉన్నంతకాలం అతడు జీవుడిగానే (సాధారణమనిషిగానే) వుంటాడు!

కృష్ణుడు నన్ను తెలుసుకో, నన్ను తెలుసుకో అని చాలాసార్లు అన్నాడు. 'నన్ను' అంటే దేహం కాదు, మనస్సూ కాదు; అక్కడ 'నన్ను' అంటే ఆయనలోని ఆత్మతత్త్వం (విష్ణువు) అని అర్థం.

ఎవరైతే సమ్యక్‌జీవనం (universal life) పొందారో వారికి రావడం, పోవడం ఇక ఉండదు. వారికి అదే కడసారి జన్మ అవుతుంది.

### 3. **ఉన్నది ఉన్నట్టుగా కనిపించక, లేనిది ఉన్నట్టుగా కనిపిస్తూనే ఉంటుంది. అది మాయ.**

మన మనస్సు సత్వరజస్తమో గుణాలు కలిగి ఉంది. రజోగుణం, తమోగుణం ప్రధానంగా కలిగినవాడు మాయ ప్రభావంలో ఉంటాడు. సత్వగుణం పెరిగేకొలది మాయ ప్రభావం తగ్గుతుంది. శుద్ధసత్త్వంలో ఉన్నవాడు జీవన్ముక్తుడు.

### 4. **మనం పాడైపోవడానికి కారణం ఏమిటంటే సమ్యక్ దర్శనం లేకపోవడమే.**

మనకు విశ్వం విష్ణువుగా కనపడకపోవడానికి కారణం రాగద్వేషాలే. బుద్ధుడు చెప్పినట్టుగా ప్రపంచంలో ఎక్కడా, ఏమీ లేదు. ఏదో ఉన్నదని తిరుగుతున్నాం. ఎక్కడా ఏమీ లేదు. ఏ దేశం వెళ్ళి చూసినా, ఎవరింటికి వెళ్ళి చూసినా రాగద్వేషాలు తప్ప లోకంలో ఏమీ లేవు.

క్యాన్సర్‌తో బాధపడేవాడికి ఆ క్యాన్సర్ తగ్గిపోతే ఎలా ఉంటుందో, మనసులోనుండి రాగద్వేషాలు పోతే అలా ఉంటుంది. రాగద్వేషాలతో మనస్సు బహిర్ముఖం అవుతోంది. రాగద్వేషాలు పోయినప్పుడు జీవుడు అంతర్ముఖుడై సమ్యక్ దర్శనం చేయగలడు.

**5. లోపల పవిత్రత లేనప్పుడు సమ్యక్ దర్శనం సాధ్యపడదు. రామకృష్ణ పరమహంసకు మనకూ తేడా పవిత్రతే!**

పురాణల్లో హరేరామ, హరేకృష్ణ అనుకోండి అని ఎందుకు చెబుతారంటే, ఆ నామాలు చెబుతున్నప్పుడైనా పాపాలకు దూరంగా ఉంటావు అని. అంటే, అనవసరమైన విషయాల్లోకి వెళ్ళకుండా దూరంగా ఉండడం కోసం అలా చెప్పారు. నూటికి నూరు శాతం పవిత్రత ఉంటేనే గానీ ఆత్మజ్ఞానం రాదు.

సూదిలో దారం ఎక్కిస్తాం, ఆ దారంలో ఒక్క పోగు విడిపోయినా, ఆ బెజ్జంలోకి ఆ దారం ఎక్కదు. అలాగే ఒక్క శాతం పవిత్రత లేకపోయినా ఆత్మజ్ఞానం రాదు.

## (2) యోగారూఢత్వం

సమ్యక్ దర్శనం గురించి అవగాహన చేసికొని సాధకుడు యోగారూఢత్వం పొందడానికి ప్రయత్నం చేయాలి.

కృష్ణభగవానుడు ఇంద్రియ విషయాలలో, కర్మలలో ఆసక్తి లేకుండా, అన్ని సంకల్పాలను విడిచిపెట్టినవాడు యోగారూఢుడు అని చెప్పాడు. అటువంటి యోగారూఢత్వం పొంది మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి.

మనస్సు ప్రతి నిమిషం ఏదో ఒకటి చింతించకుండా ఉండదు. నువ్వు ఆత్మచింతన లేదా దైవచింతన చేయని సమయమంతా విషయచింతన చేస్తున్నావని అర్థం.

కర్మలయందు ఆసక్తి లేకుండా అంటే కర్మఫలం మీద ఆసక్తి లేకుండా కర్మలు చేయమని అర్థం.

మనస్సు ఏదో ఒకటి చింతించకుండా ఎలా ఉండదో, అలాగే దేహం ఉన్నంతవరకు ఏదో ఒక కర్మ చేయకుండా ఉండదు. నువ్వు గాలి పీల్చుకుంటున్నావు. అన్నం తింటున్నావు. కాలకృత్యాలు తీర్చుకుంటున్నావు. ఇవన్నీ కర్మలే కదా! అందుకే కర్మ మానేయమని చెప్పలేదు. కర్మఫలం మీద ఆసక్తి వద్దని అన్నారు.

అంటే దేహానికి ప్రారబ్ధం ఉంటుంది కదా, ఆ ప్రారబ్ధం ఏదో ఒక కర్మ చేయిస్తూ ఉంటుంది. ఆ చేయాల్సిన కర్మలు ఆసక్తి లేకుండా చేయి. అంటే, ఫలితంమీద ఆశ లేకుండా చేయి అని అర్థం. ఫలితంమీద కోరిక ఉంటే ఆ ఫలితం రానప్పుడు ఆశాభంగం అవుతుంది. ఆశించడం వల్ల ఎక్కువ రాదు, ఆశించకపోవడం వల్ల తక్కువ రాదు. కానీ మనలో బలహీనత ఏమిటంటే ఆశిస్తే ఎక్కువ వస్తుంది అనుకుంటాం.

ప్రపంచంలో ఎంతో సంపద ఉంది, అదంతా నీ చేతిలో ఉందా? నీ కోటా ఎంతో, అంతే వస్తుంది. పంచదారకోటా లాగా, నీ ప్రారబ్ధాన్ని బట్టి నీకు ఎంత సంపద రావాలో అంతే వస్తుంది. అలాగే సంపద పోయేటప్పుడు ఎలా పోతుందో తెలియదు. వచ్చేటప్పుడు ఎలా వస్తుందో తెలియదు.

ఇంద్రియ విషయాలలో, కర్మలలో ఆసక్తి లేకుండా అన్ని సంకల్పాలను విడిచిపెట్టమని అన్నారు.

జ్ఞాని 'no mind state' లో ఉంటాడు. అతడికి సంకల్పం అంటూ ఏమీ ఉండదు. ఏ సమయానికి ఏ పని చేయవలసి వుంటే ఆ పనికి అనుకూలంగా ఆ దేహం నడచుకుంటుంది. రాముడు జటాయువుని పుణ్య లోకాలకు వెళతావు అన్నాడు. అంతే, ఆ మాట నిజమైపోయింది.

రమణమహర్షి చూపుతోనే అనుగ్రహించే వారు. రామకృష్ణ పరమహంస స్పర్శతో అనుగ్రహంచేవారు. లోపల జ్ఞానం ఒక్కటే, కాని వాళ్ళ స్వభావాన్ని బట్టి వారు అనుగ్రహించేవారు. ఒకరిది చూపు, మరొకరిది స్పర్శ. మొత్తం మీద ఏ విధంగానైనా వారి అనుగ్రహమే మనకి లభిస్తుంది.

## (3) ఉద్ధరించుకోవడం

సమ్యక్ దర్శనం, యోగారూఢత్వం గురించి చెప్పిన తరువాత నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి అని చెప్పారు.

1. **దేనికోసమూ ఎదురు చూడకుండా నీ ప్రయత్నం నువ్వు చేయాలి. దీనికి ఒక సామెత ఉంది.** Not comfort, but control is happiness.

మనం మేడలో సౌకర్యంగా ఉన్నా, మన మనస్సు నియంత్రణలో లేకపోతే దుఃఖంగా ఉంటాం. దేహం సోఫాలో కూర్చొని, పైన ఏసి గదిలో సౌకర్యవంతంగా ఉన్నా మనస్సులో బాధ ఉంటే దుఃఖాన్ని ఆపు చేయలేము. అంటే నువ్వు ఎంత సౌకర్యవంతంగా ఉన్నా, నీ మనస్సు నీ నియంత్రణలో లేకపోతే నీకు శాంతి లేదు, సంతోషం లేదు.

తనను తానే ఉద్ధరించుకోవాలి అంటే నీ మనస్సును నీవే బాగుచేసుకోమని అర్థం.

మీ నాన్నగారు నీకో లక్ష రూపాయలు ఇవ్వగలరు. కానీ నీ మనస్సును బాగుచేసి పెట్టలేరు. ఇతరులు వచ్చి నీ మనస్సుని బాగుచేయలేరు. నీ మనస్సుని నువ్వే బాగుచేసుకోవాలి.

2. **ఇతరులు సలహాల వరకే ఇవ్వగలరు. నీ మనస్సుని నువ్వే బాగు చేసుకోవాలి.**

బుద్ధుడు ఎవరో ఒక దేవుడు వచ్చి మనకు సహాయం చేస్తాడని ఎదురు చూడవద్దని అన్నాడు. ఓడిపోతే ఎవరికోసం ఎదురు చూడకుండా మరల ప్రయత్నం చెయ్యమని చెప్పాడు.

మనస్సు పాడైపోతే, తరువాత నీకెన్ని సంపదలున్నా ప్రయోజనం లేదు. అంటే నీ మనస్సు పతనం అవకుండా నువ్వు చూసుకోవాలి. విషయచింతన ఎవరికైతే విషంలాగా కనిపిస్తుందో వాని మనస్సు పతనం అవ్వదు.

నీ మనస్సు నీ స్వాధీనంలో ఉంటే, వెయ్యి మంది శత్రువులు కూడా నిన్ను ఏమీ చేయలేరు. నీ మనస్సు నీకు స్వాధీనంలో లేకపోతే, వెయ్యిమంది మిత్రులు నీకు సహాయం చేద్దామన్నా చెయ్యలేరు. కనుక **నీ మనస్సు నీ స్వాధీనంలో ఉంటే నీకు నువ్వే బంధువు, లేకుంటే నీకు నువ్వే శత్రువు అవుతావు.**

## (4) సాధన

1. **యోగారూఢుడు అవడానికి నిరంతరం దైవచింతన అవసరం.**

సత్ గ్రంథాలు అధ్యయనం చెయ్యడంద్వారా లేదా మహాత్ములు సాంగత్యంద్వారా లేదా దైవధ్యానంద్వారా, ఎల్లవేళలా ఈశ్వరుడిని స్మరించుకుంటూ ఉండాలి. అలా ఎల్లప్పుడూ దైవస్మరణలో ఉండడంవల్ల పవిత్రులు అవుతారు. ఆ పవిత్రతతో సత్యవస్తువుకి సంబంధించిన విషయాలు చక్కగా అవగాహనకు వస్తాయి. ఆ రకంగా సాధకుడు యోగారూఢుడు అవుతాడు.

2. **ఆత్మానుభవానికి అడ్డు వచ్చే వాటన్నింటిని దూరంగా ఉంచడానికి సాధకుడు ప్రయత్నం చేయాలి.**

3. రామకృష్ణ పరమహంస చెప్పారు: మీ ఇంటికి అలవాటుపడి ఒక కుక్క వస్తే, ఆ కుక్కను వచ్చినప్పుడల్లా పట్టించుకోకుండా వుంటే అదే రావడం మానేస్తుంది. అలాగే అక్కరలేని తలంపును కూడా పట్టించుకోకుండా వదిలేస్తే కొంత కాలానికి అదే పోతుంది. **తలంపులను ఎంత ఇష్టంగా తెచ్చుకున్నావో, అంత నిర్లిప్తతతో ఓపికగా ప్రయత్నం చేస్తే కొంత కాలం తరువాత ఆ తలంపులు అవే పోతాయి. ఇదే సాధన!**

## మననం చేయదగిన వాక్యాలు

(1) ఇతరులు వచ్చి నీ మనస్సుని బాగు చేయలేరు, నీ మనస్సును నీవే బాగు చేసుకోవాలి.

(2) సమ్యక్ దర్శనం అంటే ఉన్నది ఉన్నట్టుగా దర్శించడం.

(3) రాగద్వేషాలు పోయినప్పుడు జీవుడు అంతర్ముఖుడై సమ్యక్ దర్శనం చేయగలడు.

(4) నూటికి నూరుశాతం పవిత్రత ఉంటేనేగానీ ఆత్మజ్ఞానం రాదు.

(5) నువ్వు ఆత్మచింతన చేయని సమయమంతా విషయచింతన చేస్తున్నావని అర్థం.

(6) కర్మఫలం మీద ఆసక్తి లేకుండా కర్మలు చేయాలి.

(7) ఇంద్రియ విషయాలలో, కర్మలలో ఆసక్తి లేకుండా అన్ని సంకల్పాలను విడిచిపెట్టినవాడు యోగారూఢుడు. అటువంటి యోగరూఢత్వం పొంది మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి.

(8) తలంపులను ఎంత ఇష్టంగా తెచ్చుకున్నావో అంతే నిర్లిప్తతతో ఓపికగా ప్రయత్నం చేస్తే కొంతకాలం తరువాత ఆ తలంపులు అవే పోతాయి.

✸✸✸

# 10. హితోపదేశంతో సమ్యక్ విచారణ

కొత్తగూడెం,
05-05-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు ఇలా అన్నారు:

**"నిష్కామకర్మ చిత్తశుద్ధి కొరకు మాత్రమే ఉపయోగపడుతుంది కానీ సద్వస్తువు పొందడానికి కాదు. ఆత్మజ్ఞానం విచారణ చేయడంతోనే కలుగుతుంది. కోటికర్మలు చేసినా, ఏమీ ప్రయోజనం లేదు."** (వివేకచూడామణి - 11)

**"భ్రాంతిచేత పుట్టిన మహాసర్పమనే భయంవలన కలిగిన దుఃఖమును నశింపచేయు త్రాడుయొక్క యథార్థస్వరూప నిశ్చయం సమ్యక్ విచారణ (బాగుగా విచారణ) చేయడంవలన మాత్రమే కలుగుతుంది."** (వివేకచూడామణి - 12)

**"సద్వస్తువుయొక్క నిశ్చయం హితులైన వారి ఉపదేశం వలన కలుగు విచారణచేత చూడబడింది. పవిత్ర తీర్థాలలో స్నానంచేత కాదు, దానంచేతగాని, వంద ప్రాణాయామాల చేతగాని కాదు."** (వివేకచూడామణి-13)

ఈ సందర్భంలో విచారణమార్గం గురించి మాకు వివరించవలసిందిగా విన్నపం.

**శ్రీనాన్నగారు:**

హితోపదేశమును పొంది ఆత్మజ్ఞానం పొందడానికి ఉన్న వివిధ మార్గాలను సమన్వయం చేసికొని సమ్యక్ జ్ఞానమును విచారణద్వారా పొందాలి.

## (1) సమన్వయం

**1. ఆత్మానుభవం పొందడానికి భగవద్గీతలో చెప్పబడిన భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం, ధ్యానమార్గం - ఇవన్నీ వేరు వేరు కావని, అవినాభావ సంబంధం కలిగినవని గ్రహించి వాటిని సమన్వయం చేసుకుంటూ ఆత్మానుభూతికోసం ప్రయత్నం చేయాలి.**

ఈ మార్గాలన్నీ ఒకదానికి ఒకటి సంబంధం కలవని మనం గ్రహించాలి. అవి పరస్పర విరోధాలు కావు.

నువ్వు నాపై పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉంటే, నాకిష్టమైన విధంగా పనులు చేస్తూ ఉంటే, నీకు సద్బుద్ధిని నేను ఇస్తాను అని శ్రీకృష్ణుడు చెప్పాడు. అంటే, జ్ఞానం కలగడానికి కావాల్సిన బుద్ధికి ధ్యాన, భక్తి, నిష్కామ కర్మలు ఉపయోగపడుతున్నాయి.

నిష్కామకర్మ అంటే కర్మలు చేసేటప్పుడు "ఫలితం మీద ఆశ లేకుండా" మరియు "నేను ఈ కర్మ చేస్తున్నాను" అనే భావన లేకుండా చేయాలి. ఇందులో "ఫలితం మీద ఆశ లేకుండా చేయడం" అనేది జ్ఞానం. అలాగే "నేను ఈ కర్మను చేయడం లేదు" అంటే ఈశ్వరుడే చేయిస్తున్నాడు అనే భావన ఉంది. అదే భక్తి. ఈ విధంగా భక్తి, జ్ఞానం కలిపి కర్మ చేస్తే అది కర్మయోగం అవుతుంది! ఇక్కడ భక్తి, జ్ఞానం రెండూ కలిసి కర్మతో సమన్వయం అవుతున్నాయి.

స్వస్వరూపం యొక్క ధ్యానమే భక్తి, అది మోక్షం పొందడానికి కావల్సిన సామాగ్రిలో ముఖ్యమైనదని శంకరులు చెప్పారు. కానీ ఆ స్వస్వరూపం మీద అంటే ఆ బ్రహ్మము మీద ప్రేమ లేకుండా ధ్యానం ఎలా చేస్తావు? అందుచేత భక్తి, ధ్యాన మార్గాల మధ్య అవినాభావ సంబంధం ఉంది.

భక్తికి పరాకాష్ఠ శరణాగతి. శరణాగతి ఒకేసారి సాధ్యం కాదు. విచారణమార్గంలో వచ్చిన వివేకం పాక్షిక శరణాగతికి ప్రారంభదశలో ఉపయోగపడుతుంది. తరువాత క్రమంగా సంపూర్ణ శరణాగతి వస్తుంది! ఈ విధంగా జ్ఞాన (విచారణ) మార్గం మరియు భక్తి మార్గం సంబంధం కలిగి ఉన్నాయి.

ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈశ్వరుడనే వాడు ఒకడున్నాడు. ఆయన ఈ సృష్టికి ప్రభువు అనేటటువంటి విశ్వాసం నూటికి నూరు శాతం కలిగి ఉండాలి. నీ బుద్ధి కుశలత మార్గంలో కొంతదూరమే నిన్ను తీసుకెళ్తుంది. ఆ తరువాత నీ ఆత్మవిశ్వాసం మీద ఆధారపడవలసిందే అని చెబుతారు.

భక్తికి జ్ఞానం విరోధం కాదు. జ్ఞానానికి భక్తి విరోధం కాదు. భక్తి లేకుండా జ్ఞానం ఎలా కలుగుతుంది? అందుచేత కృష్ణుడు వివిధ మార్గాలన్నిటినీ సమన్వయం చేసుకుంటూ ఆత్మానుభూతి కోసం ప్రయత్నం చేయమన్నాడు.

**2. జ్ఞానులు వారి ప్రవృత్తిని బట్టి ఒకో మార్గాన్ని నొక్కి చెబుతారు. నీకు తగిన మార్గంలో నువ్వు వెళుతూ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నించాలి.**

రమణమహర్షిగారు జ్ఞానానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చినట్లు కనిపిస్తుంది. కానీ ఆయన కూడా అక్షరమణమాల ద్వారా భక్తి గురించి చెప్పారు.

శంకరులు కూడా జ్ఞానానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినట్లు మనకు కనిపించినా భక్తిమార్గాన్ని ఎన్నడూ వీడలేదు. అందుకే శంకరులు అవతారమూర్తులమీద అద్భుతమైన స్తోత్రాలు వ్రాశారు. రాముడి రూపం, గుణాలను వర్ణించారు. రామరాజ్యంలో ఎవరింట్లోనైనా పెళ్ళి అవుతోంది అంటే రాముడు ఏదో ఒకటి పంపేవాడు. ఆయనకున్న దాతృత్వాన్ని, మంచితనాన్ని శంకరులు వర్ణించారు. ఎందుకు? నీకు రాముని మీద ప్రేమ కలగటానికి, రాముని మీద ప్రేమ లేకుండా ఆయనని ఎలా ధ్యానం చేస్తావు? అందుచేత ఉపాసన, ధ్యానం పరస్పరం విరుద్ధం కాదు. వాటి మధ్య అవినాభావ సంబంధం ఉంది.

ఆ సద్వస్తువు nameless, formless, actionless. నీకేమో రూపం ఉంది, నామం ఉంది. నువ్వు రూపనామాలతో తాదాత్మ్యం పెట్టుకొని, రూపనామాలు లేనిదాన్ని ఉపాసన చేయలేవు. అందుచేత ఆ భగవంతుడే గురువుగా వ్యక్తం అవుతున్నాడు. అందుచేత నువ్వు రాముడిని ఉపాసన చేస్తే నీకు తెలియకపోయినా, రాముడికి సత్యం తెలుసు కదా, నిన్ను అక్కడికి తీసుకుపోతాడు.

కొంతమంది భగవంతుడు ఉన్నాడంటే పూర్తిగా నమ్ముతారు. అలాంటి విశ్వాసపాత్రులకు Self surrender (శరణాగతి) మంచిది. మరి కొంతమంది భగవంతుడు ఉన్నాడా, లేదా అని అనుమానిస్తారు. అలా అనుమానించేవారికి విచారణా మార్గం మంచిది.

"మోక్షం పొందటానికి కొంత సామాగ్రి కావాలి. ఆ సామాగ్రిలో ముఖ్యమైనది భక్తి. స్వస్వరూపం యొక్క ధ్యానమే భక్తి" అని శంకరులు చెప్పారు కదా! (శ్రీవివేకచూడామణి–32).

వివిధమార్గాలకు సంబంధించిన విషయాలను సరిగ్గా అవగాహన చేసుకోగలిగితే అవి ఒకదానికొకటి సహకరించుకుంటాయని తెలిసి ఆ మార్గాలను సమన్వయం చేసుకొని లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు.

## (2) హితోపదేశం

### 1. జ్ఞానియే నిన్ను నిజంగా ప్రేమించగలడు. అతడే నీకు హితుడు.

మనుష్యత్వం, ముముక్షత్వం ఈ రెండూ సరిపోవు. మహాపురుష సంశ్రయః అని శంకరులు అన్నారు. సాధకుడు జ్ఞానం కలిగిన మహాత్మ్ముణ్ణి ఆశ్రయించాలి. జ్ఞాని ప్రేమస్వరూపం. అతడే సాధకునికి నిజమైన హితుడు కాగలడు.

ఎవరో కొద్దిమంది తప్ప, చాలామంది భార్యాభర్తల మధ్య ఉన్నది నిజమైన ప్రేమ కాదు. వారి మధ్య సంబంధం నిలబడడానికి ప్రేమ కాదు, కామం కారణం. అసలు ఇంద్రియాలకి సంబంధించిన భోగాలతో నీకు అవసరం లేకపోతే నీకు ప్రపంచంతోటి పని ఏముంది? ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే, **జ్ఞాని మాత్రమే నీనుంచి ఏమీ ఆశించకుండా, నిన్ను నిజంగా ప్రేమించగలడు. అతడే నీకు హితుడు.**

2. **అటువంటి హితుడు ఉపదేశించినప్పుడే నీలో సమ్యక్ విచారణ అంటే సమగ్రవిచారణ ఉదయిస్తుంది.** అందుకే సత్సంగం అవసరం అని చెబుతారు.

ఇప్పుడు మీ అమ్మగారింట జున్ను ఉందనుకో. మీ అమ్మగారికి వెంటనే నువ్వు జ్ఞాపకం వస్తావు. నువ్వు ఉండి ఉంటే జున్ను తినేదానివి కదా అనిపిస్తుంది ఆవిడకి. తల్లి ప్రేమ లోకప్రేమలలో మిన్న. అటువంటి తల్లి ప్రేమకన్నా నీ ప్రేమ ఎక్కువని అరుణాచలేశ్వరుడిని ఉద్దేశించి రమణులు అన్నారు. అటువంటి ప్రేమ లేకుండా, నీకు బోధ చేసినా లాభం లేదు. అటువంటి ఆచార్యులు నీకు దొరకడం నీ పూర్వపుణ్యాన్ని బట్టి ఉంటుంది.

నిజంగా నీ క్షేమం కోరేవాళ్ళు చెప్పినప్పుడే నీకా దృక్పథం వస్తుంది, అప్పుడే నిజమైన విచారణ నీలో ఉదయిస్తుంది. ఆ విచారణవలన మాత్రమే నువ్వు సద్వస్తువును దర్శించగలవు.

నీకు కష్టం వచ్చినప్పుడు మీ అమ్మగారు చాలా బాధపడతారు. నీకంటే ఎక్కువ బాధపడతారు. హితుడైన ఆచార్యులవారికి అమ్మకంటే ఎక్కువ బాధ ఉంటుంది.

శంకరాచార్యులవారు తాము పొందిన ఆత్మానుభవం మనం కూడా పొందాలని కాంక్షిస్తున్నారు. ఎందుకంటే ఆయన మనందరి హితుడు కాబట్టి. ఎన్నో ప్రకరణ గ్రంథాలు, భాష్య గ్రంథాలు, స్తోత్రాలు వ్రాసారు. అప్పట్లో రైళ్లు, విమానాలు లేకపోయినా దేశమంతా కాలినడకన మూడుసార్లు తిరిగి బోధ చేసారు. ఎంత కష్టపడ్డారు? అందుకు ఆయనకు వచ్చే లాభం ఏమీ లేదు కదా! లోకక్షేమం కోసం తపించి అవన్నీ చేశారు.

శంకరాచార్యులవారు ఎంతో అద్భుతంగా చెప్పారు కదా! కేవలం శాస్త్ర పాండిత్యం ఉండి ఆత్మానుభవం లేనివాడు అలా చెప్పలేడు. జ్ఞానులకి వీళ్ళు నా వాళ్ళు, పరాయివాళ్ళు అని ఉండదు. వారు మొత్తం సృష్టిని తమదిగా భావిస్తారు.

శంకరులవారికి ఉన్నంత మేధస్సు లేకపోయినా బుద్ధుడికి అంత కీర్తి ఉంది. బుద్ధుడికి ఉన్న ప్రేమవల్ల అంత కీర్తి వచ్చింది. ఆయనకి మనుషులమీద ఎంత ప్రేమో జంతువులు, చెట్లుచేమలమీద కూడా అంత ప్రేమ. అసలా బుద్ధుడిలాంటి మహాత్ములని చూసేసరికే మనకు జ్ఞానం సంపాదించాలన్న బుద్ధి పుడుతుంది. అందుకే సత్పురుషుల సాన్నిధ్యం అవసరం అని చెబుతారు. సత్సంగం కోసం అవసరమైతే ప్రపంచపుటంచుల దాకా వెళ్లమని ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పాడు.

## (3) సమ్యక్ విచారణ

**1. సమ్యక్ దర్శనం సమగ్ర విచారణ వల్ల లభిస్తుంది కాని సత్కర్మలవల్ల కాదు.**

ఉదాహరణకు నువ్వు తాడును చూసి పాము అనుకుంటున్నావు. ఈ భ్రాంతి తొలగాలంటే విచారణలో కలిగిన జ్ఞానంవలన మాత్రమే సాధ్యపడుతుంది.

విచారణకు బుద్ధి, వివేకం రెండూ అవసరం.

సూక్ష్మాతి సూక్ష్మం అయిన ఆత్మను తెలుసుకోవడానికి సూక్ష్మబుద్ధి అవసరం. అలాగే నిత్య, అనిత్య వస్తువులను విడమరచి చూసే వివేకమూ కావాలి!

మొత్తంమీద జ్ఞానం లేకుండా నీకు ఆత్మానుభవం కలగదు అని ఆచార్యులవారు చెప్పారు.

**2. జ్ఞానమార్గంలో కొన్ని ప్రమాదాలు ఉన్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉండకూడదు.**

జ్ఞానమార్గంలో కొందరు బుద్ధికి ఎక్కువ పని చెబుతారు. దీనివల్ల బుద్ధిగత జ్ఞానమే ఆత్మజ్ఞానం అనుకొని అక్కడ ఆగిపోయే ప్రమాదం ఉంది.

జ్ఞానమార్గం కోతిమార్గమని, భక్తిమార్గాన్ని పిల్లిమార్గమని అంటారు. పిల్లికి, కోతికి తేడా ఏంటంటే పిల్లి పిల్లల్ని తన నోటితో పట్టుకుపోతుంది. పిల్లి బాధ్యత తీసుకొని పిల్లల్ని ఎక్కడికి తీసుకెళ్ళాలో అక్కడికి తీసుకెళ్ళి వస్తుంది. కోతి అలా కాదు. పిల్ల పట్టుకోవాలి తల్లిని. తల్లి కోతి ఉరుకుతూ ఉంటుంది. పిల్లకోతి ఏమైనా అజాగ్రత్తగా ఉంటే క్రింద పడిపోతుంది.

శరణాగతి చెందిన భక్తుని బాధ్యత భగవంతుడు తీసుకుంటాడు.

జ్ఞానమార్గంలో ప్రమాదం ఏమిటంటే, ఆ మార్గంలో ఉన్నవాళ్ళు తొందరగా స్వతంత్రులు అయిపోతారు. ఇంక దేవుడు ఏమిటి, నేనే దేవుడు అనుకునే ప్రమాదం ఉంది. అలాంటి ప్రమాదానికి లోనుకాకుండా హితుడైన సద్గురువు ఉపదేశాలతో సమ్యక్ విచారణ అంటే సరైన విచారణ చేయాలి.

3. "**ఉపనిషత్తుల అర్థం విచారణ చేయడంచేత ఉత్తమమైన జ్ఞానం జనిస్తుంది, దాని చేత వెంటనే నిశ్శేషంగా సంసార దుఃఖనాశనం కలుగుతుంది**" అని శ్రీశంకరులు చెప్పారు. (వివేకచూడామణి - 47)

సమ్యక్ విచారణ అంటే సరైన విచారణ అనేది దేని గురించి చేయాలి, అలా చేస్తే వచ్చే ఫలితం ఏమిటి అన్నది ఆచార్యులవారు ఇక్కడ చాలా చక్కగా చెప్పారు.

ఉపనిషత్తులలో ఉన్న వాటిని శ్లోకాలు కాదు, మంత్రాలు అంటారు. ఆ మంత్రాల అర్థాన్ని విచారణ చేయడం వలన నీకు ఆత్మజ్ఞానం లోపల నుంచి ఉదయిస్తుంది. జ్ఞానం అనేది ఎప్పుడైనా లోపలి నుండి రావాలిగాని బయటనుండి వచ్చేది కాదు. నేననే తలంపు నీకు లోపలనుంచే వస్తోంది. అలాగే జ్ఞానం కూడా ఎప్పుడైనా నీ లోపలనుండి వచ్చేదేగాని బయటనుండి వచ్చేది కాదు. విచారణ అంటే ధ్యానం చేయాలి, దేనిని ధ్యానం చేయాలి అంటే ఉపనిషత్తులలోని మంత్రాల అర్థాన్ని ధ్యానం చేయాలి. అలా చేస్తే సమస్త సంసార దుఃఖాలు నశిస్తాయి అని చెబుతున్నారు.

ఏ వస్తువుపొందితే ఇక నీకు దుఃఖం, కామం కలగవో ఆ వస్తువును నువ్వు పొందేవరకు దుఃఖం, కామం నిన్ను వెంటాడుతూనే వుంటాయి. అవి ఇవాళ అణిగి ఉండవచ్చు, రేపే రావొచ్చు. రోగం అణిగి ఉన్నా, అకస్మాత్తుగా రేపు రావచ్చు కదా! అణిగిన పాము ఎప్పటికైనా ప్రమాదమే కదా! చచ్చిపోయిన పామువల్ల ప్రమాదం లేదు.

సంసారం ఎక్కడ ఉంది? బయట లేదు, మనస్సులో ఉంది. మనస్సుకు మరో పేరు సంసారం. ఎక్కడ మనస్సు ఉంటే అక్కడ సంసారం ఉన్నట్లే. మనస్సు ఉన్నవాడు పెళ్ళి కాకపోయినా సంసారే.

సంసార దుఃఖనాశనం ఎప్పుడు కలుగుతుంది? ఆత్మజ్ఞానం కలిగిన వెంటనే సంసార దుఃఖనాశనం అవుతుంది. ఆత్మజ్ఞానం కలగడమంటే ఆత్మ తాలూకు ఎరుక కలగడం.

ఆత్మలో సుఖమేగాని దుఃఖం ఎలా ఉంటుందో తెలియదు. సూర్యుడికి చీకటి ఎలా ఉంటుందో తెలియదు. నీకు ఎప్పుడైతే ఆత్మానుభవం కలిగిందో, అప్పుడు నీకు ఆనందం ప్రాప్తిస్తుంది. ఇక అప్పుడు దుఃఖం ఉండదు. జ్ఞానికి అశాంతి ఉండదు, అజ్ఞానికి శాంతి ఉండదు. ఒక్క ఆత్మసాక్షాత్కారం పొందినవాడు మాత్రమే లోకంలో నిజమైన సుఖి. మిగతా వాళ్ళందరూ తాత్కాలికంగా సంతోషంగా ఉన్నట్లు కనపడినా వాళ్ళకి కోర్టు వాయిదా వేసినట్లు దుఃఖం వాయిదా పడుతూ ఉంటుంది.

మనకి ఇవాళ్ల దుఃఖం లేదు కదా, రేపు దుఃఖం రాదు అనుకోకూడదు. లోపల అజ్ఞానం ఉన్నంతవరకు దుఃఖం రాదు అనుకోకూడదు. దుఃఖం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. మనోనాశనం అయితే దుఃఖం లేదు. మనోనాశనం ఎప్పుడు అవుతుంది? ఆత్మదర్శనం అయ్యాక, నీకు మనోనాశనం అవుతుంది.

రమణమహర్షి "ఉన్నదాన్ని వెతకండి, లేనిదాన్ని వెతక్కండి" అని చెప్పారు. ఉన్నదానిని వెతికితే, ఇవాళ కాకపోయినా, రేపైనా దొరుకుతుంది. లేనిది మనస్సు. ఉన్నది ఆత్మ. ఆత్మ కోసం వెతికితే, ఆత్మ తెలియబడుతుంది.

ఎవరైనా మనోనిగ్రహం గురించి అడిగితే భగవాన్ ఇలా అనేవారు: "ముందు మీ శరీరంలో రోగం ఉందో లేదో చూసుకోండి. రోగం ఉంటే మందులు వాడండి. రోగం లేకపోతే మందులు అక్కర్లేదు కదా! అలాగే మీకు మనస్సు ఉందో, లేదో ముందు చూసుకోండి. మనస్సు అంటూ ఉంటే, దాన్ని నిగ్రహించుకోవడానికి ఉపాయాలు వెదుకుదురుగాని. అసలు మనస్సే లేదని మీకు తెలిస్తే, మనస్సును నిగ్రహించుకోవడానికి ఉపాయాలు అక్కర్లేదు కదా!" There is no mind to control if the Truth is realised.

దుఃఖం బయట లేదు, మనస్సులో ఉంది. ఇల్లు కాలిపోతే ఇంట్లో ఎలుకలు ఎక్కడుంటాయి? ఆ ఇంటితోపాటు ఎలుకలు కూడా కాలిపోతాయి. సంసారం అంటే మనస్సే! మనుషులు సంసారం కాదు. మనస్సే కాలిపోతే ఇంక దుఃఖం ఎక్కడ ఉంటుంది?

అసలు దుఃఖం అనేది లేదు. అది ఒక తలంపు. సంతోషం కూడా ఒక తలంపు. ఇపుడు ఇలా సుఖంగా కూర్చున్నాం. నీకు ఇష్టం లేని ఒక తలంపు వస్తే దుఃఖం వచ్చేస్తుంది. నీకు ఇష్టమైన తలంపు వస్తే సంతోషం వచ్చేస్తుంది. తలంపు లేకపోతే దుఃఖం లేదు, సంతోషం లేదు. ఇదీ అబద్ధం, అదీ అబద్ధం. **నీ తలంపు ఎంత నిజమో నీ దుఃఖం, నీ సంతోషం అంతే నిజం.**

అందువలన ఉపనిషత్తులలోని మంత్రాల అర్థాన్ని, హితులైన జ్ఞానుల ఉపదేశాల అర్థాన్ని విచారణ చేయడమే సమ్యక్ విచారణ. తద్వారా సంసార దుఃఖనాశనం కలుగుతుంది.

## మననం చేయదగిన వాక్యాలు

(1) భక్తి మార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం, శరణాగతిమార్గం – ఇవన్నీ వేరు వేరు కావని, అవినాభావ సంబంధం కలిగినవని గ్రహించి వాటిని సమన్వయం చేసుకుంటూ ఆత్మానుభూతికోసం ప్రయత్నం చేయాలి.

(2) భక్తికి పరాకాష్ఠ శరణాగతి. విచారణమార్గంలో వచ్చిన వివేకం శరణాగతికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా జ్ఞాన (విచారణ) మార్గం మరియు భక్తిమార్గం సంబంధం కలిగి ఉన్నాయి.

(3) జ్ఞాని మాత్రమే నీనుంచి ఏమీ ఆశించకుండా నిన్ను నిజంగా ప్రేమించగలడు. అతడే నీకు హితుడు. అటువంటి హితుడు ఉపదేశించినపుడే నీలో సరైన విచారణ ఉదయిస్తుంది.

✷✷✷



# 11. శ్రద్ధ భక్తి ధ్యాన యోగములు

కొత్తగూడెం,
06-05-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరులు చెప్పిన ఈ క్రింద శ్లోకమును దయచేసి వివరించండి.

**"సాక్షాత్తుగా వేదవాక్యం మోక్షం పొందడానికి శ్రద్ధా భక్తి ధ్యాన యోగములను హేతువులుగా చెబుతున్నది. ఎవరు ఈ శ్రద్ధాదులయందే స్థిరంగా ఉంటారో, వారికి అవిద్యచే కల్పించబడిన దేహసంబంధాలనుండి మోక్షం కలుగుతుంది."**

(వివేకచూడామణి-48)

**శ్రీనాన్నగారు**:

శంకరాచార్యులవారు ఇక్కడ కైవల్యోపనిషత్తులో చెప్పినదానిని ఉదహరించారు. శ్రద్ధ, భక్తి, ధ్యానం, యోగం అనేవి మోక్షానికి హేతువులుగా (కారణాలుగా) చెప్పారు. ముందుగా అవేమిటో తెలుసుకోవాలి.

## (1) శ్రద్ధ

**"దేనిచేత సద్వస్తువు తెలియబడుతుందో, అటువంటి శాస్త్రం, గురువు వాక్యాలను సత్యం అనెడి బుద్ధితో నిర్ణయించడం "శ్రద్ధ' అని సత్పురుషులచేత చెప్పబడినది"** అని శంకరులు చెప్పారు. (వివేకచూడామణి - 26)

ముందుగా ఈశ్వరుడనేవాడు ఒకడున్నాడని ఆయనే ఈ సృష్టి అంతటికి ప్రభువని విశ్వాసం ఉండాలి. బుద్ధి నిన్ను కొంతవరకే తీసుకువెళ్ళగలదు. ఆ తరువాత విశ్వాసం ఉండాలి. అందుకే కృష్ణుడు "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అంటే శ్రద్ధ కలిగినవానికే జ్ఞానం లభిస్తుందని గీతలో చెప్పాడు.

నీ హృదయంలో ఓ సద్వస్తువు ఉంది. కాని అది నీకు తెలియబడడం లేదు. ఆ సద్వస్తువును తెలియపరిచే శాస్త్రం, గురువు చెప్పే వాక్యాలు సత్యం అని నువ్వు నీ బుద్ధితో నిర్ణయించడం శ్రద్ధ. అలా నిర్ణయించలేకపోతే, ఆ నిజాన్ని నువ్వు తెలుసుకోలేవు. నీకు ఉపనిషత్తులలో చెప్పే మంత్రం మీద నమ్మకం లేకుండా, ఆ మంత్రం వల్ల నీకు ఫలితం రాదు కదా!

మనకు శ్రద్ధ లేదు అని ఊరుకోకూడదు. మనకు లేనిదాన్ని మనం సంపాదించుకుంటాం కదా! మనకు ఆ శ్రద్ధ లేకపోయినా, ఆ శాస్త్రం మీద శ్రద్ధ ఉన్నవాడితో సహవాసం చేసినా శ్రద్ధ పెరుగుతుంది. మనం బలహీనతలు లేనివాడితో సహవాసం చేస్తే, నెమ్మదిగా మన బలహీనతలు తగ్గిపోతాయి. వాళ్ళ vibrations మనమీద పనిచేస్తాయి. మన పొరుగువాడు దేనినైనా సాధించడానికి గట్టి ప్రయత్నం చేస్తుంటే మనకి కూడా అలాంటి ప్రయత్నం చేయాలి అనిపిస్తుంది కదా! సత్యం తెలిసేవరకు ప్రయత్నం చెయ్యడం అవసరమే! మనస్సు ఉన్నంతవరకు ముక్తికోసం ప్రయత్నం చెయ్యడం తప్పదు.

శంకరాచార్యులవారు వివేకచూడామణిలోనే చెప్పిన ఒక విషయం గుర్తుంచుకోవాలి. అదేమిటంటే ముందుగా నిత్యానిత్యవస్తు వివేకం కలగాలి. ఆ వివేకం కలిగినవాడికే వైరాగ్యం వస్తుంది. వివేకం, వైరాగ్యం ఉన్నవాడికే శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధా అన్నీ కలుగుతాయి. అందుచేత ఇక్కడ ఆచార్యులవారు శ్రద్ధ ఉన్నవాడు అన్నప్పుడు సాధన చతుష్టయంలో చెప్పిన నిత్యానిత్యవస్తు వివేకం, వైరాగ్యం మొదలైనవి కూడా కలిగి ఉన్నవాడు అని అర్థం చేసుకోవాలి.

## (2) భక్తి

"స్వస్వరూప అనుసంధానమే భక్తి" అని శంకరాచార్యులవారు చెప్పారు (వివేకచూడామణి – 32). అంటే నిదిధ్యాసనమే భక్తి. ముందుగా శాస్త్రం చెప్పింది, సద్గురువు చెప్పింది శ్రద్ధగా శ్రవణం చేయాలి. అలా "నీ స్వరూపం బ్రహ్మమే, నీవు ఆ బ్రహ్మమే" అని మననం చేసుకొని, బహుకాలం చింతన చేయడమే భక్తి.

రెండవ పక్షం దైవచింతన చేసినా, దైవాన్ని ఉపాసన చేసినా, అది కూడా భక్తే. మనం రూపనామాలతో తాదాత్మ్యం చెంది ఉన్నప్పుడు, రూపనామాలులేని దాన్ని అందుకోవడం కష్టం. అందుచేత మనలాగా శరీరం ధరించివచ్చిన అవతార పురుషుడిని ఎవరినైనా మనం ఆరాధిస్తే తేలికగా ఉంటుంది.

## (3) ధ్యానం

ధ్యానం అంటే ఏకవస్తువుని చింతించడం. ముందు నీకు శ్రద్ధ లేకుండా, భక్తి లేకుండా ధ్యానం కుదరదు. ధ్యానం అంటే నిరంతరం ఏక వస్తువుని చింతించడం. ఇక్కడ ఏది చింతన చేస్తుంది? మనస్సు చేస్తుంది. అలా ధ్యానం చెయ్యగా చెయ్యగా, ఆ ధ్యానం చేసే మనస్సు నశిస్తుంది. అంటే ఏక వస్తువుని చింతించడం వలన మనోనాశనం అవుతుంది. ఎందుకలా అవుతుంది అంటే, అప్పుడు దానికి మిగతా చింతనలు రావు. దానితో ఆ మనస్సు క్రమేణా బలహీనపడి నాశనం అవుతుంది.

## (4) యోగం

యోగం అంటే ఐక్యం. మీరు యోగాభ్యాసం ఎంతకాలంనుంచి చేస్తున్నారని రమణమహర్షిని అడిగారు. దానికి ఆయన “వియోగం ఉన్నవాడికి యోగం అవసరం. వియోగం లేనివాడికి యోగం ఏమిటి?” అన్నారు. ఇంకా ఒకదాంట్లో మరొకటి కలవడానికి అసలు రెండు ఉన్నాయా అని అనేవారు. రమణమహర్షి గారిది అజాత సిద్ధాంతం. అంటే, నువ్వు పుట్టిన వానివలె కనిపిస్తున్నావు కాని పుట్టనేలేదు. నీకు దేహభావం ఉన్నందువల్ల పుట్టానని అనుకుంటున్నావు. దేహం నువ్వుకాదు కదా! అదొక తలంపు. నువ్వు దేహం అనుకున్నా నువ్వు బ్రహ్మమే అయి ఉన్నావు.

నువ్వు పుట్టలేదు. అది నీకు తెలియక నువ్వు పుట్టాను అనుకుంటున్నావు. పుట్టింది చచ్చిపోతుందిగాని పుట్టనిది ఎలా చస్తుంది? ఆ పుట్టనిది ఏదో నువ్వు తెలుసుకోవడమే జ్ఞానం. అంతేకాని నువ్వు దాన్ని కొత్తగా కనిపెట్టక్కర్లేదు. కొలంబస్ అమెరికా కనిపెట్టాడంటే అది ఉన్నది కాబట్టే కనిపెట్టాడు. అమెరికా అంతకుముందు కూడా ఉంది.

శ్రద్ధ, భక్తి, ధ్యానాదులయందు ఎవరు స్థిరంగా ఉంటారో, వారికి అవిద్యచే కల్పించబడిన దేహబంధంనుండి మోక్షం కలుగుతుందని చెప్పారు.

నీకు తెలిసినా, తెలియకపోయినా ఆత్మ ఉంది. అయితే దాని తాలూకు జ్ఞానం నీకు తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం, అంతే.

## మననం చేయదగిన వాక్యాలు

(1) శ్రద్ధ, భక్తి, ధ్యానం, యోగం అనేవి మోక్షానికి హేతువులు (కారణాలు).

(2) సద్వస్తువును తెలియపరిచే శాస్త్రం, గురువు చెప్పేవాక్యం సత్యం అని నువ్వు నీ బుద్ధితో నిర్ణయించడం శ్రద్ధ.

(3) మనస్సు ఉన్నంతవరకు, ముక్తి కోసం ప్రయత్నం చెయ్యడం తప్పదు.

(4) స్వస్వరూప అనుసంధానమే భక్తి. అంటే, నిదిధ్యాసనమే భక్తి.

(5) ధ్యానం అంటే ఏకవస్తువుని చింతించడం. ఏకవస్తువుని చింతించడంవలన మనోనాశనం అవుతుంది.

***

# 12. అపరోక్షానుభవంతోనే ఆత్మజ్ఞానం

కొత్తగూడెం,
06-05-2010.

**ప్రశ్న**: శ్రీనాన్నగారికి ప్రణామములు. ఆత్మజ్ఞానం మరియు అవరోక్షానుభవం యొక్క ఆవశ్యకత గురించి వివేకచూడామణిలో ఆచార్యులవారు చెప్పిన శ్లోకాలపై వ్యాఖ్యానించవలసినదిగా విన్నపం.

**శ్రీనాన్నగారు**:

వివేకచూడామణిలో శంకరాచార్యులవారు ఆత్మజ్ఞానం సాధనకు సంబంధించిన ప్రతి విషయం గురించి చాలా వివరంగా చెప్పారు.

(1) "**వీణయొక్క రూపసౌందర్యం దాన్ని వాయించడంలో ఉండే నైపుణ్యం ప్రజలను రంజింపచేయడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. అది సామ్రాజ్యం సంపాదించడానికి ఉపయోగపడదు.**" (వివేకచూడామణి-59)

మనిషి ఏ పని చేసినా తన ఆనందం కోసమే చేస్తాడు. ఆ ఆనందం వాస్తవానికి వచ్చినా, రాకపోయినా డబ్బు సంపాదించడం, పెళ్ళి చేసుకోవడం వంటివి అందరూ చేస్తున్నారు కదా! సినిమాకు వెళుతున్నారు, ఎందుకు? ఆనందం కోసం. అలాగే, సంగీతం కూడా ఆనందం కోసం! సంగీతం వల్ల ఆనందం కలుగుతుందిగాని అది నీకు సామ్రాజ్యాన్ని సంపాదించిపెట్టదు. అంటే దాని ప్రయోజనం అంతవరకే!

(2) "**వాక్చాతుర్యం, శబ్ద ప్రవాహం, శాస్త్రాలకు వ్యాఖ్యానం చేయడంలో నేర్పు, ఈ విధమైన విద్వాంసుల యొక్క పాండిత్యం వీణ వాయించడం వలెనే భుక్తి కల్పించడానికే గాని ముక్తి కొరకు కాదు.**" (వివేకచూడామణి - 60)

కొంతమంది వక్తలు అనర్గళంగా మాట్లాడుతారు. వాళ్ళు మాట్లాడుతూ ఉంటే శబ్దాలు పోటీపడి వస్తుంటాయి. అదొక వరం. అందరూ వక్తలు అవ్వలేరు. రచయిత అవడం కంటే వక్త అవడం కష్టం. రచయిత ఆలోచించుకొని వ్రాసుకోవచ్చు. వక్త అంటే వెంట వెంటనే చెప్పాలి కదా! కొంతమంది కంఠం చాలా మధురంగా ఉంటుంది. అదొక వరం. వాళ్ళు అందంగా ఉన్నారని చెప్పడానికి Shakespeare 'Beauty walks on earth" అని అంటాడు, అది రచనాచాతుర్యం.

అలాగే కొంతమంది వ్యాఖ్యానాలు చాలా చక్కగా వ్రాస్తారు. భగవద్గీతకు ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. వ్యాఖ్యానం చేసేటప్పుడు రాగద్వేషాలు పనికిరావు. అంటే ఇష్టాయిష్టాలు లేకుండా నిష్పక్షపాతంగా వ్యాఖ్యానం చేయాలి.

"నువ్వు శాస్త్రం బాగా చదువుకున్నావనుకో, పాండిత్యం వస్తుంది గాని సత్పదార్థం నీకు తెలియదు. ఎందుకంటే ఆ సత్పదార్థం శాస్త్రంలో లేదు, నీ హృదయంలో ఉంది. హృదయంలో వెతకడం మానేసి, శాస్త్రంలో వెతుకుతుంటే నీకు సద్వస్తువు దొరకదు" అనేవారు రమణమహర్షి.

ధనం ఎటువంటిదో, ఆ పాండిత్యం అటువంటిది. ఇవన్నీ లౌకిక విషయాలు. ఇవి ప్రకృతిని దాటించలేవు, ప్రకృతిలోనే తిప్పుతుంటాయి. అంటే ముక్తిని ఇవ్వలేవు.

"చదువువలెను, చదవువలెను, చావులేని చదువు చదువవలెను" అన్నాడు ప్రహ్లాదుడు. ఎటువంటి చదువు చదవాలంటే నీ శరీరానికి చావొచ్చినా, నేను చనిపోవడం లేదు, నేను ఉంటున్నాను అన్న అనుభవం నీకు కలగాలి. అంటే అమృతత్వం కలిగే చదువు చదవాలి అన్నాడు ప్రహ్లాదుడు. మరి మిగతా చదువుల వల్ల ఉపయోగం లేదా అంటే ఉంది, వాటితో పొట్ట వెళ్ళిపోతుంది.

(3) **"పరతత్త్వం తెలియబడనిది అయితే, శాస్త్రాధ్యయనం వ్యర్థం. పరతత్త్వం తెలియబడినది అయినా, శాస్త్రాధ్యయనం వ్యర్థం."** (వివేకచూడామణి–61)

అసలు ఏమీ తెలియనివాడికి శాస్త్రం అక్కర్లేదు. అలాగే అన్నీ తెలుసుకున్నవాడికీ శాస్త్రం అక్కర్లేదు. తెలిసీ తెలియని వారికి శాస్త్రం అవసరం.

ఈ పుట్టడం, చావడమే నిజం. ఈ సంసారం ఒకటే నిజం అని, ఇది తప్పించి వేరే ఏమీ లేదనుకునేవాడికి ఇంక శాస్త్రం ఎందుకు? అలాగే, అన్నీ తెలిసిన రమణమహర్షిగారి లాంటివాళ్ళకి కూడా శాస్త్రంతో పనేముంది?

పరతత్త్వం ఉందనే తెలియని వాడికి శాస్త్రాధ్యయనం ఎందుకు? పరతత్త్వం ఉందని శ్రవణం చెయ్యకపోతే తెలియదు కదా! అందుకే శ్రవణం చెయ్యమంటారు.

తరువాత అపరోక్షానుభవం అంటే ప్రత్యక్ష అనుభవం గురించి ఏం చెబుతున్నారో చూద్దాం.

(4) **"ఔషధాన్ని సేవించకుండా 'ఔషధం' అను శబ్దమును ఉచ్ఛరించినంత మాత్రాన వ్యాధి పోదు. ప్రత్యక్షానుభవం లేకుండా, 'బ్రహ్మము' అను శబ్ధమును ఉచ్ఛరించుటచే బంధముక్తుడు కాలేడు."** (వివేకచూడామణి–64)

ఏదైనా రోగం వస్తే, మందు ఎంత గొప్పదైనా ఆ మందు పేరు అనుకుంటుంటే ఆ రోగం పోదు కదా! ఆ మందుబిళ్ళ వేసుకొని, అది పనిచేసిన తరువాతగాని ఆ రోగం నయం కాదు.

అలాగే నువ్వు సంసారబంధంలో ఉన్నావు. "అహం బ్రహ్మాస్మి, అహం బ్రహ్మాస్మి" అని నోటితో అనుకున్నంత మాత్రాన నీకు బ్రహ్మజ్ఞానం కలుగదు. బంధం లేని సద్వస్తువు నీ హృదయంలో ఉంది. ఆ సద్వస్తువు తాలూకు అనుభవం నీకు వచ్చినప్పుడు మాత్రమే ముక్తుడవు కాగలవు. ఇది ఆచార్యులవారి బోధ.

ఆత్మజ్ఞానం సంపాదించడానికి కొన్ని మంచి లక్షణాలు నీకు సహకరిస్తాయి. వాటిలో ఉన్నదానితో సంతృప్తి చెందడం ముఖ్యమైనది. ఆ సంతృప్తి నీకు లేకపోతే మొత్తం ఖగోళం అంతా రిజిస్ట్రార్ ఆఫీసుకు తీసుకెళ్లి నీకు వ్రాసిచ్చినా నువ్వు సంతృప్తి చెందవు. కానీ వాస్తవానికి నువ్వు భూమెంత సంపాదించుకున్నా ఆఖరికి నీ శవం కప్పిపెట్టడానికి అరడుగుల నేలే కావలిసింది.

ఒకోసారి పొయ్యిలో కొంత నిప్పురవ్వ వదిలేశాం అనుకోండి. పనిమనిషి అది ఆరిపోయింది కదా అని తీసుకెళ్లి దొడ్లో పడేసింది అనుకోండి. ఆ నిప్పురవ్వ ఏ గడ్డిపరకకో అంటుకుంటే అక్కడున్న గడ్డిమేటు అంతా అంటుకుపోతుంది. అలాగే నీ లోపల ఏ చిన్న బలహీనత వున్నా అది చాలు నిన్ను పాడుచేయడానికి.

(5) "**భూమిలో దాచి ఉంచిన నిధి గురించి ఆప్తుల మాటలతో దానిని తెలిసికొని, భూమిని త్రవ్వి, ఆ నిధిపై కప్పిన రాళ్లు, మన్ను మొదలగు వానిని అడ్డు తొలగించినప్పుడు మాత్రమే ఆ నిధిని తీసుకోవడం సాధ్యపడుతుంది. అంతియే కాని "నిధి" అను మాటలచే అది బయటకు రాదు కదా! అదే విధంగా మాయచేతను, దాని కార్యములగు దేహముల చేతను కట్టివేయబడిన నిర్మలమైన ఆత్మతత్త్వం బ్రహ్మవేత్త చేత చేయబడిన ఉపదేశం, మననం, ధ్యానం మొదలగువానిచేత పొందబడుతుంది, అంతేకాని యుక్తులచేత పొందబడదు.**"

(వివేకచూడామణి–67)

ఈ ఉదాహరణ పూర్వం రోజులకు సంబంధించినది. ఇప్పుడిది కాదు. రమణమహర్షి గారు ఏం చెప్పేవారంటే: "చెరువులో పడిపోయిన వస్తువు గట్టుమీద కూర్చుంటే నీకు దొరకదు. నువ్వు పోగొట్టుకున్న వస్తువు ఎంత లోతులో ఉందో అంత లోతుల్లోకి వెళ్ళి అప్పుడు కూడా మాట బిగించి, ప్రాణం బిగించి ప్రయత్నం చేస్తే గాని నువ్వు పోగొట్టుకున్న వస్తువు నీకు దొరకదు. అలాగే ఇంద్రియ నిగ్రహం చేసి, నీ హృదయం లోతుల్లోకి వెళితేగాని ఆ సద్వస్తువు నీకు లభ్యం కాదు" అని చెప్పేవారు. అంటే, సబ్జెక్టు ఒకటేగాని, కాలమాన పరిస్థితులను బట్టి ఉదాహరణలు మారతాయి.

ఆ తరువాత ఆచార్యులవారు మాయ గురించి చెప్పారు. మాయ మనచేతిలో లేదు. ఈశ్వరుడి చేతిలో ఉంది. ఆయన ఉపసంహరిస్తే ఉపసంహరించబడుతుంది. అందుకే శ్రీకృష్ణభగవానుడు నా దయ లేకుండా నా మాయను ఎవరూ జయించలేరు అన్నాడు.

మాయ అంటే ఏమిటి? లేనిది ఏది ఉన్నట్లు కనిపిస్తుందో, అదే మాయ. మాయను నిర్వచనం చేయడం చాలా కష్టం. రమణమహర్షిగారు ఇందులో లౌక్యంగా ఉండేవారు. ప్రపంచం ఉందా, లేదా అని వారిని అడిగినప్పుడు ఆయన ఉందని చెప్పేవారు కాదు, లేదని చెప్పేవారు కాదు. ప్రపంచం ఉన్నదానివలె కనిపిస్తోంది అనేవారు. ఉన్నదానివలె కనిపిస్తోంది అంటే అర్థం ఏమిటి? లేదనే. లేకపోయినా ఉన్నట్టు కనిపిస్తోంది. అదే మాయ. మాయ అంటే నిర్వచనం అలా చెప్పాలి. అసలు లేదని కాదు, అసలు లేదంటే కనిపిస్తోంది కదా అంటారు.

ఒక బ్రాహ్మీస్థితి పొందినవాడి సహకారంతోనే నువ్వు బ్రహ్మమును పొందగలవుగాని, నీకు ఎంత బుద్ధి సూక్ష్మత ఉన్నా, ఎన్ని తెలివితేటలు ఉన్నా, దానివల్ల మాత్రమే నువ్వు బ్రహ్మమును పొందలేవు. లేకపోతే ఈ పాటికే మేధావులందరూ సత్యానుభవం పొంది ఉండేవాళ్ళు కదా!

గానుగెద్దు కళ్ళకు గంతలు కట్టుకొని గానుగు చుట్టూరా ఓ గంటసేపు నడుస్తుంది. తరువాత ఓ యాభైమైళ్ళు వచ్చేసి ఉంటాను అనుకుంటుంది. ఆ గంతలిప్పేశాక ఎక్కడ ఉందంటే ఆ గానుగ దగ్గరే ఉంది. మన ఆలోచనలు దేహం చుట్టూ తిరుగుతున్నంతసేపు మన సాధనలు కూడా అలాగే ఉంటాయి. అందరూ గజ ఈతగాళ్ళేగాని గజం దాటి కూడా ఎవ్వరు ముందుకు వెళ్ళడం లేదట! అలాగే దేహం నేను అనుకునే సాధకులు కూడా ఎక్కడ మొదలు పెట్టారో అక్కడే ఉంటున్నారు. అంటే మనం గానుగెద్దుల్లాగా సాధన చేస్తే ఉపయోగం లేదని అర్థం.

## మననం చేయదగిన వాక్యాలు

(1) హృదయంలో వెతకడం మానేసి శాస్త్రంలో వెతుకుతుంటే నీకు సద్వస్తువు దొరకదు.

(2) అమృతత్వం కలిగే చదువు చదవాలి.

(3) ఏమీ తెలియనివాడికి మరియు అన్నీ తెలిసినవాడికి శాస్త్రం అక్కర్లేదు. తెలిసీ తెలియని వాళ్లకి శాస్త్రం కావాలి.

(4) దేహం నేను అనుకునే సాధకులు ఎక్కడ మొదలుపెట్టారో అక్కడే ఉంటున్నారు. అంటే, మనం గానుగెద్దుల్లాగా సాధన చేస్తే ఉపయోగం లేదని అర్థం.

✷✷✷

# 13. తీవ్రవైరాగ్యం మోక్షానికి ప్రథమకారణం

కొత్తగూడెం,
07-05-2010.

**ప్రశ్న:** శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీవివేకచూడామణిలో శంకరాచార్యులవారు చెప్పిన కొన్ని శ్లోకాల ద్వారా వైరాగ్యం గురించి దయచేసి వివరించండి.

**శ్రీనాన్నగారు:**

## (1) వైరాగ్యం అంటే ఏమిటి?

**"దర్శనం, శ్రవణం మొదలగు వాటిచే దేహం మొదలు బ్రహ్మవరకు గల అనిత్యమగు భోగ్యవస్తువులమీద ఏ జుగుప్స కలదో అది వైరాగ్యం."** (వివేకచూడామణి-21)

మనం చూసేదంతా అనిత్యం. అంటే ఒక సమయంలో వుండి మరొక సమయంలో లేకపోవడం. మనం చూసే ఈ ప్రపంచమంతా అసత్యం. ఆత్మ ఒకటే నిత్యం కనుక అది ఒకటే సత్యం. నిత్య అనిత్య వస్తు వివేకం ఉన్నవాడికి భోగ్యవస్తువులమీద విరక్తి కలుగుతుంది. వాడికి ప్రపంచంలో ఏ విషయం మీదా ఆకర్షణ కలగదు. ఎందుకంటే అది సత్యం కాదని తెలుస్తుంటుంది కదా!

ఎక్కడ ఏ గొడవ విన్నా, రాగద్వేషాలే. ఇష్టాలు, అయిష్టాలు. అంతకుమించి ప్రపంచం అంటే ఏమీ లేదు. రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు, కామక్రోధాలు ఇవన్నీ పర్యాయపదాలు. ఎక్కడైతే కామం ఉందో, అక్కడ ఇష్టం ఉంటుంది. ఎక్కడైతే క్రోధం ఉందో అక్కడ అయిష్టం ఉంటుంది.

అనిత్యం, అసత్యములగు అన్ని భోగ్యవస్తువులను కాకిరెట్టవలె వదిలివేయడం వైరాగ్యం.

## (2) వైరాగ్యం మోక్షానికి మొదటి మెట్టు

**"అనిత్య వస్తువులమీద మిక్కిలి వైరాగ్యం మోక్షమునకు ప్రథమ హేతువుగా (కారణంగా) చెప్పబడుతున్నది. ఆ తరువాత శమము, దమము, తితిక్షా, కర్మసన్యాసం మోక్ష కారణాలు."** (వివేకచూడామణి-71)

వైరాగ్యం గురించి ఆచార్యులవారు ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నారంటే వైరాగ్యం లేకుండా మోక్షం కలగదని! వైరాగ్యం మోక్షానికి మొదటి మెట్టు. ఈ లోకం గొడవలుగాని, పరలోక విషయాలుగాని, వాటిమీద నూటికి నూరు పాళ్ళు వైరాగ్యం కలిగితే తప్ప మోక్షం రాదు. లోకం గొడవలు వినడంవల్ల మనస్సు కలుషితం అవుతుంది. లోకవాసన పెరుగుతుంది. వైరాగ్యం తరువాత శమము కావాలన్నారు.

**"మాటిమాటికి దోషాలను చూడడంచేత విషయాల సముదాయంనుండి వైరాగ్యం పొంది మనస్సు తన లక్ష్యంమీద స్థిరమగు స్థితిని శమము అని చెప్పబడుతున్నది."**
(వివేకచూడామణి-22)

శమము అంటే మనో నిగ్రహం. ఈగలు తిండి పదార్థాల మీద వాలుతాయి, అంటరాని పదార్థాల మీద కూడా వాలుతాయి. ఈగలవలే మనస్సు కూడా మంచి విషయాలు మరియు చెడు విషయాలపై సమంగా చరిస్తూంటుంది. ఇలా ఇష్టం వచ్చినట్టు చరించే మనస్సును నిగ్రహించడం శమము అంటారు.

తాత్కాలిక వైరాగ్యం నిలబడదు. భోగ్య విషయాలలో దోషాలు అంటే అవి అనిత్యం, అసత్యం అని తెలిస్తేగాని ఆ విషయాలపై మమకారం పోదు. అలా దోషాలు పదేపదే చూడడంవలన విషయాలమీద విరక్తి కలిగి మనస్సు బ్రహ్మమునందు స్థిరంగా ఉండడాన్ని శమము అంటారు. శమము తరువాత దమము కావాలి.

**"జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు భోగ్య విషయాలనుండి మరలి తమ తమ స్థానాలలో ఉండడం దమముగా చెప్పబడినది."** (వివేకచూడామణి-23)

దమము అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియాలు రెండు రకాలు. 5 కర్మేంద్రియాలు, 5 జ్ఞానేంద్రియాలు. ఇంద్రియనిగ్రహం లేనివాడు వస్తువిషయాలు భోగించాలని వాంఛిస్తాడు. ఒకసారి ఏదైనా భోగం అనుభవిస్తే అది మళ్ళీ అనుభవించాలి అనిపిస్తుంది. అదే సంసారం. వైరాగ్యం ఉన్నవాడికి ఇంద్రియనిగ్రహం చేత భోగాలమీద ఆసక్తి కలుగదు.

**"అప్రతికారపూర్వకంగా, చింతా విలాపరహితంగా, సమస్త దుఃఖాలను సహించడం తితిక్ష అని చెప్పబడుచున్నది."** (వివేకచూడామణి-25)

ఎవడో మనకి అపకారం చేసాడని తిరిగి వాడికి అపకారం చేసేవరకు కొంతమంది విశ్రాంతి తీసుకోరు. రాయలసీమలో జరిగే హత్యలన్నీ అటువంటివే. భక్తులకు ప్రతీకారం పనికి రాదు. లోకులకి అది సహజంగా ఉంటుంది. సాధకులకు ఆ ప్రతీకారేచ్ఛ ఉండకూడదు.

**"చింతాకంత చింతైనా మనస్సుని కాల్చేస్తుంది."** చింత పనికిరాదు. దేహ అనారోగ్యానికి, మానసిక అనారోగ్యానికి చింతే కారణం. మనస్సులో ఏ వికారమూ పొందకుండా మనిషికి ఏ దుఃఖం వచ్చినా tolerate చెయ్యాలి అంటే సహనం వహించాలి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు కూడా సాధకుడి మనస్సు చలించకూడదు. ప్రమాదం ఎక్కడ వస్తుందంటే మనకి ఏదైనా ఇష్టమైన సంఘటనలు జరిగినప్పుడు సంతోషం వస్తుంది. ఇష్టంలేని సంఘటనలు జరిగినప్పుడు దుఃఖం వస్తుంది. ఇష్టమైన సంఘటనలు జరిగినప్పుడు సంతోషించడం మానేస్తే ఇష్టంలేని సంఘటనలు జరిగినప్పుడు దుఃఖం కూడా రాదు.

సంతోషం ఎంత సహజమో దుఃఖం కూడా అంతే సహజం. ఈ రెండూ లోకులకు ఉంటాయి. అనుకూల పరిస్థితులు వస్తే సంతోషం ఉంటుంది. ప్రతికూల పరిస్థితులు వస్తే దుఃఖం ఉంటుంది. సాధకులకు అవి పనికి రావు. మోక్షం పొందడానికి చేసే ప్రయత్నంలో ఇటువంటివి వదిలెయ్యాలి.

ప్రపంచమంతా ద్వంద్వాలే. నువ్వు ప్రపంచంలో ద్వంద్వాల మధ్య కొట్టుకుపోతే నీకు లోకవాసన పెరిగిపోతుంది. ఆచార్యులవారు మూడు వాసనలు బలీయమైనవని చెప్పారు కదా! అవి: దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన.

**దుఃఖం వస్తే ప్రశాంతంగా వుండాలి. ఉద్రేకానికి లోనుకాకూడదు.** ప్రారబ్ధాన్ని బట్టి ఎప్పుడైనా దుఃఖం రావొచ్చు. సాధకులకు ఉండవలసిన లక్షణాలలో ఇంకొకటి చెబుతారు – **నువ్వు ఇతరులను భయపెట్టకూడదు, వారివలన నువ్వు భయపడకూడదు.**

ముందుగా వైరాగ్యం, తరువాత శమము, దమము, తితిక్ష, ఆ తరువాత చెయ్యవలసియున్న అన్ని కర్మలయొక్క పూర్తి సన్యాసం మోక్షకారణాలు అని శంకరులు చెప్పారు.

దేహం ఉన్నంతకాలం కర్మ తప్పదు. కర్మ చేస్తున్నా అహంకారం లేనివాడికి "నేను కర్మ చేస్తున్నాను" అనే భావన వుండదు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అని చెప్పాడు. తల్లిదండ్రులను పూజించడం ధర్మం. ప్రహ్లాదుడు భగవంతుడి కోసం తండ్రిని వదిలేసాడు. అంటే భగవంతుడిని తెలుసుకొనే ప్రయత్నంలో నీ తల్లిదండ్రులకు దూరంగా ఉన్నా దోషం రాదు. సన్యాసమంటే విడిచిపెట్టడం. తల్లిదండ్రులను చూడాలి, అది కర్తవ్యం. భగవంతుడి కోసం వారిని వదిలేస్తే అది దోషకారణం కాదు, మోక్షకారణం. కర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వహించి ఆ కర్మల ఫలితాన్ని భగవంతుడికి విడిచిపెడితే అది మోక్షకారణం అవుతుంది.

వైరాగ్యం కలగనంతవరకు చేయవలసిన సమస్త కర్మలు చేయదగినవే. వైరాగ్యం కలిగిన తరువాత మాత్రం భగవంతుడి కోసం వాటిని పూర్తిగా విడిచిపెట్టవచ్చు అని అర్థం.

## (3) శ్రవణ మనన నిదిధ్యాసనములు

**"ఆ తరువాత శ్రవణం, ఆ వినినదానియొక్క మననం, మునియైన అతనికి చిరకాలం, నిత్యనిరంతరం ఆత్మతత్త్వ ధ్యానం కారణాలు. ఆ ధ్యానం వలన గొప్పదైన నిర్వికల్పసమాధిని పొంది ఆత్మసాక్షాత్కారం పొందిన అతడు ఈ లోకంలోనే నిర్వాణసుఖాన్ని పొందుతాడు."** (వివేకచూడామణి-72)

ఇక్కడ ముందుగా "ఆ తరువాత" అన్నారు. అంటే ఇంతకుముందు 71వ శ్లోకంలో చెప్పిన వైరాగ్యం, శమము, దమము, తితిక్ష, కర్మసన్యాసములు శ్రద్ధతో అవలంబించిన తరువాత అని అర్థం.

ఆ తరువాత శ్రవణ మననాలు. అంటే సద్గురువు చెప్పింది, శాస్త్రంలో చెప్పింది శ్రద్ధతో అంటే అది సత్యమే అన్న బుద్ధితో వినాలి. అలా వినినిదానిని మననం చేయాలి. ఆపై దానిని చిరకాలం ధ్యానం చేయాలి. సామెత ఒకటి ఉంది, నువ్వేది చింతిస్తే అది అవుతావని. నిరంతరం, చిరకాలం ఆత్మచింతన చేయాలి. అంతరమనేది లేకుండా చిరకాలం నిత్య నిరంతరం ధ్యానం చేయమన్నారు శ్రీశంకరాచార్యులవారు. ఆయన సాధకుల కోసం ప్రతి విషయాన్ని ఎంత స్పష్టంగా చెబుతున్నారో గమనించి మనం ఆచరించాలి.

విషయచింతన విషంకంటే ప్రమాదమైనదని చెప్పారు. ఎందుకంటే విషం తిన్న వాడినే చంపుతుంది. కానీ విషయం చూచినవాడిని కూడా చంపుతుంది. అందుకే విషయచింతన మాని, ఆ సద్వస్తువుని ధ్యానించడంవలన మనోనాశనం అవుతుంది.

"ఆ ధ్యానంవలన గొప్పదైన నిర్వికల్ప సమాధిని పొంది ఆత్మసాక్షాత్కారం పొందిన అతడు ఈ లోకంలోనే నిర్వాణసుఖాన్ని పొందుతాడు" అన్నారు.

ఇది బుద్ధుడు చెప్పిన నిర్వాణసుఖం. నిర్వాణసుఖం, ఆత్మసాక్షాత్కారం, మోక్షం, ఆత్మసుఖం ఇవన్నీ పర్యాయపదాలు. నువ్వు దేహంతో ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో, ఆ విధంగా సద్వస్తువు తోటి తాదాత్మ్యం పొందినప్పుడు నిర్వాణసుఖం పొందుతావు.

సత్తును (ఆత్మను) తెలుసుకోలేకపోతే నువ్వు అసత్తు (ప్రపంచం) లోంచి బయటకు రాలేవు. బంధంలోంచి బయటకు రాలేవు. నీకు ఆ సత్యం తెలియనంతవరకు స్వేచ్ఛా లేదు, ఆనందమూ లేదు.

**నిజమైన సుఖి ఆత్మజ్ఞాని మాత్రమే. జ్ఞాని కానివాడు సుఖి కాలేడు. సత్యం ఎవరికి ఎరుకలోకి వచ్చిందో వారే జ్ఞాని.** విషయజ్ఞానం జ్ఞానం కాదు. సత్యసాక్షాత్కారం పొందినవాడు మాత్రమే జ్ఞాని. అతడు మాత్రమే నిర్వాణసుఖం పొందుతాడు.

'నేను' అనే తలంపు కించిత్తు కూడా ఎక్కడ లేదో అక్కడే నీ స్వరూపం ఉంది. ఆ స్వరూపం అరూపం. రమణమహర్షి "నీకు రూపం లేనప్పుడు భగవంతుడికి రూపం ఎక్కడ ఉంటుంది? నువ్వేదో రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నావు కాబట్టి నీ సహాయం కోసం దేవుడు కూడా రూపం ధరించి వస్తున్నాడు" అని అన్నారు. కృష్ణుడు గీతలో "నేను పొందవలసినది, చేయవలసింది ఏమీ లేదు, అయినా ఇతరుల కోసం పని చేస్తున్నాను" అని చెప్పాడు. శ్రీశంకరాచార్యులవారు స్తోత్రాలు, ప్రకరణ గ్రంథాలు, భాష్యాలు వ్రాసారు. అవన్నీ ఆయనకెందుకు? ఇతరుల కోసమే కదా!

## (4) ఆశ అను మొసలి

**"అస్థిరమైన వైరాగ్యం కలిగి సంసార సాగరం దాటాలని ప్రయత్నించే మోక్షేచ్ఛ కలవారిని ఆశ అను మొసలి మార్గమధ్యంలోనే కంఠాన్ని పట్టుకొని వేగంగా దారి మళ్ళించి ముంచుతుంది."** (వివేకచూడామణి-81)

అస్థిరమైన వైరాగ్యం అంటే వివేకం లేకుండా వచ్చిన వైరాగ్యం. చాలామందికి వివేకం లేకుండా వైరాగ్యం వస్తుంది. ఇంట్లో కష్టాలవల్లనో, ఇబ్బందులవల్లనో, తాత్కాలికంగా ఎవరో తిట్టారనో, ఇలా రకరకాల బాహ్యకారణాల వల్ల వచ్చే వైరాగ్యం నిలబడదు.

ఆధ్యాత్మికంగా నీకు బలం లేనప్పుడు బాహ్యకారణాల వల్ల నీకు వైరాగ్యం వచ్చినా మళ్ళీ ఆ కారణం పోతే ఆ వైరాగ్యం కూడా పోతుంది. దానిని శ్మశానవైరాగ్యం అని కూడా అంటారు. అంటే శ్మశానంలో తమ బంధువు శవం కాలుతున్నంతసేపు తాము కూడా ఇంతే కదా అనుకుంటారు మనుషులు. ఇంటికి వచ్చాక మళ్ళీ మాయ కమ్మేస్తుంది. శ్మశానమే మర్చిపోతారు. దానితో ఆ వైరాగ్యమూ నిలబడదు.

ఏదైనా కారణం చేత వైరాగ్యం వస్తే ఆ కారణం పోయాక ఆ వైరాగ్యం కూడా పోతుంది. అకారణ వైరాగ్యం అంటే ప్రత్యేకించి ఏ కారణాలు లేకుండా వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది. అది నీకు నిత్యానిత్య వివేకంవల్ల, విచక్షణవల్ల వస్తుంది. అది నిలబడుతుంది. కాని బాహ్యకారణాల వల్ల వచ్చే వైరాగ్యం నిలబడదు.

ఏది నిత్యం, ఏది అనిత్యం, ఏది సత్యం, ఏది అసత్యం, ఏది మనకు మంచిది, ఏది మనకు మంచిది కాదు, ఏది మనల్ని చీకట్లోకి తీసుకెళుతుంది, ఏది వెలుతురులోకి తీసుకెళుతుంది అనే వివేకం లేకుండా వచ్చే వైరాగ్యం ఎప్పుడూ స్థిరంగా ఉండదు.

అస్థిరమైన వైరాగ్యాన్ని నువ్వు ఆసరాగా పెట్టుకొని సంసార సాగరం దాటాలని ప్రయత్నిస్తే ఆశ అనే మొసలి మార్గమధ్యంలోనే నీ కంఠాన్ని పట్టుకొని వేగంగా దారి మళ్ళించి ముంచుతుంది. దారి మళ్ళించడం అంటే మోక్షం వైపుకు నీ ముఖం తిరగకుండా ప్రకృతిలోనికి నిన్ను తీసుకువెళ్ళిపోతుంది.

ఆశ ఎందుకు వస్తోంది? అజ్ఞానంవల్ల వస్తోంది. నీలో ఉన్న అవిద్యలోంచి, అజ్ఞానంలోంచి, తెలియనితనంలోంచి కర్తృత్వం వస్తోంది. తెలియనితనం అంటే నువ్వెవరో నీకు తెలియదు. నువ్వెవరో నీకు తెలిస్తే కర్తృత్వం రాదు. నువ్వెవరో నీకు తెలియదు కాబట్టి ఇదంతా నేనే సాధించాను అనుకుంటున్నావు.

ఆశ అనే గొయ్యిని ఎవడు నింపలేడు. ఎన్ని జన్మలెత్తినా ఆశ అనే గొయ్యిని నింపలేవు. నింపుదామని ప్రయత్నం చేసినా అది నిండదు. ఆ గొయ్యి అటువంటిది. గీతలో శ్రీకృష్ణుడు మితిమీరిన ఆశను మహాపాపంగా వర్ణించాడు. నీ చేత ఏ చెడ్డపని చేయించినా ఆ ఆశే చేయిస్తుంది.

## (5) దేహాత్మబుద్ధి – మొసలి

**"శరీరపోషణమును కోరుతూ ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలనుకునేవాడు మొసలిని బల్లచెక్కగా పట్టుకొని నదిని దాటాలనుకుంటున్నాడు."** (వివేకచూడామణి–86)

దేహాత్మబుద్ధి కలవాడు అంటే దేహమే నేను, దేహమే ఆత్మ అనే బుద్ధిలోంచి ఎవడైతే విడుదల పొందడో, దేహం చనిపోయినప్పుడు జీవితం కూడా అంతమైపోతుంది అనే పూర్తి నమ్మకం ఉన్నవాడు. అలాంటివాడు ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలనుకున్నా పొందలేడు. ఎందుకంటే ఒక మొసలిని బల్లచెక్క అనుకొని దాన్ని ఆధారంగా చేసుకొని నదిని దాటుదామనుకుంటే ఆ మొసలి నిన్ను దాటనివ్వదు కదా! అలాగే ఈ దేహాన్ని నమ్ముకుని దానిపై మమకారం పెంచుకొని అదే నేను అని జీవించే నిన్ను ఆ దేహాత్మబుద్ధి మొసలిలాగే నీ గమ్యం చేరనీయదు.

శ్రీశంకరులు ఈ విషయాన్ని ఎంత స్పష్టంగా చెబుతున్నారో చూడండి. కంచంలో అన్నం కదలకూడదు, మా అబ్బాయి మటుకు బలవంతుడైపోవాలి అంటే ఎలా కుదురుతుంది? దేహాత్మ బుద్ధి పోకూడదు, మోక్షం వచ్చేయాలి అంటే ఎలా సాధ్యం? అని పరస్పర విరోధాలు కదా!

చావు పుట్టుకలు సహజం. వాటి గురించి బాధపడకూడదు. బాధపడినా అది నువ్వు ఆపు చేయలేవు. ఆపు చెయ్యలేని సంఘటనల గురించి నువ్వు బాధపడడం ఎందుకు?

చావుపుట్టుకలు ఎటువంటి వంటే – నువ్వు సముద్రం వంక చూస్తున్నావనుకో, ఒక కెరటం లేస్తుంది, అదే దేహం పుట్టడం అంటే, మళ్ళీ ఆ కెరటమే పడిపోతుంది, అదే చనిపోవడం! ఆ కెరటాలు లేచి పడడం ఎంత క్షణికమో, ఈ పుట్టుకలు, చావులు కూడా అంతే క్షణికం! ఇటువంటి క్షణికమైన జీవితం గురించి దుఃఖించడం దేనికి?

ఆచార్యులవారి మాటలు చదువుతుంటేనే సంతోషం వచ్చేస్తోంది. ఊరికే ఈ మాటలు చదువుతుంటేనే మనకు ఎంతో సంతోషం వచ్చేస్తుంటే ఈ మాటలు అనుభవంలోకి వచ్చినప్పుడు ఆ ఆనందం భరించగలమా? భరించలేము కాబట్టే మనకది ప్రస్తుతం అందుబాటులో లేకుండా చేశారు.

## (6) దేహ భార్యాపుత్రాదులు

**"ఏ మోహాన్ని జయించడంవలన మునులు ఆ పరమపదాన్ని పొందారో; దేహ భార్యా పుత్రాదులయందు అటువంటి మోహం అనెడు మహామృత్యువును జయించు."**

(వివేకచూడామణి–88)

కొంతమందికి ఇల్లు విడిచిపెడితే నిద్ర పట్టదు. వారు ఇంటికి తాళం వేసి ఆ తాళం పడిందో లేదో అని ఆలోచిస్తూ ఉంటారు. ఇంటిమీద ఉన్న మోహం కొద్దీ ఇంకొకళ్ళ ఇంటికి వెళితే నిద్రపట్టదు. మేము గృహస్థులం అంటారు. హైదరాబాద్‌లో మీ ఇల్లు ఉంది. కొత్తగూడెం వెళ్ళవద్దు అని మీ ఇల్లు చెప్పిందా? మీ ఇంటి మీద ఉండే వ్యామోహం కొద్దీ కొత్తగూడెం రావడం లేదు. అలా అనకుండా ఇల్లు మిమ్మల్ని పట్టుకుంది అంటారు. ఇల్లు మిమ్మల్ని పట్టుకోలేదు. మీరే ఇల్లుని పట్టుకొని ఇల్లు నన్ను విడిచిపెట్టడం లేదు అంటారు. ఇల్లు జడం, దాని మీద ఉన్న వ్యామోహం మిమ్మల్ని కట్టేసింది.

ఇంతకుముందు చెప్పుకున్నాం కదా దేహాత్మ బుద్ధి ఉండకూడదని! అంటే దేహంతో పాటు భార్యా, సంతానం, ఇల్లు మొదలగువాటిపై మోహం ఉండకూడదు. ఋషులులాగా మనం కూడా ఆ మోహమును పోగొట్టుకుంటేనేగాని ఆ సద్వస్తువు మనకు దొరకదు అని చెబుతున్నారు.

నీ భార్యపట్ల, నీ బిడ్డల పట్ల నువ్వు చేయాల్సినవన్నీ చెయ్యి, కానీ వారిపై మోహం పెట్టుకోవద్దు. Detached attachment ను practice చెయ్యి. పిల్లల మీద ఎక్కువ మోహం పెట్టుకుంటే వాళ్లు పాడైపోతారు. వాళ్ళ అవసరాల వరకు చూడాలి. మొక్క భూమిలో పాతిపెట్టాం, దానికి నీళ్ళు పోస్తాం. దూడలు అవి తినకుండా చుట్టూ కంచె వేస్తాం. అంతకంటే మనం ఏం చెయ్యగలం? అది పెద్దది అవడం, కాయలు కాయడం అదే చూసుకోవాలి. మనమేం చేస్తాం?

అలాగే, పిల్లల అవసరాలవరకు మనం చూడాలిగాని వాళ్ళపై మోహం పెట్టుకోకూడదు. వాళ్ళ ప్రారబ్ధాన్ని బట్టి వాళ్ళు పైకి వస్తే వస్తారు. మనం ప్రోత్సాహం ఇచ్చినంత మాత్రాన పైకిరారు. మన దేహానికి ప్రారబ్ధం ఎలా ఉందో, అలాగే వాళ్ళ దేహానికి కూడా ప్రారబ్ధం ఉంటుంది.

ఆచార్యులవారు ఇంత కష్టపడి ఎందుకు చెప్పినట్టు? జగత్తుమీద వారికున్న అనుగ్రహం తప్పించి ఇంకో కారణం లేదు. ఆచార్యులవారు నూటికి తొంభై మార్కులు తమ బోధ వల్ల వచ్చేలా చూస్తారు. మీరు ఇంటికి వెళ్ళి సాధన చేసుకొనేది మిగిలిన పదిశాతం వరకే!

మీకు ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. మీకు విషయం మీద ప్రీతి కలిగినప్పుడు సాధన చేస్తున్నా, అలసట చెందరు.

మీ హృదయంలో ఉన్న సత్యం మీరు గుర్తించలేకపోవచ్చు. అయితే సద్గురువు చెప్పే వాక్యం మీ కళ్ళకు కనిపిస్తున్న సత్యం. శ్రద్ధ రెండు అక్షరాలు. అంటే సద్గురువు చెప్పే వాక్యం, శాస్త్రంలో చెప్పిన వాక్యం సత్యమే అన్న బుద్ధి. ఆ శ్రద్ధ ఉంటే అన్నీ వచ్చేస్తాయి.

## (7) వైరాగ్యం, బోధ

**"వైరాగ్యం, బోధ (ఆత్మానాత్మ వివేకం వలన కలిగిన జ్ఞానం)- ఈ రెండూ పక్షికి ఉండే రెండు రెక్కల వంటివి అని తెలుసుకో. అతి సుందరమైన మోక్షం అనే ఉన్నత స్థానం యొక్క ప్రాప్తి కలిసి యున్న ఆ వైరాగ్య బోధలు లేకుండా ఒక్క వైరాగ్యంచేత గాని, ఒక్క బోధచేత గాని కలగదు."** (వివేకచూడామణి-375)

పక్షి ఎగరడానికి రెండు రెక్కలు ఉండాలి, ఒక్క రెక్కతో ఎగరలేదు కదా! మోక్షం అనేది చాలా సుందరమైన ఉన్నత స్థానం. అక్కడికి చేరాలంటే పక్షిలాగా మనం కూడా ఎగరాలి, అందుకు కావాల్సిన రెండు రెక్కలు – వైరాగ్యం మరియు బోధ అంటే ఆత్మానాత్మ వివేకం వలన కలిగిన జ్ఞానం అని గొప్ప కవిత్వాన్ని కలిపి మరీ చెబుతున్నారు ఆచార్యులవారు.

జ్ఞానం అంటే సత్యం తాలూకు ఎరుక. ఇది ఆత్మ, ఇది అనాత్మ అని తెలియాలి. చూసేవాడు ఆత్మ. చూడబడేదంతా అనాత్మ. చూడబడేదంతా నశిస్తుందన్న భావం ముందు నీకు స్థిరపడాలి. అహంకారం నీ చేత చూడబడుతోంది. మనస్సు నీ చేత చూడబడుతోంది. ఇంద్రియాలు, ఆస్తిపాస్తులు, చుట్టాలు, స్నేహితులు నీ చేత చూడబడుతున్నాయి. నీవు కానిదానితోటి ఏదో ఒక రోజున విడిపోవడం తప్పదు. ఇది ప్రకృతి విధానం.

జ్ఞానం ఎలా వస్తుందంటే శ్రవణ మనన నిది ధ్యాసనాలద్వారా వస్తుంది. ప్రాపంచిక విషయచింతన లేకుండా వైరాగ్యం సహాయం చేస్తుంది. మరి ఆత్మచింతన ఎలా కలుగుతుంది అంటే ముందు దాని గురించి వినాలి. దాని గురించి వినకుండా దానిని చింతించలేవు కదా! దాని గురించి వింటే నీకు మననం చేయడానికి బుద్ధి పుడుతుంది. మననం చేయగా చేయగా నీకు దాని మీద ధ్యాస కలుగుతుంది. అప్పుడా ధ్యాసే ధ్యానం క్రింద మారిపోతుంది.

## మననం చేయదగిన వాక్యాలు

(1) అనిత్యం, అసత్యములగు అన్ని భోగ్యవస్తువులను కాకిరెట్టవలె త్యజించుట వైరాగ్యం.

(2) వైరాగ్యం మోక్షానికి మొదటి మెట్టు.

(3) విషయచింతన విషం కంటే ప్రమాదమైనది.

(4) కర్తవ్యాన్ని శ్రద్ధతో నిర్వహించి ఆ కర్మల ఫలితాన్ని భగవంతుడికి విడిచిపెడితే అది మోక్షకారణం అవుతుంది.

(5) సద్గురువు చెప్పింది, శాస్త్రంలో చెప్పింది శ్రద్ధతో అంటే అది సత్యమే అన్న బుద్ధితో వినాలి. అలా వినినదానిని మననం చేయాలి. ఆపై దానిని చిరకాలం ధ్యానం చేయాలి.

(6) అకారణ వైరాగ్యం అంటే ప్రత్యేకించి ఏ కారణాలు లేకుండా వచ్చిన వైరాగ్యం నిలబడుతుంది. అది నిత్యానిత్య వివేకంవల్ల, విచక్షణవల్ల వస్తుంది.

✷✷✷

# 14. చైతన్యం తప్పించి మిగతావన్నీ కల్పితాలే!

కొత్తగూడెం,
08-05-2010.

ప్రశ్న : శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు ఇలా అన్నారు:

**"వస్తుతత్త్వం తెలిసిన ఈశ్వరుడు (శ్రీకృష్ణుడు) 'నేను ఈ భూతములలో లేను; 'భూతములు కూడా నాలో ఉన్నవి కాదు' అని చెప్పెను."**

(వివేకచూడామణి-235)

"అతి రహస్యమైన, ఈ బ్రహ్మజ్ఞానమును అసూయ లేనివాడవగు నీకు చక్కగా చెబుతున్నాను" అని శ్రీకృష్ణ భగవానుడు శ్రీభగవద్గీతలో 9వ అధ్యాయమైన 'రాజవిద్య రాజ గుహ్యాయోగమును' ప్రారంభించారు.

అటువంటి అధ్యాయంలోని 4వ శ్లోకంలోనున్న "నేను ఈ భూతములందు లేను" అన్నది మరియు 5వ శ్లోకంలోనున్న "భూతములు నాయందు ఉన్నవి కాదు" అన్న రెండు వాక్యాలను శ్రీవివేకచూడామణిలో చేర్చడంతో ఆ శ్లోకాలకు ఉన్న విశేష ప్రాముఖ్యత తెలుస్తోంది.

దయచేసి ఆ రెండు శ్లోకాలను మాకు విపులంగా వివరించ వలసిందిగా ప్రార్థన.

## శ్రీనాన్నగారు:

### (1) అనసూయుడు

"అతిరహస్యమైన ఈ బ్రహ్మజ్ఞానమును అసూయలేనివాడవగు నీకు చక్కగా చెబుతున్నాను." (భగవద్గీత 9-1)

భగవద్గీతలో కృష్ణుడు అర్జునుడికి అనసూయుడు అని పేరు పెట్టాడు. అనసూయుడు అంటే అసూయ లేనివాడు.

కృష్ణుడు "అర్జునా, నిన్ను  చాలా గమనించాను. నీలో చాలా గొప్ప గుణం ఉంది. నీకంటే విద్యావంతులను చూసినా, నీకంటే ఐశ్వర్యవంతులను చూసినా, ఎవరిని చూసినా నీకు అసూయ కలగడం నేను చూడలేదు. నీ కోపం చాలా సార్లు చూశాను. కానీ నీలో అసూయ చూడలేదు. ఆ ఒక్క గుణానికి స్వాధీనమై నీకు భగవద్గీత చెబుతున్నాను" అని చెప్పాడు. అసూయ లేకపోవడం అంత మంచి గుణం అన్న సంగతి మనం గుర్తుంచుకోవాలి.

అసూయ రావడం చాలా తేలిక. ఉదాహరణకు అనుకోకుండా మీ అక్క బాగా ధనవంతురాలు అయిందనుకోండి, మీకు అసూయ రావొచ్చు. ఆవిడ మీ అక్కే, అయినా, ఆవిడను ప్రేమిస్తున్నా మీకు అసూయ రావొచ్చు. ఈ అసూయ ఎలా వస్తోంది? మీలో ఉన్న అజ్ఞానం అసూయ కింద మారుతోంది. దానిని పోగొట్టుకోవాలి అనుకోవడం జ్ఞానం.

## (2) సమస్త భూతములు నాయందు ఉన్నవి

**"ఈ సమస్త ప్రపంచం అవ్యక్తరూపుడగు నాచే వ్యాపించబడి ఉన్నది. సమస్త భూతములు నాలో ఉన్నాయి. నేను వాటియందు ఉండడం లేదు."**

(భగవద్గీత 9–4)

ఇక్కడ 'నా' అంటే 'చైతన్యం' అని అర్థం. అవ్యక్తమైన చైతన్యంలో నుండే వ్యక్తం వస్తుంది. అంటే ఈ సమస్త ప్రపంచం అవ్యక్తరూపుడగు చైతన్యంచే వ్యాపించబడినది అని అర్థం.

"సమస్త భూతములు నాలో ఉన్నాయి. నేను వాటియందు ఉండడం లేదు" అన్నాడు. భూతకోటి ఎక్కడినుంచి వస్తోంది? చైతన్యంలోనుండే వస్తోంది. సమస్త భూతాలు నాయందు ఉన్నాయి. అంటే వాటికి మూలం నేను. అవి నాలోంచి వస్తున్నాయి అని అర్థం.

"నేను వాటిలో లేను" అంటే, అవి నేను కాను అని చెప్పటం. చైతన్యానికి పరిమితులు లేవు. ఆయననుంచి వచ్చిన జీవకోటికి పరిమితులు ఉన్నాయి. వాటికి ఇష్టాయిష్టాలు ఉంటాయి, దేహభావం ఉంటుంది, అహంకారం ఉంటుంది. అంటే, మీరు నాలోంచి వచ్చినా, మీ అహంకారంలో నేను లేను అని చెప్పటం. అంటే మీ యిష్టాయిష్టాలలో నేను లేను. మీ చావు పుట్టుకలలో నేను లేను, వాటితో నాకేమీ సంబంధం లేదని చెప్పటం. మీలో నేను లేనంటే మీ అజ్ఞానంలో, మీ అవిద్యలో నేను లేనని అర్థం.

## (3) భూతములు నాయందు ఉండునవి కావు

**"భూతములు నాలో ఉండేవి కాదు. ఈశ్వర సంబంధమగు నా ఈ యోగమహిమను చూడుము. నా స్వరూపం భూతములను సృష్టిస్తుంది, భరిస్తుంది కాని ఆ భూతములలో ఉండడం లేదు."** (భగవద్గీత 9-5)

ఇంతకుముందు శ్లోకంలో సమస్త భూతములు నాలో ఉన్నాయి అన్నాడు. ఇక్కడేమో భూతములు నాలో ఉండేవి కాదు అంటున్నాడు. ఇవి పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి కదా! ఆయన చెప్పింది ఆయనే ఖండించేస్తున్నాడు. కనీసం నాలుగు శ్లోకాలు చెప్పిన తరువాత ఖండిస్తే ఫరవాలేదు. వెంటనే ఖండించేస్తున్నాడు.

## (4) రెండూ నిజమే

శ్రీకృష్ణభగవానుడు వెంట వెంట శ్లోకాలలో చెప్పినవి పరస్పర విరుద్ధమైనా, అవి రెండూ నిజమే. వ్యవహారికంగా చూసినప్పుడు మొదటిది అంటే సమస్త భూతములు నాలో ఉన్నాయి అని చెప్పింది నిజం. పారమార్థిక దృష్టి కలిగాక రెండోది, అంటే భూతములు నాలో (చైతన్యంలో) ఉండేవి కాదు అని చెప్పిందే నిజం.

ఇక్కడ శ్రీరమణులు స్పష్టతనిచ్చారు. స్వప్నావస్థ 5 నిమిషాలో, 10 నిమిషాలో ఉంటుంది. జాగ్రదవస్థ రోజుకు 16 గంటలు ఉంటుంది. మనం మేలుకొని వున్న సమయం కలలుగనే సమయం కన్నా ఎక్కువగా ఉన్నా స్వప్నావస్థ ఎంత అబద్ధమో, జాగ్రదవస్థ కూడా అంతే అబద్ధం. అలాగే సుషుప్తి అవస్థ కూడా అంతే అబద్ధం. ఈ మూడు అవస్థలు చైతన్యంలో కల్పించబడ్డాయి.

మనకొక కల జరుగుతోంది. ఆ కలలో విమానాల మీద తిరుగుతాం. కార్లమీద తిరుగుతాం. ఆకలి వేసింది. కలలో ఆకలివేస్తే మెలుకవ స్థితిలో ఉన్న మన వంటగదిలోని ఆహారం పనికి రాదు. కలలోని వంటగదిలోని ఆహారం కావాలి! ఇది జాగ్రత్తగా గమనించండి! ఇలా రకరకాలుగా వస్తాయి స్వప్నాలు. స్వప్నం జరుగుతున్నప్పుడు ఆ స్వప్నం నిజమే అనుకుంటాడు. ఆ స్వప్న శరీరాలన్నీ స్వప్నంలో నిజమే. జాగ్రదవస్థలోకి వచ్చేశాక అవి అన్నీ అబద్ధం అయిపోతున్నాయి.

ఆ స్వప్నంలోని శరీరాలకి, గొడవలకి నీకు సంబంధం లేదు. కాని స్వప్నం నీ మనస్సులోనే జరిగింది కదా! అంటే కలలోంచి చూస్తే కల నిజం. మెలకువ వచ్చాక చూస్తే కల అబద్ధం.

ముందేమన్నాడు? నాలోంచి మీరు వచ్చారు అన్నాడు. అంటే కలలో నిజం లాంటిది. మెలకువ వచ్చేసరికి అదంతా అబద్ధం అని తేలింది. అందుకే భూతములు నాయందు లేవు అన్నాడు. కల జరిగే కాలంలో కలలోని విషయాలన్ని నిజమే. మెలకువ వచ్చాక అవి నిజం కాదు. అలాగే నీకు జ్ఞానోదయం కలిగాక అసలు ఆ శరీరాలకి, ఆ గొడవలకి నీకు ఏమీ సంబంధం లేదని తెలుస్తుంది. ఆ జ్ఞానం కలిగినవాడు కనుక భూతములు నాయందు ఉండునవి కాదు అని చెబుతున్నాడు.

## (5) కల్పితములు

**"వస్తుతత్త్వం తెలిసిన ఈశ్వరుడు (శ్రీకృష్ణుడు) 'నేను ఈ భూతములలో లేను", ఈ భూతములు కూడా నాలో ఉన్నవి కాదు' అని చెప్పెను."** (వివేకచూడామణి–235)

ఇక్కడ కృష్ణుడు కృష్ణుడిగా చెప్పలేదు, వస్తుతత్త్వం తెలిసిన ఈశ్వరుడిగా అంటే చైతన్యంగా చెప్పాడని అర్థం.

ఇక్కడ మనం ఎలా అర్థం చేసుకోవాలంటే చైతన్యం తప్పించి మిగతావన్నీ కల్పితాలే. భూతములు, చైతన్యంలో లేవు. భూతములన్నీ చైతన్యంలో కల్పించబడ్డాయి. ఈ సృష్టి అంతా చైతన్యంలో కల్పించబడిందే!

ఉదాహరణకి నువ్వు మంచం మీద పడుకొని ఉన్నావు. పడుకున్నప్పుడు ఎక్కడెక్కడో కాశీ, రామేశ్వరం వెళ్ళి వచ్చినట్టు కల వస్తుంది. అలా వెళ్ళి వచ్చినప్పుడు నీ శరీరం మంచం మీదే ఉంది. అవన్నీ మనస్సు కల్పించింది. నీకు మెలకువ రాగానే నేను ఎక్కడికి వెళ్ళలేదు. ఇక్కడే ఉన్నాను అనిపిస్తుంది. కానీ కలలో ఎక్కడెక్కడో తిరిగి వచ్చాను అనిపిస్తుంది. ఈ శరీరం వెళ్ళలేదు, స్వప్నశరీరం వెళ్ళింది.

ఈ జన్మలు కూడా అంతే. మీకు తత్త్వం తెలిసింది అనుకోండి. ఈ శరీరాలన్నీ కల్పితాలని తెలుస్తుంది. అయితే, ఇందులో రహస్యం ఏమిటంటే, ఈ శరీరం మళ్ళీ పుట్టదుగానీ ఈ శరీరంలో వాసనలు మళ్ళీ పుడతాయి. ఈ శరీరాన్ని కాల్చేస్తున్నారు కదా, ఎలా పుడుతుంది? శరీరంలోని వాసనలు పుడతాయి. వాసనలు శరీరాల్ని మారుస్తున్నాయంతే. వాసనలే పుడుతున్నాయి. వాటికేదో శరరీం ఉండాలి కాబట్టి ఈ పాత శరీరాన్ని వదిలేసి కొత్త శరీరాన్ని పట్టుకుంటాయి. అంటే, జీవకోటి ఆత్మయందు కల్పించబడ్డాయి. అవి ఆత్మయందు లేవు, కల్పించబడ్డాయి.

మనం పుడుతున్నాం, చనిపోతున్నాం. మంచి జన్మలు వస్తున్నాయి, చెడు జన్మలు వస్తున్నాయి. చాలా బాధలు పడ్డాం అనుకుంటున్నాం. సుఖపడ్డవాళ్ళు సుఖపడ్డాం అనుకుంటున్నారు. కొంతమంది మాకొచ్చిన కష్టాలు ఎవరికీ రాకూడదు అంటారు. ఇవన్నీ 'నేను' కల్పితాలు. 'నేను' అనేది మనస్సులో వచ్చే మొదటి తలంపు. ఆ తలంపులోంచి ఇతర తలంపులు కల్పించబట్టి శరీరాలు వస్తున్నాయి. ఆ 'నేను' కూడా కల్పించబడింది కాబట్టే లోపల తత్త్వం తెలుసుకొన్నప్పుడు ఆ 'నేను' లేనని తెలుస్తోంది.

ఇది ఉన్నప్పుడు, అది కనబడదు. అది ఉన్నప్పుడు, ఇది కనబడదు. అంటే పాము కనిపించినప్పుడు, తాడు కనిపించదు. తాడు కనిపించినప్పుడు, పాము కనిపించదు. ప్రపంచం కనిపించినప్పుడు, బ్రహ్మము కనిపించదు. బ్రహ్మము కనిపించినప్పుడు, ప్రపంచం ఇక ఉండదు.

Except truth everything is created by the mind. సత్యం తప్ప మిగతాది అంతా ఈ మనస్సు సృష్టించిందే. అయితే మూర్ఖులు దేహమే ఆత్మ అనుకుంటారు. కాస్త తెలివైనవాళ్ళు మనసే ఆత్మ అనుకుంటారు. బాగా తెలివైనవాళ్ళు బుద్ధితో తాదాత్మ్యం చెందుతారు. ముగ్గురూ అజ్ఞానంలోనే ఉన్నారు. Grades తేడా, అంతే.

వాసనలే మరల మరల జన్మించడానికి కారణం. నీకు రోజూ సినిమా చూసే అలవాటు ఉందనుకో. ఈ ముసలి శరీరం చూడలేదు, కళ్ళు చూడనివ్వవు కదా! కోరిక ఉండడంచేత శరీరం మార్చేసి ఇంకో కొత్త శరీరంతోటి చూస్తావు. అప్పుడు నువ్వు రోజూ సినిమాలకి వెళ్ళవచ్చు!

చైతన్యం హృదయంలో ఉంది. దానికి చావు పుట్టుకలు లేవు. చైతన్యం అనుభవంలోకి వచ్చినప్పుడు వేలాది జన్మలు, ఈ కష్టసుఖాలు అబద్ధాలు అని తెలుస్తుంది. ఏమీ లేనిదానికి ఏంటి ఇంత బాధపడిపోయాను అనిపిస్తుంది. మనస్సు అనే తెర తొలగింపబడేవరకు అన్నీ ఉన్నట్టు అనిపిస్తుంది.

## (6) జగత్తు, జీవుడు, ఈశ్వరుడు

రమణులు చెప్పారు: జగత్తు, జీవుడు, ఈశ్వరుడు చైతన్యంలో కల్పించబడ్డాయి; తాడులో పాము కల్పించబడినట్టు. తాడులో పామును నువ్వు చూస్తున్నావు కాని తాడుకి పాముకి సంబంధం లేదు. ఇదంతా భ్రాంతి అంటారు.

ఇప్పుడు మనస్సే నువ్వు అనుకొంటున్నావు. మరి నిద్రలో నువ్వు మనస్సునుండి వేరు ఎందుకు అవుతున్నావు? శరీరం ఎక్కడుంది? మనస్సులో ఉంది. నీకు నిద్రలో ఈ ప్రపంచం గొడవ ఏమన్నా ఉందా? ప్రపంచం ఎక్కడ ఉంది? మనస్సులో ఉంది. మనస్సు వచ్చాక ఏవి వస్తున్నాయో అవన్నీ మనస్సు కల్పితాలు.

సెక్స్ ఎక్కడినుండి వస్తోంది? మనస్సు వచ్చాక సెక్స్ వస్తోంది. మనస్సు లేనప్పుడు గాఢ నిద్రలో సెక్స్ ఎక్కడ ఉంది? సెక్స్ వాస్తవానికి లేదు, మనస్సులో ఉంది.

ఇక్కడ సిద్ధాంతం ఏమిటంటే, మనస్సు ఎంత నిజమో, మనస్సుచే కల్పించబడినవి కూడా అంతవరకే నిజం.

రమణులు చెప్పింది గుర్తు పెట్టుకోవాలి. నేను అనేది మూలతలంపు. ఆ మూలతలంపులోంచి ఇతర తలంపులు వస్తున్నాయి. నిద్దట్లోంచి మెలకువ రాగానే చూస్తే – ముందు 'దేహం నేను' అనే తలంపు వచ్చేస్తుంది. ఆ తరువాత స్త్రీవా, పురుషుడివా, నీ ఉద్యోగం, ఆఫీసుకు ఎన్నింటికి వెళ్ళాలి మొదలైన మిగతా తలంపులన్నీ ఇంజను వెనకాల బోగీలు వచ్చినట్టుగా వరసగా వచ్చేస్తాయి.

అయితే ఇక్కడ వైష్ణవులు, హరేకృష్ణ వాళ్ళు చాలా పెద్ద పెద్ద చదువులు చదువుకున్నవాళ్ళు కూడా ఒప్పుకోరు. "జగత్తు జీవుడు సరే గాని, ఈశ్వరుడిని కూడా కేవలం మన తలంపు అంటే ఎలా?" అంటారు.

రమణులు సత్యం చెప్పారు. మనకి అర్థం కాకపోతే వదిలి వేయవచ్చు. ఈశ్వరుడిని కుందేటి కొమ్ము అని చెప్పడం లేదు. అలాగే, ప్రపంచం కూడా కుందేటి కొమ్ము అని చెప్పడం లేదు. మనస్సు వచ్చాక ఇవన్నీ వచ్చాయి. మనస్సు లేనప్పుడు ఇవి లేవు. కుందేలుకి కొమ్మే లేదు.

ప్రపంచం కనిపిస్తోంది. దేవుడు కనిపిస్తున్నాడు. నీకు కనబడకపోయినా దేవుడు రామదాసులాంటి వాళ్ళకి కనబడ్డాడు కదా! రామదాసుగారికి రాముడి దర్శనం అయిందా అని మనం ఆశ్చర్యపోతాం.

రమణులు అది చాలా తేలికగా తీసుకుంటారు. ఆయన ఏం అంటారంటే రామదాసుగారు రాముడిని చూసి ఉండవచ్చు. పోనీ, నిజంగా రాముడు నీకు కనిపించాడు. నీ దగ్గర ఎంతసేపు కూర్చుంటాడు? కొంతసేపు ఉండి వెళ్ళిపోతే ఏం ప్రయోజనం?

తత్త్వం దగ్గరికి వెళితే, ఇవేమీ లేవు. అక్కడ ఆనందం ఉంది అంతే. మనకి తెలిసినా ఉన్నాం, తెలియకపోయినా ఉన్నాం. తేడా ఏమిటంటే – తెలుసుకుంటే ఆనందం వస్తుంది; శాంతి, అలౌకిక సుఖం వస్తుంది. తెలుసుకుంటే సుఖం, తెలియకపోతే దుఃఖం!

## (7) బుడగలో నీరు

బుడగలో నీరు ఉంది. నీటిలోనే నీరును చూస్తాను, బుడగలో నీరును చూడను అంటే మనం సమగ్రంగా చూడలేకపోతున్నాం అన్నమాట! ఆ బుడగ ఎలా తయారైంది? నీటితోనేగా తయారైంది!

వైకుంఠంలో ఉన్న దేవుడినే చూస్తాను, నీలో ఉన్న దేవుడిని నేను చూడనంటే, కనిపిస్తున్న మనుషుల్లోనే దేవుడు నీకు కనబడనప్పుడు, అవ్యక్తంగా ఉన్న దేవుడు నీకు ఎలా కనిపిస్తాడు? అవ్యక్తం అంటే కనబడనిది కదా, అక్కడ దేవుడిని ఎలా చూస్తావు నువ్వు? నేను బుడగనే చూస్తాను, బుడగలోని నీరును గుర్తించను అంటే ఎలా? ఈ మాటలు వింటూ ఉంటూనే మీకు అసలు realisation వచ్చెయ్యాలి.

స్వామి రామతీర్థ పూర్వపు రోజుల్లో లెక్కలు బాగా చేసేవాడు. ఆయన పంజాబ్ యూనివర్సిటీకి వెళ్ళినప్పుడు అక్కడ లెక్కల్లో ఫస్ట్. ఆయన ఒకసారి ఇంటిపై కూర్చొని అంతా బ్రహ్మమే, అంతా బ్రహ్మమే అనుకుంటున్నాడు. ప్రక్కన ఒకడు అంతా బ్రహ్మమే కదా పైనుంచి కిందకు దూకరా అన్నాడు. నాకు దూకడానికి అభ్యంతరం లేదు, కింద కూడా బ్రహ్మము ఉన్నాడు కదా! బ్రహ్మము లేని చోటు చూపించితే అప్పుడు దూకుతాను అన్నాడు.

ఏనుగును ఒక మావటివాడు తోలుకొస్తున్నాడు. అంతా బ్రహ్మమే, అంతా బ్రహ్మమే అని ఏనుగుకు ఎదురుగా వెళ్ళిపోతున్నాడు ఒకడు. తొండంతో ఆ ఏనుగు వీడిని కొట్టేస్తుందని మావటివాడు పక్కకు తప్పుకోరా, పక్కకు తప్పుకోరా అని అంటున్నాడు. వీడు అంతా బ్రహ్మమే కదా అన్నాడు. ఆ ఏనుగు ఒకటే బ్రహ్మమా? నిన్ను పక్కకు తప్పుకోమని చెబుతున్న నేనూ బ్రహ్మమే కదా అన్నాడు ఆ మావటివాడు. అది common sense.

మీరు గ్రహించవలసిన విషయం ఏమిటంటే, బుడగ కల్పితం. కాని అందులో నీరు మటుకు కల్పితం కాదు. నీరు బుడగగా వ్యాప్తమైంది. బుడగను బుడగగా చూడకు, నీరుగా చూడు.

రూపనామాలు కల్పితం. ఈ రూపనామాలు ధరించిన వాడెవడు? ఈశ్వరుడు. అందుచేత ఎవర్ని చూసినా వాళ్ళ లోపలనున్న ఈశ్వరుణ్ణి చూడాలి.

శంకరాచార్యులవారిని ఒకచోట చాలా మంది తప్పుగా అర్థం చేసుకుంటారు. ఆయన్ని ఎందుకు విమర్శిస్తారంటే వాళ్ళకి ఆయన చెప్పిన ఆ మూడో మాట తెలియదు. బ్రహ్మము సత్యం, జగత్తు మిథ్య. ఈ రెండు వాక్యాలే కాదు, మూడో వాక్యం కూడా ఉంది! జగత్తు బ్రహ్మముగా సత్యం అనే మూడో వాక్యం కూడా ఆయన చెప్పారు.

ఇప్పుడు గొలుసుంది. ఈ గొలుసు ఎలా వచ్చింది? బంగారంలోనే గొలుసు కల్పించారు. అందుచేత అది బంగారంగా నిజం, గొలుసుగా నిజం కాదు.

బుడగ బుడగగా సత్యం కాదు, నీరుగా సత్యమే. నువ్వు బుడగలో ఉన్న నీరును చూస్తుంటే ఇంక బుడగ ఎక్కడుంది? నీ రూపం అనేది బుడగలాంటిది అంతే. ఆ రూపం ధరించింది ఈశ్వరుడే. నీ రూపనామాలు పక్కనబెట్టి నీలో ఉన్న ఈశ్వరుణ్ని చూస్తే ఇంక నువ్వెక్కడున్నావు?

Every name and form is a cause of trouble. నామరూపాలే అసలు ఇబ్బంది. నామరూపాల్ని చూసినపుడు చైతన్యాన్నే చూస్తే నువ్వెక్కడా బంధింపబడవు.

## మననం చేయదగిన వాక్యాలు

(1) అనసూయుడు అంటే అసూయ లేనివాడు. మీలో ఉన్న అజ్ఞానం అసూయ కింద మారుతోంది. దానిని పోగొట్టుకోవాలనుకోవడం జ్ఞానం.

(2) స్వప్నావస్థ, జాగ్రదవస్థ మరియు సుషుప్తి అవస్థ అనే ఈ మూడు అవస్థలు చైతన్యంలో కల్పించబడ్డాయి.

(3) చైతన్యం తప్పించి మిగతావన్నీ కల్పితాలే! ఈ సృష్టి అంతా చైతన్యంలో కల్పించబడినదే!

(4) ప్రపంచం కనిపించినప్పుడు, బ్రహ్మము కనిపించదు.
బ్రహ్మము కనిపించినప్పుడు, ప్రపంచం ఇక ఉండదు.

✹✹✹

# 15. బింబం - ప్రతిబింబం

కొత్తగూడెం,
09-05-2010.

**ప్రశ్న:** శ్రీనాన్నగారికి ప్రణామములు. బింబం, ప్రతిబింబం మొదలగువాటిని ఉదహరిస్తూ స్వరూపమును తెలుసుకోవడం గురించి శ్రీశంకరాచార్యులవారు వివేకచూడామణిలో 220 నుండి 223 శ్లోకములలో చెప్పినదానిని దయచేసి వివరించవలసినదిగా ప్రార్థన.

**శ్రీనాన్నగారు:**

**"కుండలోనున్న నీటిలో సూర్యుని ప్రతిబింబమును చూచిన మూఢుడు అదే సూర్యుడు అనుకుంటాడు. అలాగే మూర్ఖుడు ఉపాధియందు కనిపించుచున్న చిదాభాసను భ్రాంతిచేత నేనే అని అనుకుంటున్నాడు."** (వివేకచూడామణి-220)

ప్రతిబింబం సూర్యుడిదే కాని ప్రతిబింబమే సూర్యుడు కాదు. అలా ప్రతిబింబాన్నే సూర్యుడు అనుకునేవాడు మూఢుడు. అద్దంలో నీ ముఖ ప్రతిబింబాన్ని చూసి అదే నీ ముఖం అనుకోవడం కూడా ఇలాంటిదే.

చిదాభాస అంటే చిత్తు యొక్క ప్రతిబింబం. అంటే ఆత్మ యొక్క ప్రతిబింబం అని అర్థం. జీవుడిని చిదాభాసుడు అంటారు. నువ్వు ఆత్మ అయినప్పటికి, ఉపాధి సంబంధం వలన అంటే ఈ దేహంతో సంబంధం వలన దేహమే నేను అనుకుంటున్నావు.

నువ్వు ఆత్మవు అంటున్నారు, అదెందుకో చూద్దాం. ఆత్మకు చావులేదు, అదెప్పుడూ ఉంటుంది. అందుకే నువ్వు చావు కోరుకోవడం లేదు. ఆత్మలో జ్ఞానం ఉంది, నువ్వు కూడా జ్ఞానాన్నే కోరుకుంటున్నావు, అజ్ఞానాన్ని కోరుకోవటం లేదు. ఆత్మలో ఆనందం ఉంది, నువ్వు ఎప్పుడూ ఆనందాన్నే కోరుకుంటున్నావు. అంటే నువ్వు ఆత్మనే కోరుకుంటున్నావు.

నీ లోపల ఉన్న నిజాన్ని ఆత్మ అంటారు. అంతటా వ్యాపించియున్న దానిని బ్రహ్మము అంటారు. నీ లోపల ఉన్న ఆత్మను తెలుసుకున్నాక అంతటా వ్యాపించియున్న బ్రహ్మము, ఆత్మ ఒకటేనని తెలుస్తుంది.

మన హృదయంలో ఆత్మ “నిజమైన నేను”గా ఉంది. అయితే ఈ ఉపాధి సంబంధం వలన మనకి ఆ నిజమైన నేనే జీవుడుగా వ్యక్తం అవుతున్నాడు. దేహంతో తాదాత్మ్యం లేకపోతే జీవుడు లేడు. నిద్రలో జీవుడు ఎక్కడున్నాడు? లేడు కదా! నీకు ఉపాధి సంబంధం వచ్చేసరికి ఆ ప్రతిబింబం వస్తోంది. ప్రతిబింబం నిజమా, అబద్ధమా? అబద్ధం. అందుచేత దానిని “మిథ్యా నేను” అన్నారు. ఆ ప్రతిబింబాన్నే భ్రాంతివలన అంటే అజ్ఞానంవలన నేను అనుకుంటున్నాం. ఆ తరువాత ఆచార్యులవారు ఏం చెబుతున్నారో చూద్దాం.

**“బుద్ధిమంతుడు, ఉదాసీనుడు కుండనీ, నీటినీ, అందులోని సూర్యుని ప్రతిబింబాన్ని విడిచిపెట్టి ఈ మూడింటిని ప్రకాశింపచేయు సూర్యుడిని చూడగలుగుతాడు.**”

(వివేకచూడామణి–221)

**“అదే విధంగా దేహమును, బుద్ధిని, చిత్తు యొక్క ప్రతిబింబమును విడిచి ద్రష్టయు, అఖండ బోధం, సర్వ ప్రకాశం, సదసద్విలక్షణం, నిత్యం, విభుం, సర్వగతం, సుసూక్ష్మం, అంతర్భహిః శూన్యం, బ్రహ్మముకంటే వేరు కానిది అగు తన స్వరూపమును తెలుసుకొని పురుషుడు పాపరహితుడై, రజోగుణం లేనివాడై, మరణం లేనివాడు అవుతాడు.**”

(వివేకచూడామణి–222, 223)

నువ్వు బుద్ధిమంతుడవని, నీ లోపల ఉన్న అంతర్యామి అనుకోవాలి. నీకు ఆయన అక్షింతలు వెయ్యాలిగానీ, నీ అంతట నువ్వే వేసేసుకుంటే ఎలాగ? గీతలో కృష్ణుడు కర్తృత్వం లేకుండా కర్మచేసినవాడు బుద్ధిమంతుడు అని చెప్పాడు. అంటే, కర్త లేని కర్మ చేయువాడు బుద్ధిమంతుడు. పని కనబడాలి కాని, పని చేసేవాడు కనబడకూడదు. వాడు బుద్ధిమంతుడు.

ఉదాసీనుడు అంటే ఈ మూడింటికంటే వేరుగా ఉన్నవాడు అని అర్థం. కుండని, కుండలోనున్న నీటిని, సూర్యుడి ప్రతిబింబాన్ని, ఈ మూడింటిని సూర్యుడే ప్రకాశింపచేస్తున్నాడు. సూర్యుడు వాటిని ప్రకాశింపచేయడం వల్ల అవి అక్కడ ఉన్నాయని నీకు తెలుస్తోంది. అలా సూర్యుడు ప్రకాశింపచేయకపోతే అక్కడ కుండ ఉన్నా నీకు తెలియదు కదా!

కుండ, నీరు, ఆ నీటిలో ఉన్న సూర్యుడి ప్రతిబింబం – ఈ మూడింటికంటే వేరుగా ఉండి, ఆ మూడింటిని ప్రకాశింపచేస్తూ, తనను తాను ప్రకాశింపచేసుకునే వాడైన సూర్యుడిని తెలుసుకునేవాడు బుద్ధిమంతుడు అని ఆచార్యులవారు చెబుతున్నారు.

దృష్టాంతం చెప్పాక శంకరులు ఇక అసలు విషయానికి వస్తున్నారు. అక్కడ కుండలాగా ఇక్కడ దేహం ఉంది. అక్కడ నీరులాగా ఇక్కడ బుద్ధి ఉంది అంటున్నారు. ఆ నీటిలో సూర్యుని ప్రతిబింబం ఉన్నట్టే, మన బుద్ధిలో చిత్తు యొక్క ప్రతిబింబం ఉంది కదా!

ఈ ప్రపంచం అంతా చైతన్యం వ్యాపించి ఉంది కాబట్టే ప్రపంచం జడవస్తువైనా మనకు ప్రపంచం తెలుస్తోంది. చైతన్యం లేకపోతే ప్రపంచం ఉన్నా మనకు కనబడదు. సృష్టి అంటే కల్పితం. ఈ సృష్టి అంతా చైతన్యంలో ఉంది. నీకు ఆ కుండ సూర్యుడివలన కనిపిస్తోంది. అలాగే ఈ ప్రపంచం, ఈ ప్రపంచంలో ఉన్న దేహం, బుద్ధి, ఆ బుద్ధిలో ఉన్న చిత్తుయొక్క ప్రతిబింబం అన్నీ కూడా ఆ చైతన్యంయొక్క ప్రకాశంవలన మనకు కనిపిస్తున్నాయి.

దేహమును, బుద్ధిని, చిత్తు యొక్క ప్రతిబింబమును మూడింటిని ప్రకాశింపచేస్తూ సర్వసాక్షిగా ఉన్నది చైతన్యం! ఇంకా '**అఖండ బోధం**' అన్నారు. అంటే దేనివలన మిగిలిన జ్ఞానం అంతా సాధ్యం అవుతుందో అది నిజమైన జ్ఞానం. అది వస్తు విషయజ్ఞానాలు లాగా విడివిడిగా ఉండదు. అన్నింటిని దాని వలననే మనం తెలుసుకోగలగుతాం కాబట్టి అది అఖండం.

ఆ చైతన్యమే అంతటినీ ప్రకాశింపచేస్తుంది కాబట్టి దానిని '**సర్వప్రకాశం**' అన్నారు. తరువాత '**సదసద్విలక్షణం**' అన్నారు. ప్రత్యక్షములు (సత్) అంటే మనకు స్థూలంగా కనిపించే నీరు, నిప్పు, అన్నములకంటే, అప్రత్యక్షములు (అసత్) అంటే మనకి ప్రత్యక్షముగా కనిపించని వాయువు, ఆకాశం కంటే వేరైనదని అర్థం.

ఇంకా చైతన్యం గురించి ఆచార్యులవారు వర్ణించారు. '**నిత్యం, విభుం**' అంటే దేశకాలములచే పరిమితం కానిది అని అర్థం. '**సర్వగతం**' అంటే అన్నింటిలో ఉన్నదని, సుసూక్ష్మం అంటే చాలా సూక్ష్మమైనదని చెబుతున్నారు.

ఇంకా, '**అంతర్బహిః శూన్యం**' అన్నారు. అంటే, ఆ చైతన్యం అంతటా వ్యాపించి ఉంది కదా! ఇక అటువంటప్పుడు దానికి లోపల, బయట అనేది లేనిది అని అర్థం.

దేహం, బుద్ధి, చిత్తు ప్రతిబింబమైన జీవుడు – వీటిని కాకుండా వీటన్నింటికి ఆధారంగా ఉన్న ఆ చైతన్యాన్ని తెలుసుకున్నవాడు బుద్ధిమంతుడు. నువ్వు ఈ ప్రపంచంలో నామరూపాలను చూడకుండా, ఏ చైతన్యం ఉండడంవలన ఈ ప్రపంచం తెలియబడుతూ ఉందో, ఆ చైతన్యాన్ని తెలుసుకుంటే, నువ్వు బుద్ధిమంతుడివి.

నీకు కుండ కనిపిస్తోంది. కుండలో నీరు కనిపిస్తోంది. ఆ నీటిలో సూర్యుని ప్రతిబింబం కనిపిస్తోంది. ఎవడు ఉండడంవలన ఇవన్నీ కనిపిస్తున్నాయో, వాడిని తెలుసుకోమని చెబుతున్నారు.

గోడ జడం అంటాం, జడం అంటే ఏమిటి? ఏ వస్తువుకైతే తానున్న సంగతి తనకు తెలియదో అది జడం. లోకం కూడా జడం అంటారు. అదేమిటండీ, లోకం ఉంది కదా, జడం అంటారేమిటి అంటారు కొందరు. లోకం ఉందని నువ్వు చెబుతున్నావు, కాని నేను ఉన్నానని లోకం ఎప్పుడైనా చెప్పిందా? అంటే ఏ చైతన్యమైతే సృష్టి అంతా వ్యాపించబడి ఉందో దానివలన లోకం ఉందని తెలుస్తోంది కాని, లేకపోతే లోకం ఉన్నట్టు కూడా నీకు తెలియదు.

నీకు అశాంతి ఎందుకు వస్తోంది అంటే అసత్యమైన ప్రపంచాన్ని సత్యం అనుకుంటున్నావు. అక్కడినుండి నీకు అశాంతి ప్రారంభం. ఆత్మ ఏమిటో తెలిసాక ప్రపంచాన్ని సత్యవస్తువుగా చూడడం మానేస్తావు. ఆత్మజ్ఞానమే అమృతత్వం. అమృతత్వమే మోక్షం.

వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని రమణమహర్షితో అంటే "అసలు సత్యానికి వాటికి సంబంధం లేదు, వాళ్ళ గొడవ నీకు ఎందుకు? నువ్వు ఈ లోకంలోకి వచ్చిన పని చూసుకో" అనేవారు. ఇప్పుడు కొత్తగూడెంలో రమణగారిని చూడడానికి వచ్చాం. ఈ ఊరులో ఎవరైనా తెలిసినవారు కనిపిస్తే పలకరించవచ్చు. వాళ్ళని పలకరించి వాళ్ళతో మాట్లాడి రమణగారిని చూడకుండా వెళ్ళిపోతే వచ్చిన పని వదిలేసినట్లే కదా! అలాగే ఈ లోకంలోకి నువ్వు వచ్చిన పని ఏమిటి? నిన్ను నువ్వు తెలుసుకోవటం. ఆ అసలు పని మానేయ్యకూడదు.

నిన్ను నీవు తెలుసుకోవడానికి లోకం సహకరిస్తుంది. అదెలాగంటే – అద్దంలో చూసుకుంటాం. ముఖం మీద మసి ఉందనుకో, ఆ మసి అద్దం తీయదు. అద్దం చూపిస్తుంది. మనమే తీసేసుకోవాలి. అద్దం మంచిది కాదు, చెడ్డది కాదు.

అలాగే, లోకం మంచిదికాదు, చెడ్డది కాదు. నీలో ఉన్న బలహీనతలు, మంచి గుణాలు లోకం చూపిస్తూ ఉంటుంది. ఆ బలహీనతలను నువ్వే అధిగమించాలి. నిన్ను నీవే ఉద్ధరించుకోమని కృష్ణభగవానుడు చెప్పాడు కదా!

సాధనలో ముఖ్యమైనది దేహబుద్ధిని వదులుకోవడం, ఆత్మబుద్ధిని పెంచుకోవటం.

నీకు దేహబుద్ధి ఎలా తగ్గుతుంది? Impersonal life వల్ల తగ్గుతుంది. లేకపోతే తగ్గదు. అంటే నువ్వు పనిచేస్తూ ఉండాలిగాని, నువ్వు కనబడకూడదు. బుద్ధుడిది most impersonal life. బుద్ధుడు ఈ లోకానికి వచ్చి వెళ్ళిపోయాడన్న గుర్తు అవసరం లేదన్నాడు. ఈ ప్రపంచంలోకి వచ్చావు, ఏ రకంగా జీవిస్తే మళ్ళీ ఈ ప్రపంచంలోకి రానక్కర్లేదో, అలా impersonal గా జీవించాలి. అంటే **నువ్వు పని చేసినా, చెయ్యనివాడితో సమానం అవ్వాలి**.

తలంపు, మాట, చేతలలో పవిత్రతను కాపాడుకోవాలి. చెడు తలంపులు వస్తే 'మిథ్య నేను'ను అంటే 'దొంగ నేను'ను పెంచేస్తాయి, మంచి తలంపులు వస్తే 'నిజమైన నేను'కి దారి చూపిస్తాయి. ఋగ్వేదంలో ఒకమాట ఉంది: నీ హృదయంలోకి అన్ని వైపులనుండి గొప్ప తలంపులు రావాలని. మన తలంపులను బట్టి మన మాట, చేతలు ఉంటాయి.

దేహబుద్ధిని తగ్గించుకోవడానికి మనస్సు, వాక్కు, శరీరం అనే మూడు సాధనాలను ఉపయోగించుకోవాలి. ఈ మూడింటిని సాత్వికంగా ఉంచాలి. తినే తిండి దగ్గర జాగ్రత్తగా ఉండాలి. అవసరం లేకుండా మాట్లాడితే అహం పెరిగిపోతుంది.

ఇప్పుడు అద్దం పగిలిపోతే ఆ ప్రతిబింబం ఉండదు. బింబంలో కలిసిపోతుంది. అలాగే చెరువులో నీళ్ళు లేకపోతే అక్కడ ప్రతిబింబం ఉండదు, బింబంలో కలిసి పోతుంది కదా! దేహం నేననుకునే బుద్ధిపోతే ఈ ప్రతిబింబం కూడా బింబంలో అంటే చైతన్యంలో కలిసిపోతుంది కదా!

నువ్వు చైతన్యంలో ఐక్యం అవ్వాలి. అందుకు విసుగు లేకుండా శ్రవణం చెయ్యాలి. మంచి ఆచార్యులవారిని ఆశ్రయించాలి. ఆత్మగురించి శ్రవణం చెయ్యగా చెయ్యగా దాన్ని పొందాలనే బుద్ధి కలుగుతుంది. ఆ ఆత్మజ్ఞానం కలగనంతవరకు నీకు అశాంతి, దుఃఖం తప్పదు.

కొంతమంది వైష్ణవులు మాకు ఐక్యం వద్దండీ, అలా అయితే మాకు సంతోషం ఏం ఉంటుంది అని అంటారు. ఆ సద్వస్తువుని నువ్వు పొందాక ఇతరులు అక్కర్లేదు. ఇతరులు వచ్చేసరికి మళ్లీ సెపరేషన్ (వేరు అవడం) వస్తుంది. **మీకు ఇతరులవలన ఏ రకమైన సంతోషం వచ్చినా, ఏదో ఒక రోజున అది దుఃఖం కింద మారిపోతుంది.**

మరి కొంతమంది వైష్ణవులు భగవద్గీతని కృష్ణుడు జీవుడికే బోధ చేసాడు కదా, మరి జీవుడు లేడంటే ఎలా కుదురుతుంది అంటారు. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే ఆ జీవుడికి వాడెవడో తెలియడం లేదు. వాడు జీవుడిగా నిజం కాదు, వాడెవడో వాడికి తెలియచెప్పడానికి కృష్ణుడు జీవుడికి బోధ చేసాడు. జీవుడు వ్యవహారిక సత్యమే గాని పారమార్థిక సత్యం కాదు. అంటే జీవుడు సత్యం అయితే, బోధ చేసినా పోడు కదా!

దేహం ఉండగా 'దేహమే నేను' అనే బుద్ధి పోతే, ప్రతిబింబం లేదు, అంటే జీవుడు లేడు.

ఒకసారి నీకూ పుట్టుక లేదు, నాకూ పుట్టుక లేదు అంటాడు కృష్ణుడు అర్జునుడితో. ఒకసారి నువ్వు, నేనూ చాలాసార్లు పుట్టాం అంటాడు. ఇందులో ఏది నిజం అంటే పుట్టడం అనేది వ్యవహారికంగా ఉంది. పారమార్థికంగా చూస్తే ఆత్మ పుట్టదు కదా! గురువు నిన్ను అజ్ఞానిగా చూడడు. నీ లోపల జ్ఞానం ఉంది. అది నీకు తెలియబడడం లేదు కాబట్టి అందుకు అవరోధాలు తొలగిస్తాడు.

## మననం చేయదగిన వాక్యాలు

(1) కర్త లేని కర్మ చేయువాడు బుద్ధిమంతుడు.

(2) అసత్యమైన ఈ ప్రపంచాన్ని సత్యం అనుకుంటున్నావు. అక్కడినుండి నీకు అశాంతి ప్రారంభం. ఆత్మజ్ఞానమే అమృతత్వం.

(3) ఈ లోకంలోకి నువ్వు వచ్చిన పని ఏమిటి? నిన్ను నువ్వు తెలుసుకోవడం. ఆ అసలు పని మానెయ్యకూడదు.

(4) సాధనలో ముఖ్యమైనది దేహబుద్ధిని వదులుకోవడం.

✷✷✷

# 16. ఉన్నదే బ్రహ్మం

కొత్తగూడెం,
09-05-2010.

ప్రశ్న: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు ఇలా అన్నారు:

**స్వయం బ్రహ్మ స్వయం విష్ణుః స్వయమింద్రః స్వయం శివః !**
**స్వయం విశ్వమిదం సర్వం స్వస్మాదన్యన్న కించన !!**

**తానే అనగా ఆత్మయే బ్రహ్మ, ఆత్మయే విష్ణువు, ఆత్మయే ఇంద్రుడు, ఆత్మయే శివుడు, ఈ విశ్వం సర్వం ఆత్మయే. ఆత్మకంటే భిన్నమైనది ఏదియూ లేదు.**

(వివేకచూడామణి - 389)

దయచేసి ఈ శ్లోకంపై వ్యాఖ్యానించవలసినదిగా ప్రార్థన.

**శ్రీనాన్నగారు:**

మనం ఏ వస్తువునైతే తెలుసుకుందాం అనుకుంటున్నామో ఆ సద్వస్తువుకు అంటే ఆ ఆత్మకు నామరూపాలు లేవు. కాబట్టి నామరూపాలు లేనిదానికి వాటిని కల్పించి, ఆ రూపాన్ని ఆరాధిస్తున్నాం. మనం నిన్న వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళాం. నువ్వు ఆ వేంకటేశ్వరస్వామిని చూసినప్పుడు దేవుడి భావన వస్తోంది కదా! అక్కడ వేంకటేశ్వరస్వామిని పూజించినా వాస్తవానికి మనం ఆత్మనే పూజిస్తున్నాం.

వేంకటేశ్వరస్వామిని చూసేసరికి నీకు దైవభావన వస్తోంది. అప్పుడు ఆ భావనతోటి ఆయనకి అర్చన చేయడంవలన నీకు ఇతర తలంపులు తగ్గిపోతాయి. నీ మనస్సు ఆ రూపాన్ని, ఆ నామాన్ని పట్టుకుంటోంది. ఆత్మనే అక్కడ వేంకటేశ్వరుడి రూపంలో ఆరాధిస్తున్నావు.

అసలు మనిషిని బంధించేది రూపబుద్ధి, నామబుద్ధి. నీ ఇష్టదైవాన్ని రూపనామాలతో ప్రారంభంలో ఆరాధించినా, క్రమేపి రూపనామరహిత దైవంమీద ఇష్టం పెరుగుతుంది. ఆ రకంగా సత్యాన్వేషణకి నీ మనస్సు తయారవుతుంది.

నీ మనస్సుకి నిగ్రహం వచ్చి ఆత్మ చింతనచేయడం కోసం విగ్రహారాధన పెట్టారు. "నువ్వు బ్రహ్మ అన్నా, విష్ణువు అన్నా, ఇంద్రుడు అన్నా శివుడు అన్నా ఆత్మే! నీకు ఎలా కనిపించినా, నువ్వు ఎలా అనుకున్నా, అక్కడ ఉన్నది ఆత్మే!

ఈ కనిపించే ప్రపంచం అంతా కూడా ఆత్మే! అందుకే ఆచార్యులవారు "**బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య, జగత్తు బ్రహ్మముగా సత్యం**" అన్నారు.

ఇంకా ఆత్మ అంటే ఎవ్వరో, ఏదో కాదు, స్వయం – నువ్వే ఆత్మ అన్నారు. రమణమహర్షిగారు ఏమన్నారంటే ముందు "నిన్ను" చూసుకొని తరువాత లోకాన్ని చూడు అన్నారు.

బంగారంలో ఆభరణాలు కల్పించినట్టు, నువ్వు ఉపాసన కోసం చైతన్యంలో దేవతలందరినీ కల్పిస్తున్నావు. గొలుసులో బంగారం తీసేస్తే, ఇంక గొలుసు ఎక్కడుంది?

అలాగే, నువ్వు ఏ పదార్ధంలోనుండైనా ఆ చైతన్యాన్ని అంటే ఆ ఆత్మని తీసేస్తే, ఇంక అక్కడేమీ ఉండదు. అందుకే ఆత్మకంటే భిన్నమైనది ఏదీ లేదు అన్నారు. అంటే రెండు లేవు, ఉన్నది ఒక్కటంటే ఒక్కటే.

రమణమహర్షిగారిని బ్రహ్మము ఉందా అని అడిగినప్పుడు, "ఉన్నదే అది" అనేవారు!

## మననం చేయదగిన వాక్యాలు

(1) మనిషిని బంధించేది రూపబుద్ధి, నామబుద్ధి. ఇష్టదైవాన్ని రూపనామాలతో ప్రారంభంలో ఆరాధించినా క్రమేపి రూపనామరహిత దైవంమీద ఇష్టం పెరుగుతుంది. ఆ రకంగా సత్యాన్వేషణకి నీ మనస్సు తయారవుతుంది.

(2) గొలుసులో బంగారం తీసేస్తే ఇంక గొలుసెక్కడుంది? అలాగే నువ్వు ఏ పదార్థంలోనుండైనా ఆత్మని తీసేస్తే, ఇంక అక్కడ ఏమీ ఉండదు. అందుకే ఆత్మకంటే భిన్నమైనది ఏదీ లేదు అన్నారు.

***

## 17. ఉదాసీనభావంతో మనస్సు అంతర్ముఖం అవుతుంది

కొత్తగూడెం,
09-05-2010.

**ప్రశ్న**: శ్రీనాన్నగారికి ప్రణామములు. శ్రీశంకరాచార్యులవారు సద్వాసనాస్ఫూర్తి మరియు ఉదాసీనభావం గురించి వివేకచూడామణిలో చెప్పిన వాటిని దయచేసి వివరించండి.

**శ్రీనాన్నగారు**:

**"సూర్యకాంతి ప్రసరించినప్పుడు, గాఢమైన అంధకారం ఎలా అంతరిస్తుందో; అలాగే, సద్వాసనాస్ఫూర్తి విజృంభించినప్పుడు అహమాదివాసనలు పూర్తిగా అంతరిస్తాయి."**
(వివేకచూడామణి-319)

ఇక్కడ ఆచార్యులవారు చెప్పేది ఏమిటంటే – ఈ గదిలో వెయ్యి సంవత్సరాలనుండి చీకటి ఉందనుకో! నువ్వు ఈ గదిలో దీపం వెలిగించిన వెంటనే ఇక్కడ వెలుతురు వచ్చేస్తుంది. వెయ్యి సంవత్సరాలనుండి ఆ గది చీకటిగా వున్నంత మాత్రాన దీపం వెలిగించిన తరువాత కొంత సమయం ఏమీ పట్టదు. అంటే, ఆ చీకటి ఎంత దట్టంగా ఉన్నా, చిరకాలంగా ఉన్నా, దీపం వెలిగించగానే ఆ చీకటి పూర్తిగా పోతుంది, కాంతితో ఆ గది నిండిపోతుంది.

సద్వాసనాస్ఫూర్తి అంటే సత్ వాసనా స్ఫూర్తి. ఇంతకుముందు చెప్పుకున్నాం కదా, చిరకాలం నిత్యనిరంతరం శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి అని. అలా చేసినప్పుడు సాధకుడిలో సద్వాసనాస్ఫూర్తి విజృంభిస్తుంది. అప్పుడు ఆత్మజ్ఞానం కలిగి దేహేంద్రియాది వాసనలన్నీ పూర్తిగా అంతరిస్తాయి.

వెలుతురు రాగానే చీకటి పోయినట్టు, జ్ఞానోదయం అయిన వెంటనే అజ్ఞానం నశిస్తుంది. విద్య కలిగిన వెంటనే అవిద్య నశిస్తుంది. ఇది కలగడం, అది పోవడం ఒకేసారి జరుగుతుంది. ఆత్మబుద్ధి కలగగానే, దేహాత్మబుద్ధి నశిస్తుంది. అంటే ఆత్మబుద్ధి కలగకుండా, అనాత్మబుద్ధి పోదు.

కోటి జన్మలెత్తినా, నీకు ఉన్నది ఉన్నట్టు తెలిసేవరకు, లేనిదానిని ఉందని అనుకోవడం నువ్వు మానవు.

ఇక్కడ అహమాదివాసనలు అన్నారు. అంటే, జ్ఞానోదయం కలిగాక, దేహేంద్రియాది వాసనలన్నీ కూడా పూర్తిగా అంతరిస్తాయి అని అర్థం.

**"ఆత్మతో నీకు గల తాదాత్మ్యాన్ని దృఢం చేసుకొని, అహం మొదలైన వాటితో నీకు గల తాదాత్మ్యాన్ని త్యజించి, పగిలిన కుండ పెంకులమీదలాగ, వాటిపై ఉదాసీన భావంతో ఉండాలి."** (వివేకచూడామణి–383)

## (1) ఆత్మ

ఆత్మ అంటే ఏదో అనుకొని, మీరు కంగారు పడకండి. అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో ఏ చైతన్యమైతే ఉందో దాన్ని ఆత్మ అంటున్నారు, అంతే. దేహం ఉన్నా, లేకపోయినా; ప్రపంచం ఉన్నా, లేకపోయినా; దేవుడు ఉన్నా, లేకపోయినా; పుణ్యపాపాలు ఉన్నా, లేకపోయినా; అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో ఏదైతే ఉందో ఆ చైతన్యాన్ని ఆత్మ అన్నారు. ఇలా చెప్పి అక్కడితో ఆగడం లేదు, అది నీవై ఉన్నావు అని అంటున్నారు.

ఆత్మ వేరు, నీవు వేరు కాదు. అది నీవై ఉన్నావు. కాని దాని తాలూకు ఎరుక నీకు లేదు. కాబట్టి శాస్త్రం వచ్చింది. నీకు తెలిసి ఉంటే శాస్త్రం ఎందుకు? తెలిసినవాడికి శాస్త్రం అవసరం లేదు కదా!

## (2) ఆత్మ – తాదాత్మ్యం

తరువాత, "ఆత్మతో నీకు గల తాదాత్మ్యాన్ని దృఢం చేసుకొని" అన్నారు. ముందు ఆత్మ గురించి శ్రవణం చేస్తావు. అలా వినగా వినగా, ఏదో ఉందని తెలుస్తూ ఉంటుంది. ఏదో ఉంది అనిపిస్తుంది గాని, అది నీవు అని అనుభవంలోకి రాదు. అది నీవు అన్న సంగతి తెలియదు.

ఇప్పుడు నువ్వు కొత్తగూడెంలో ఉన్నావు. కొత్తగూడెంలో ఉన్న అభిప్రాయం సందేహం లేకుండా నీకు దృఢం అయింది అనుకో, అప్పుడు నేను వచ్చి నువ్వు భద్రాచలంలో ఉన్నావు అన్నా, నువ్వు నమ్మవు. ఇది కొత్తగూడెమేనా అని నీకు సందేహంగా ఉంటే, ఇది భద్రాచలం అని నేను అంటే, అవునేమో అని నువ్వు అనుకుంటావు.

నువ్వు ఆత్మవు అని నీకు స్థిరమైన అభిప్రాయం లేనప్పుడు, దేహం నువ్వు, మనస్సు నువ్వు అని అంటే, అది నిజమే కాబోలు అనుకుంటావు. అందుచేత ముందు నువ్వు ఆత్మవు అన్నది దృఢం అవ్వాలి.

## (3) అహం – తాదాత్మ్యం

ఆ తరువాత "అహం మొదలైన వాటితో నీకు గల తాదాత్మ్యాన్ని త్యజించి" అన్నారు. అహం అంటే "నేను ఉన్నాను". I AM. అహంకారం అంటే నేను స్త్రీని, నేను పురుషుడిని, నేను ఎక్కువవాడిని, నేను తక్కువవాడిని, నేను బాగా చదువుకున్నాను, నాకు ధనం బాగా వుంది, I am so and so అనుకుంటావు కదా, అది! అంటే నువ్వు కాని బయటి గొడవలతో తాదాత్మ్యం పొందడం అనేది అహంకారం.

"నేను ఉన్నాను" అనేదానిలో ప్రమాదం లేదు. నేను అలా ఉన్నాను, ఇలా ఉన్నాను అని అనుకోవడంతో ప్రమాదం. నేను గౌరవంగా బ్రతుకుతున్నాను అన్న తలంపు నీకు లేకపోతే, నిన్ను ఎవరైనా విమర్శించినా, నీకు ఏమీ అనిపించదు.

రమణమహర్షిగారితో ఎవరైనా తిడుతున్నారని చెబితే "తిట్టేవాళ్ళు ఎంతసేపని తిడతారు, వాళ్ళ నోళ్ళు నొప్పిపుట్టాక, వాళ్ళే ఊరుకుంటారులే!" అనేవారు.

I am so and so, I am this, I am that అని అనుకోవద్దు. నువ్వు ఉన్నావు. నువ్వుగా ఉండు ఫరవాలేదు. నేను ధనవంతురాలిని, నేను పేదరాలిని, నాకు జ్ఞానం ఉంది, లేకపోతే నాకు అజ్ఞానం ఉంది, ఇలాంటివి అనుకోవద్దు. నువ్వు ఉండు. అంటే, శరీరంగా ఉండకు, మనస్సుగా ఉండకు, డబ్బుగా ఉండకు, చదువుగా ఉండకు, నువ్వు కానిదానితో తాదాత్మ్యం పొందకు. నువ్వు డాక్టరునని అనుకుంటున్నావు. నీ లోపల ఉన్న చైతన్యం డాక్టరు కాదు. అది నీ profession (వృత్తి). ఏదో ఉద్యోగం కోసం ఆ వృత్తి నేర్చుకున్నావు. దానితో తాదాత్మ్యం పనికిరాదు.

నేను మంచివాడిని, గొప్పవాడిని అనుకుంటే, superiority complex (ఆధిక్యతా భావం) వస్తుంది. నేను చెడ్డవాడిని, తక్కువవాడిని అనుకుంటే, inferiortiy complex (న్యూనతా భావం) వస్తుంది. ఇలా అనుకోవడం వల్ల పాడైపోతావు. నీకు ధనం ఉంటే ఉండనివ్వు, నేను ధనవంతుణ్ణి అని అనుకోకు, పాడైపోతావు. నీకు డబ్బుంటే మటుకు డబ్బు నువ్వు కాదు కదా! డబ్బు నీకు ఉంది. నీకో శరీరం ఉంది, కానీ శరీరం నువ్వు కాదు కదా! నువ్వు కానిదానితో తాదాత్మ్యం పొందకు.

అంటే శరీరంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి, విషయాలతోటి అనుబంధాన్ని త్యజించాలి (వదిలేయాలి). నువ్వు కాని దాన్ని నువ్వు అనుకోవడం వల్ల నీకు దుఃఖం వస్తోంది.

నీకు ఆత్మబుద్ధి పెరిగే కొలదీ అంటే నీకు ఆత్మతోటి తాదాత్మ్యం పెరిగేకొలదీ, నువ్వు కానిదానితో తాదాత్మ్యం పొందడం తగ్గిపోతుంది.

## (4) ఉదాసీన భావం

“పగిలిన కుండ పెంకులమీదలాగా, వాటిపై ఉదాసీన భావంతో ఉండాలి.”

ఉదాసీన భావం, చాలా మంచిమాట. ఒకదానిపై ఉదాసీన భావం అంటే దాని గురించి నువ్వు ఏదీ అనుకోవద్దు అని అర్థం. అంటే దానిపై ఇష్టం వద్దు, అయిష్టం వద్దు. ఉదాసీనం అంటే తటస్థంగా ఉండడం.

నీ దేహంతోటి, మనస్సుతోటి ఉదాసీన భావంతో ఉండాలి. శరీరం ఉంటే ఉండనివ్వు. దానిమీద ఇష్టం వద్దు, అయిష్టం వద్దు. దానికి టైముకి తిండిపెట్టు. దాని కనీస అవసరాలు మాత్రం చూడు. శరీరానికి ఏదైనా రోగం వస్తే, వైద్యం చేయించు. అంతవరకే!

ఇష్టం ఉంటే రాగం వస్తుంది. అయిష్టం ఉంటే ద్వేషం వస్తుంది. రెండూ చెడ్డవే. బంగారపు సంకెళ్ళు చెడ్డవే, ఇనుప సంకెళ్ళు చెడ్డవే. రెండింటివలనా బంధింపబడతాం. అంటే, ఇష్టంవలనా బంధింపబడతాం, అయిష్టంవలనా బంధింపబడతాం. ఉదాసీనంగా ఉంటే బంధింపబడం. రాగద్వేషాలు రెండూ సంకెళ్ళే!

నువ్వు కోటి విద్యలు నేర్చుకున్నా, నీ మనస్సు అంతర్ముఖం కాకుండా ఆత్మజ్ఞానం కలగదు. ఆత్మజ్ఞానం లేకపోతే అమృతత్వం లేదు. అందుచేత నువ్వు సుఖపడాలంటే, మనస్సు అంతర్ముఖం అవ్వాలి. ఉదాసీన భావంతో ఉంటే నీ మనస్సు అంతర్ముఖం అవుతుంది. అదీ రహస్యం.

ఎవరిమీదా, దేనిమీదా ఇష్టం పెట్టుకోవద్దు, అయిష్టం పెట్టుకోవద్దు, ఉదాసీనంగా అంటే తటస్థంగా ఉండు. ఇష్టాయిష్టాలతో, రాగద్వేషాలు వస్తాయి. అదే సంసారం. సంసారం అంటే కేవలం నీ ఇంట్లో మనుషులే కాదు, నీ గుణాలే సంసారం. అందుచేత ఉదాసీనంగా ఉండు అన్నమాటను మనం గట్టిగా పట్టుకోవాలి.

## (5) సాధన

ఆత్మభావన పెరుగుతూ ఉంటే, అనాత్మభావం తగ్గుతూ ఉంటుంది. నువ్వు కొత్తగూడెంనుండి హైదరాబాదు వెళ్ళే కొలదీ, కొత్తగూడెం దూరం అవుతుంది.

ఇక్కడ ఆచార్యులవారు రెండూ చేయమంటున్నారు. అంటే ఆత్మబుద్ధిని పెంచుకుంటూ అనాత్మబుద్ధిని తగ్గించుకోమంటున్నారు.

ప్రపంచంలో ద్వంద్వాలు ఎప్పుడూ ఉంటాయి. వాటిని ప్రక్కన పెట్టి ద్వంద్వాల మధ్యనే మనం సాధన చేసుకుంటూ సంసారసాగరాన్ని దాటి ఒడ్డుకు వచ్చెయ్యాలి. ఇంట్లో గొడవలు తగ్గాక మేం సాధన చేసుకుంటాం అంటే, ఆ గొడవలు ఎప్పటికి తగ్గుతాయి? నలుగురు ఉన్నప్పుడు ఏదో ఒక గొడవ వస్తూనే ఉంటుంది. ఎండాకాలంలో వేడి గాల్పులు వస్తాయి. వర్షాకాలంలో వర్షాలు వస్తాయి, అవి సహజం. అలాగే ఇంట్లో గొడవలు కూడా మామూలే.

సముద్రస్నానానికి వెళ్ళాక, కెరటాలు తగ్గిపోయిన తరువాత మేం స్నానం చేస్తాం అనుకోవడం ఎటువంటిదో, ద్వంద్వాలు లేనప్పుడు సాధన చేయాలి అనుకోవడం కూడా అటువంటిదే అన్నాడు స్వామి వివేకానంద.

సముద్రంలో కెరటాలు వస్తాయి. అవి వాటి స్వభావం. అలాగే, ప్రపంచంలో ద్వంద్వాలు ఉంటాయి. నిన్ను పొగిడేవారు ఉంటారు, తిట్టేవారు ఉంటారు. ఆ గొడవలు ఒక ప్రక్కన పెట్టి నువ్వు సాధన చేసుకొని సంసారసాగరాన్ని దాటి ఒడ్డుకి చేరాలి!

## మననం చేయదగిన వాక్యాలు

(1) చిరకాలం నిత్యనిరంతరం శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేసినప్పుడు సాధకుడిలో సద్వాసనాస్ఫూర్తి విజృంభిస్తుంది. అప్పుడు ఆత్మజ్ఞానం కలిగి దేహేంద్రియాది వాసనలన్నీ పూర్తిగా అంతరిస్తాయి.

(2) దేహం ఉన్నా, లేకపోయినా; ప్రపంచం ఉన్నా, లేకపోయినా; దేవుడు ఉన్నా, లేకపోయినా; పుణ్యపాపాలు ఉన్నా, లేకపోయినా; అన్ని కాలాల్లో, అన్ని అవస్థల్లో ఏదైతే ఉందో, ఆ చైతన్యమే ఆత్మ. అది నీవై ఉన్నావు.

(3) నీ మనస్సు అంతర్ముఖం కాకుండా ఆత్మజ్ఞానం కలుగదు. ఉదాసీన భావంతో ఉంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది. అదీ రహస్యం.

(4) ప్రపంచంలో ద్వంద్వాలు ఎప్పుడూ ఉంటాయి. వాటిని ప్రక్కనపెట్టి, ద్వంద్వాలు మధ్యనే సాధన చేసుకుంటూ సంసారసాగరాన్ని దాటి మోక్షం పొందాలి.

✸✸✸

"యాభై సంవత్సరాలుగా రమణుడే నా జీవితానికి కేంద్రం. ఆయన జీవితమూ, బోధనలూ నన్ను చాలా ప్రభావితం చేసాయి. ఆయన నాకు లోచూపు అనుగ్రహించారు. సత్యాన్వేషకుడిగా నన్ను తీర్చిదిద్దారు" అని ఎంతో వినమ్రంగా పలికే భూపతిరాజు వెంకటలక్ష్మీ నరసింహరాజుగారిని ప్రేమతో భక్తులు "నాన్నగారు" అని పిలుస్తారు.

కొందరి మాట మధురం. కొందరి చూపు కోమలం. కొందరి నైజం కరుణాపూరితం. కొందరి హృదయం ప్రేమమయం. కొందరి ప్రేమ నిస్వార్థం. కొందరి నడవడిక నిరాడంబరం. కొందరి పరిచయం అమూల్యం. కొందరి సాంగత్యం ఆహ్లాదకరం. ఈ లక్షణాలలో కొన్ని మాత్రమే కొందరిలో ఉండవచ్చు. కాని అన్నీ రాశీభూతమై ఒక్కరిలో కనబడటం అసాధారణం. అటువంటి అసాధారణ మహామనీషి సద్గురు శ్రీ నాన్నగారు.

సత్యాన్వేషణలో సాధకులు ముందుగా తప్పనిసరిగా చదవవలసినది శ్రీ ఆదిశంకరులు రచించిన "తత్త్వబోధ' అను ప్రకరణ గ్రంథం. సార్థక నామధేయం కలిగినది. వారిచే రచింపబడిన మరో ప్రకరణ గ్రంథం 'వివేకచూడామణి'. ఈ రెండు ప్రకరణ గ్రంథాలలోని పలు విషయములపై శ్రీ నాన్నగారి అమూల్యమైన అనుగ్రహ భాషణముల సంకలనమే ఈ 'హితోపదేశం".